మీడియాకు సంబంధించిన అన్ని విషయాల కోసం 9246213493
సహాయ
మీడియా సర్వీసు రి.
3-7-255,మన్సూరాబాద్,ఎల్బీనగర్,హైదరాబాద్-68

www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

అనుక్షణం
# నవభూమి
ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 05 గురువారం | డిసెంబర్ 2024 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:3 సంచిక: 80

Navabhoomi daily fallows..

ANU FURNITURE®
HYDERABAD | BENGALURU
Call: +91 9100913033, 8688003033
RECLINER
SOFA SET 3+1+R1
Now at ₹39,990/-





## వైభవోపేతంగా నాగచైతన్య, శోభిత వివాహం

2

- అన్నపూర్ణ స్టూడియోస్‌లో ప్రత్యేక మండపంలో పెళ్లి
- హిందూ సంప్రదాయ పద్ధతిలో జరిగిన వివాహం
- సినీ,రాజకీయ, క్రీడా రంగాల ప్రముఖులు హాజరు

హైదరాబాద్-నవభూమిబ్యూరో
సినీనటుడు నాగచైతన్య, శోభిత ధూళిపాళ్ల వివాహబంధంతో ఒక్కటయ్యారు. హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపంలో బుధవారం రాత్రి వీరి వివాహం ఘనంగా జరిగింది. హిందూ సంప్రదాయ పద్ధతిలో జరిగిన ఈ వివాహానికి పలువురు సినీ, రాజకీయ, క్రీడా రంగాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. సినీ ప్రముఖులు చిరంజీవి దంపతులు, వెంకటేశ్,అల్లు అర్జున్,టి. సుబ్బరామిరెడ్డి,ఎన్టీఆర్,రామ్ చరణ్,రానా,అల్లు అరవింద్,కీరవాణి, సుహాసిని తదితరులు హాజరై కొత్త జంటను ఆశీర్వదించారు. అర్ధరాత్రి వరకు పెళ్లికి సంబంధించిన క్రతువులు జరగనున్నాయి.చైతన్య, శోభిత

## మహారాష్ట్ర సీఎంగా ఫడ్నవిస్

- ముఖ్యమంత్రి పదవిని ఆశించిన షిండేకు చుక్కెదురు..
- బీజేపీ శాసనసభా పక్ష నేతగా ఫడ్నవిస్ ఏకగ్రీవం
- ప్రతిపాదించిన విజయ్‌రూపాణి,బలపర్చిన ఆశీష్
- ఫడ్నవిస్ పదవీస్వీకార మహోత్సవానికి ముహూర్తం ఖరారు
- నేడు మహారాష్ట్ర సీఎంగా ఫడ్నవిస్ ప్రమాణం



ముంబయి-నవభూమిబ్యూరో
మహారాష్ట్ర ముఖ్యమంత్రి అభ్యర్థిపై 10 రోజుల పాటు కొనసాగిన సస్పెన్స్‌కు తెరపడింది. కొత్త ముఖ్యమంత్రిగా మాజీ డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ పేరు ఖరారైంది. కొద్దిసేపటి కిందటే- భారతీయ జనతా పార్టీ శాసన సభాపక్ష నేతగా ఎన్నికయ్యారు. బీజేఎల్పీ సభ్యులు ఏకగ్రీవంగా ఆయనను ఎన్నుకున్నారు. బుధవారం ఉదయం మహారాష్ట్ర శాసన సభ ఆవరణలోని కమిటీ హాలులో సమావేశమైంది బీజేఎల్పీ. పార్టీ కేంద్ర పరిశీలకులు నిర్మల సీతారామన్, విజయ్ రుపాణీ ప్రత్యేక ఆహ్వానితులుగా ఈ భేటీకి హాజరయ్యారు. దేవేంద్ర ఫడ్నవిస్, చంద్రశేఖర్ బవాన్‌కులె, ఆశీష్ షెలార్ సహా కొత్తగా ఎన్నికైన 132 మంది శాసన సభ్యులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయ్ రుపాణీ- బీజేఎల్పీ నేతగా దేవేంద్ర ఫడ్నవిస్ పేరును ప్రతిపాదించారు. ఆశీష్ షెలార్ దీన్ని బలపరిచారు. ఆ వెంటనే ఫడ్నవిస్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రుపాణీ ప్రకటించారు. దీనితో కమిటీ హాల్ మొత్తం కూడా చప్పట్లతో మార్మోగిపోయింది. నిర్మల సీతారామన్ ఆయనను అభినందించారు. ఆయన ఎంపికతో బీజేపీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఫడ్నవిస్ పేరును ఖరారు చేసినట్టయింది. మహాయుటిలో మిత్రపక్షాలైన శివసేన (ఏక్‌నాథ్ షిండే వర్గం), నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (అజిత్ పవార్ వర్గం) ఇక అనివార్యంగా ఫడ్నవిస్ పేరును సమర్థించాల్సిన పరిస్థితి ఏర్పడినట్ట యింది. ముఖ్యమంత్రి అభ్యర్థి తేలడంతో

## 'వన్ నేషన్ వన్ సబ్‌స్క్రిప్షన్'కు మంత్రివర్గం ఆమోదముద్ర

- దేశవ్యాప్తంగా ఉన్న కళాశాలలు విశ్వవిద్యాలయాలకు అంతర్జాతీయ స్థాయి అత్యున్నత ప్రమాణాలు కలిగిన మెటీరియల్ అందుబాటులోకి..
- విద్యార్థులు, ఉపాధ్యాయులు పరిశోధకులకు వివిధ దేశాలకు సంబంధించిన వ్యాసాలు జర్నల్స్‌ను యాక్సెస్ చేయడానికి ఈ పథకం
- 3 సంవత్సరాల్లో 6 వేల కోట్లు ఖర్చు చేసేందుకు కేంద్రం సిద్ధం

2



న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో
కొంత కొంతకాలంగా భారతీయ విద్యావిధానంలో కీలక మార్పులు జరుగుతున్నాయి. కేవలం సిలబస్ అప్‌డేట్స్‌తో మాత్రమే సరిపెట్టకుండా వికసిత భారత్ ఏ 2047 నినాదంతో పలు అధునాతన చర్యలకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా 'వన్ నేషన్ వన్ సబ్‌స్క్రిప్షన్' పథకానికి ఇటీవల కేంద్రం మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. దేశవ్యాప్తంగా ఉన్న కళాశాలలు విశ్వవిద్యాలయాలకు అంతర్జాతీయ స్థాయి అత్యున్నత ప్రమాణాలు కలిగిన మెటీరియల్ అందుబాటులో ఉంచాలని కేంద్రం భావించింది. ఇందుకోసం విద్యార్థులు, ఉపాధ్యాయులు పరిశోధకులకు వివిధ దేశాలకు సంబంధించిన వ్యాసాలు జర్నల్స్‌ను యాక్సెస్ చేయడానికి 'వన్ నేషన్ వన్ సబ్‌స్క్రిప్షన్' పథకాన్ని తీసుకొచ్చిది. ఇందుకుగాను 3 సంవత్సరాల్లో 6 వేల కోట్లు ఖర్చు చేసేందుకు రెడీ అయింది." జాతీయ విద్యా విధానం 2020 అనుసంధన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ లక్ష్యాలకు ఇది మద్దతు ఇస్తుంది. యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ ఆధ్వర్యంలోని స్వయంప్రతి పత్తి కలిగిన అంతర్-విశ్వవిద్యాలయ కేంద్రమైన ఇన్ఫర్మేషన్ అండ్ లైబ్రరీ నెట్‌వర్క్ దీని నిర్వహణ చేపట్టనుంది. జాతీయ సభ్యత్వం ద్వారా ఆయా డాక్యుమెంట్స్‌కు యాక్సెస్ అందించనుంది. ఈ మొత్తం ప్రక్రియ డిజిటల్ విధానంలో

## జగన్ పోరుబాట

- ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలు కావటంతో
- ఇక తమ పాత్ర పోషించేందుకు సిద్ధం
- రైతు, విద్యార్థుల సమస్యలపైన పోరుబాటకు సై
- నిరసనల కార్యాచరణ షెడ్యూల్ ప్రకటించిన జగన్
- 11న వైసీపీ నేతలు ర్యాలీలు,కలెక్టర్లకు వినతిపత్రాలు
- 27న విద్యుత్ ఛార్జీల పెంపుపై ఎస్ఇ,సీఎండీలకు వినతిపత్రాలు
- జనవరి 3న విద్యార్థులతో ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆందోళన
- జనవరి రెండో వారం తరువాత జిల్లాల వారీగా పర్యటనలు



2

అమరావతి-నవభూమిబ్యూరో
మాజీ సీఎం జగన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలు కావటంతో ఇక తమ పాత్ర పోషించేందుకు సిద్ధమయ్యారు. ఎన్నికల్లో ఓటమి తరువాత కూటమి ప్రభుత్వం పైన మీడియా సమావేశాల ద్వారా టార్గెట్ చేస్తున్న జగన్..ఇక, పార్టీ నిరసనలకు నిర్ణయించారు. రైతు, విద్యార్థుల సమస్యల పైన పోరుబాటకు డిసైడ్ అయ్యారు. ఈ మేరకు నిరసనల కార్యాచరణ షెడ్యూల్ ప్రకటించారు. జనవరి రెండో వారం తరువాత జిల్లాల వారీగా పర్యటనల ప్రారంభిస్తానని జగన్ మరోసారి స్పష్టం చేసారు. వైసీపీ పోరుబాట మాజీ సీఎం జగన్ పార్టీ రాష్ట్ర స్థాయి సమావేశంలో నేతలకు కీలక దిశా నిర్దేశం చేసారు. ఆరు నెలల సమయం వేచి చూసినా ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని పేర్కొన్నారు. ప్రజల తరపున పోరాటాలు చేయాల్సిన సమయం వచ్చిందని వివరించారు. అందులో భాగంగా ముందు గా రైతులు, విద్యార్థుల సమస్యల పైన నిరసనలకు నిర్ణయించారు. రైతులకు రూ 20 వేల పెట్టుబడి సాయంతో పాటుగా ధాన్యానికి మద్దతు ధర, ఉచిత పంటల భీమా పునరుద్దరణ డిమాండ్‌తో ఈ నెల 11న వైసీపీ నేతలు ర్యాలీలు చేయనున్నారు. కలెక్టర్లకు వినతి పత్రాలు ఇవ్వాలని నిర్ణయించారు. ప్రభుత్వ వైఫల్యాలపై ఇక, ఈ నెల 27వ తేదీన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పెంచిన కరెంట్ ఛార్జీల పైన అన్ని జిల్లాల్లోని విద్యుత్ ఎస్ఈ కార్యాలయాలు..సీఎండీ కార్యాలయాలకు స్థానిక ప్రజలతో వెళ్లి వినతి పత్రాలు ఇవ్వాలని డిసైడ్ అయ్యారు. కరెంట్ ఛార్జీల పెంపును తక్షణమే ఉప సంహరించుకోవాలని వైసీపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అదే విధంగా.. జనవరి 3న ఫీజు రీయంబర్స్‌మెంట అంశం పైన పోరు బాట పట్టాలని జగన్ నిర్ణయించారు. విద్యార్థుల కు పెండింగ్ బకాయిలు విడుదల చేయాలనే డిమాండ్ తో విద్యార్థులతో కలిసి జనవరి 3న అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాలకు వెళ్లి వినతి పత్రం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. ఇక ప్రజల్లోనే ఉండేలా విద్యార్థులకు ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయాలని.. వసతి దీవెన బకాయిలు తక్షణమే చెల్లించాలని వైసీపీ డిమాండ్ చేస్తోంది. జనవరి రెండో వారం తరువాత జిల్లాల పర్యటన ప్రారంభిస్తానని జగన్ మరోసారి తాజా

## భయపెట్టిన భూకంపం

- ఉదయం 7.27 గంటలకు కొన్ని సెకన్లపాటు కంపించిన భూమి
- భూకంపం తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.3గా నమోదు
- ములుగు కేంద్రంగా 40 కిలోమీటర్ల లోతున భూకంపం
- తెలంగాణని పలు జిల్లాలతోపాటు ఏపీలోనూ ప్రకంపనలు
- మేడారం గద్దెల వద్ద సీసీ కెమెరాల్లో ప్రకంపనల రికార్డు

2

హైదరాబాద్-నవభూమిబ్యూరో: ములుగు కేంద్రంగా సంభవించిన భూకంపం తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. ఉదయం 7.27 గంటలకు కొన్ని సెకన్లపాటు కంపించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.3గా నమోదైంది. భూకంప కేంద్రాన్ని ములుగులో భూమికి 40 కిలోమీటర్ల లోతున గుర్తించారు.
హైదరాబాద్‌తోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, రాజమండ్రి, విశాఖపట్టణం, జగ్గయ్యేఎట, నందిగామ, ఏలూరు సహా పలు ప్రాంతాల్లోనూ భూమి కంపించింది. ములుగులో ఏర్పడిన భూకంప తీవ్రతకు మేడారంలోని

### భూకంపాలకు కాళేశ్వరం ఓ కారణం

- ఎన్‌జీఆర్ఐ రిటైర్డ్ శాస్త్రవేత్త పూర్ణచంద్ర రావు ఆసక్తికర విషయాలు వెల్లడి
- కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించిన ప్రాంతం మొత్తం డిజాస్టర్‌కు అనుకూలం



2

## పెద్దపల్లిపై వరాల జల్లు

- పెద్దపల్లి జిల్లా పర్యటన నేపథ్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం
- పెద్దపల్లి రూరల్, మహిళా, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ మంజూరు
- పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రిని 100 పడకలకు పెంచేందుకు అనుమతి
- పెద్దపల్లికి నాలుగు వరుసల బైపాస్ రోడ్ మంజూరు
- మంథనిలో 50 పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణానికి ఉత్తర్వులు
- పెద్దపల్లితోపాటు ములుగు జిల్లాకు ఆర్టీసీ డిపోలను మంజూరు

2



పెద్దపల్లి-నవభూమిబ్యూరో
పెద్దపల్లి జిల్లాపై తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరాల జల్లు కురిపించారు. పెద్దపల్లి జిల్లా పర్యటన నేపథ్యంలో ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. పెద్దపల్లి రూరల్ పోలీస్ స్టేషన్, మహిళా పోలీస్ స్టేషన్ తోపాటు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను మంజూరు చేశారు సీఎం రేవంత్. అంతేగాక, పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రిని 100 పడకలకు పెంచేందుకు అనుమతి ఇచ్చారు. పెద్దపల్లికి నాలుగు వరుసల బైపాస్ రోడ్ మంజూరు చేశారు. మంథనిలో 50 పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణానికి ఉత్తర్వులు జారీ చేశారు. గుంజపడుగులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు అనుమతిచ్చారు. మరోవైపు, పెద్దపల్లితోపాటు ములుగు జిల్లాకు ఆర్టీసీ డిపోలను మంజూరు చేశారు. ములుగు జిల్లాకు సంబంధించిన డిపోను ఏటూరునాగారంలో ఏర్పాటు చేయనున్నారు. కొత్త డిపోల మంజూరు సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆయా జిల్లాలకు శుభాకాంక్షలు తెలిపారు. 10-15 ఏళ్ల తర్వాత రెండు కొత్త ఆర్టీసీ డిపోలు ఏర్పాటు చేసున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కొత్త డిపోల ద్వారా ఆ ప్రాంత వాసులకు, మూడు రాష్ట్రాల సరిహద్దు ప్రయాణికులకు ప్రయోజనం చేకూరుతుందని ఆయన అన్నారు.

**రోశయ్య విగ్రహ ఏర్పాటుకు కృషి**

తెలంగాణ రాష్ట్రం ఆర్థికంగా ప్రగతి బాటలో పయనించాలంటే ఆర్యవైశ్యుల పాత్ర ఎంతో ఉంటుందని, అందుకోసం ప్రతి ఒక్కరూ ముందు భాగాన ఉండి పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్య మంత్రి స్వర్గీయ కొణిజేటి రోశయ్య మూడవ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రప టానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. ఆర్యవైశ్య ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు హైదరాబాద్‌లో ఏదైనా మంచి ప్రదేశాన్ని గుర్తిస్తే అక్కడ రోశయ్య విగ్రహ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నాలుగో వర్ధంతిలోపు విగ్రహ ఏర్పాటు

## నామినేటెడ్ పోస్టుల మరో జాబితా సిద్ధం

- ఇప్పటి రెండు విడతలుగా పదవులు
- తొలి జాబితాలో 21 మందికి, రెండో జాబితాలో 59 మందికి అవకాశం
- మూడో విడత జాబితాకై ఆశావహుల ఎదురుచూపులు
- ఎమ్మెల్యే సీట్లను త్యాగం చేసిన సీనియర్లకే ఛాన్స్
- త్వరలో 60కి పైగా కార్పొరేషన్లు భర్తీ

2

అమరావతి-నవభూమిబ్యూరో
ఏపీలో కూటమి ప్రభుత్వం మరో కీలక ప్రకటనకు సిద్ధమైంది. కూటమి అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తవుతోంది. ఎన్నికల్లో పని చేసిన మూడు పార్టీల నేతలు తమకు నామినేటెడ్ పదవుల పైన ఆశలు పెట్టుకున్నారు. ఆశావాహుల సంఖ్య భారీగా ఉంది. ఇప్పటికే రెండు జాబితాలను ప్రకటించారు. ఇంకా, చాలా మంది పదవులు దక్కుతాయనే నమ్మకంతో ఉన్నారు. తాజాగా సీఎం చంద్రబాబు -

## ఏపీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

- ఏపీలో త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
- ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ కీలక ప్రకటన
- ఉచిత ప్రయాణాన్ని అమలు చేస్తున్న రాష్ట్రాల్లో అధ్యయనం
- ఇప్పటికే అధికారులు సర్కార్‌కు నివేదిక సమర్పణ
- త్వరలోనే విధివిధానాల ఖరారు..భద్రతకే ప్రాధాన్యం

అమరావతి-నవభూమిబ్యూరో
ఏపీలో రాజకీయ లెక్కలు వేగంగా మారుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తవుతోంది. ఇప్పటి వరకు మౌనంగా ఉన్న వైసీపీ రైతులు..విద్యార్థుల సమస్యల పైన పోరాటం చేయాలని నిర్ణయించింది. అటు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల్లో సిలిండర్ల పంపిణీ ఇప్పటికే ప్రారంభించింది. జనవరి లో కొత్త పథకాలు అమలు పైన కసరత్తు జరుగుతోంది. ఇదే సమయంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు పైన ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ కీలక ప్రకటన చేసారు. ఏపీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు పైన ఇప్పటికే అధికారులు ప్రభుత్వానికి

## ఏపీలో అర్హులందరికీ ఉచిత విద్యుత్

- గత వైసీపీ సర్కారు హయాంలో ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్
- ఈ సదుపాయాన్ని కట్ చేసిందంటూ సోషల్ మీడియాలో ప్రచారం
- ఈ ప్రచారాన్ని నమ్మొద్దంటూ విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి ప్రకటన



అమరావతి-నవభూమిబ్యూరో
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ కుటుంబాలకు ఇచ్చే 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకంపైన ఏపీలో సోషల్ మీడియా వార్ కొనసాగుతుంది. గతంలో వైసిపి హయాంలో ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించామని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దానిని కట్ చేసిందని వైసిపి సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తున్న క్రమంలో ఏపీ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కీలక ప్రకటన చేశారు. ఆ ప్రచారం నమ్మొద్దు అర్హులైన ప్రతి ఎస్సీ ఎస్టీ కుటుంబాలకు 200 యూనిట్ల వరకు కూటమి ప్రభుత్వం ఉచిత విద్యుత్ ను అందిస్తోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. బడుగు బలహీన వర్గాలకు చెందిన అల్పాదాయ కుటుంబాలకు అందిస్తున్న ఉచిత విద్యుత్ కు సంబంధించి కావాలని దుష్ప్రచారం చేస్తున్నారని ఆ దుష్ప్రచారాన్ని నమ్మొద్దు అన్నారు. " ఏపీలో ఉచిత విద్యుత్ లబ్దిదారుల కుటుంబాలు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది ఎస్సీ ఎస్టీ కుటుంబాలు ఉచిత విద్యుత్ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మొత్తం 15 లక్షల 17298 మంది ఎస్సీ కుటుంబాలు, 4 లక్షల 75, 557 మంది ఎస్టీ కుటుంబాలు ఉచిత విద్యుత్ పథకంలో లబ్ధిదారులుగా ఉన్నారని మంత్రి స్పష్టం చేశారు. మొత్తంగా ఆంధ్రప్రదేశ్

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in




## దివ్యాంగులకు పింఛన్ పెంపు ఎప్పుడంటే.. సీతక్క కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్-నవభూమి:** దివ్యాంగులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. త్వరలోనే దివ్యాంగుల పెన్షన్లు పెంచుతామని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ(సీతక్క) హామీ ఇచ్చారు. యూపీఏ ప్రభుత్వం ఇచ్చిన పెన్షన్లనే మోదీ ప్రభుత్వం కొనసాగిస్తుందని తెలిపారు. రవీంద్రభారతిలో జ్యోతి వెలిగించి మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. ప్రపంచ దివ్యంగుల దినోత్సవం సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్న ముత్తినేని వీరయ్య, అనిత రామచంద్రన్, శైలజాలకు అభినందనలు చెప్పారు. దివ్యాంగుల సంఘాలకు, కుటుంబ సభ్యులకు పేరుపేరునా అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గత పదేళ్లుగా వికలాంగుల పింఛన్ పెంచట్లేదని ఆరోపించారు. దివ్యాంగులకు నెలకు రూ.300 పించనే మాత్రమే కేంద్రం ఇస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం దివ్యాంగుల పెన్షన్ పెంచాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం పెన్షన్ల వాటాను పెంచాలని కోరారు. ప్రధాని మోదీకి దగ్గరగా ఉన్న ఎంపీలు, మద్దతుగా ఉండే నాయకులు కేంద్ర ప్రభుత్వం పింఛన్లు పెంచేలాగా చొరవ తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వాలు పింఛన్లు పెంచినా కేంద్ర ప్రభుత్వం ఎందుకు పెంచట్లేదని ప్రశ్నించారు. మహిళల వేషధారణలను కించపరచడం తగదని మంత్రి సీతక్క అన్నారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై బంజారాహిల్స్ పీఎస్‌లో కేసు నమోదు



**హైదరాబాద్-నవభూమి:** బీఆర్ ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆయనతో పాటు 20 మంది అనుచరులపై సైతం కేసు నమోదైంది. విధులను అడ్డగించడంతో పాటు బెదిరింపుల కు దిగారని ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే, ఫోన్ ట్యాపింగ్ అంశంపై ఫిర్యాదు చేసేందుకు పాడి కౌశిక్‌రెడ్డి పీఎస్‌కు చేరుకున్న విషయం తెలిసిందే. అయితే, సీఎం రేవంత్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ ఐజీ శివధర్‌రెడ్డి కలిసి తన ఫోన్‌ని ట్యాప్ చేస్తున్నారని.. వీరిద్దరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఫిర్యాదు చేసేందుకు ఆయన పీఎస్‌కి వెళ్లారు.

బంజారాహిల్స్ ఏసీపీకి ఉదయం ఫోన్ చేస్తే 3 గంటలకు రమ్మన్నారని.. తాను స్టేషన్‌కు వెళ్లేకన్నా ముందే ఏసీపీ వెళ్లిపోయారని.. సీఐ సైతం వెళ్లిపోయేందుకు ప్రయత్నిస్తే తనతో పార్టీ కార్యకర్తలు ప్రశ్నించారన్నారు. తాను ఎమ్మెల్యే అనే గౌరవం లేకుండా సీఐ ప్రవర్తించారని.. డీజీపీ కన్నా ఎక్కువ ప్రోటోకాల్ ఎమ్మెల్యేకు ఉంటుందని సీఐకి ఉంటుందని.. పదవులు లేని సీఎం సోదరులకు పోలీసులు వంగి వంగి దండాలు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఓ మిత్రుడి పార్టీకి వెళితే శివధర్ రెడ్డి ఫోన్ ట్యాప్ చేసి.. అక్కడికి పోలీసులను పంపారని.. నా దగ్గర డ్రగ్స్ పెట్టించి కేసు పెట్టించాలని శివధర్ రెడ్డి ప్రయత్నించారన్నారు. సీఎం రేవంత్, శివధర్రెడ్డిపై కేసు నమోదు చేయాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు.

## తెలంగాణలోని పలు చెక్‌పోస్టుల్లో ఏసీబీ అధికారుల దాడులు

**హైదరాబాద్-నవభూమి:** రాష్ట్రంలోని పలు చెక్‌పోస్టుల్లో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పలు చెక్‌పోస్టుల్లో 7 ఏసీబీ బృందాలు సోదాలు నిర్వహించాయి. లెక్కలు చూపని నగదును ఏసీబీ బృందాలు సీజ్ చేశాయి. విష్ణుపురం చెక్‌పోస్టులో రూ. 86,500, భోరజ్(ఆదిలాబాద్) చెక్‌పోస్టులో రూ. 62,500, అలంపూర్ చెక్‌పోస్టులో రూ. 29,200 సీజ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ చెక్‌పోస్టుల్లో అవినీతికి పాల్పడుతున్న అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏసీబీ అధికారులు స్పష్టం చేశారు.

## లక్ష చెట్లు కూలిన 95 రోజుల్లోనే 5.3 తీవ్రతతో భూకంపం.. మేడారంలో ఏం జరుగుతోంది?



**హైదరాబాద్-నవభూమి:** పచ్చని తాడ్వాయిపై ప్రకృతి కన్నెర్ర చేసినట్లు ఉంది. సుమారు లక్ష చెట్లు కూలిన .. 95 రోజుల్లోనే.. ఆ ప్రాంతం మళ్లీ ప్రకృతి ప్రకోపానికిగురైంది. ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీన వచ్చిన వర్షం, ఈదురుగాలులతో.. మేడారం అడవుల్లో సుమారు 85 వేల చెట్లు కూలాయి. దాంట్లో భారీ వృక్షాలు ఉన్నాయి. సుమారు 50 నుంచి వంద ఏండ్ల నాటి మహావృక్షాలు కూడా ఆ నాటి ప్రకృతి ప్రకోపానికి నేలరాలాయి. అయితే ఇవాళ ఆ ప్రాంతమే కేంద్రంగా భూకంపం సంభవించింది. ములుగు జిల్లాలోని మేడారం కేంద్రంగా 5.3 తీవ్రతతో భూమి కంపించింది. భూమిలో సుమారు 40 కిలోమీటర్ల లోతులో భూకంప తీవ్రత నమోదు అయ్యింది.తాడ్వాయి అడవుల్లో ఆగస్టు 31న జరిగిన ప్రకృతి బీభత్సం కారణంగా రూ.152.64 కోట్ల నష్టం వాటిల్లిం దని అటవీ అధికారులు ఇటీవల అంచనా వేశారు. ఆ నాటి భారీ వర్షానికి బలమైన గాలులు తోడు కావడంతో తాడ్వాయి, ఏటూరునాగా రం, గోవిందరావుపేట మండలాల్లోని అడవులకు తీవ్ర నష్టం కలిగింది. 332.02 హెక్టార్లలో 85,125 చెట్లు కూలిపోవడమో, విరిగిపోవడమో జరిగిందని అధికారులు డ్రోన్ ఫొటోలు, వీడియోల ద్వారా అంచనా వేశారు.ములుగు జిల్లాలో జరిగిన ప్రకృతి విపత్తుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సెప్టెంబర్ 11వ తేదీన తన ట్విట్టర్ అకౌంట్‌లో ఓ వీడియోను పోస్టు చేశారు. సుమారు లక్షకుపైగా చెట్లు మేడారం అడవుల్లో కూలాయని, వాతావరణ మార్పులు, పర్యావరణ సమస్యలను పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని ఆ ట్వీట్‌లో ఆయన తెలిపారు. ప్రకృతి విపత్తులను అడ్డుకోవాలంటే కలిసికట్టుగా పర్యావరణ సంరక్షణ చేపట్టాలని ఆయన ఆ ట్వీట్‌లో కోరారు.

## చిచ్చు రేపిన సినీ- పొలిటికల్ ఫ్లెక్సీ

**పాకాల-నవభూమి:** పాకాలలో సినీ-పొలిటికల్ ఫ్లెక్సీ వైసీపీ, టీడీపీ వర్గీయుల నడుమ చిచ్చు రేపింది. ఆర్టీసీ బస్టాండు సమీపంలోని సినిమా థియేటర్‌లో బుధవారం పుష్ప-2 సినిమా విడుదల సందర్భంగా అల్లు అర్జున్ అభిమానులు పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు పెట్టారు. వైసీపీ నేత మునీర్ కుమారుడు అఫ్రీద్ కూడా అల్లు అర్జున్‌తో పాటు మాజీ సీఎం జగన్, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఫొటోలతో ఫ్లెక్సీ పెట్టారు. సినీ ఫ్లెక్సీల్లో నేతల ఫొటోలు, వ్యాఖ్యలపై టీడీపీ మద్దతుదారులు అభ్యంతరం తెలిపారు. తొలగించాలని పట్టుబట్టడంతో ఇరువర్గాల నడుమ వివాదం తలెత్తింది. ఫ్లెక్సీ తొలగింపునకు అంగీకరించకపోవడంతో టీడీపీ వర్గీయులు చించేశారు. దీంతో వైసీపీ వర్గీయులు రాళ్లతో దాడి చేశారు. అదే సమయంలో వైసీపీకి చెందిన వారు కర్రలతో భారీగా చేరుకున్నారు. టీడీపీ వర్గీయులూ రావడంతో ఇరువర్గాలూ వాగ్వాదానికి, తోపులాటకూ దిగాయి. ఈ క్రమంలో ఓ టీ స్టాల్ పాక్షికంగా ధ్వంసమైంది.

## మళ్లీ భూప్రకంపనలు వచ్చే అవకాశం ఉంది: ఎన్‌జీఆర్ఐ సైంటిస్టులు



**హైదరాబాద్-నవభూమి:** తెలుగు రాష్ట్రాల్లో బుధవారం ఉదయం భూ ప్రకంపనలు భయాందోళనలకు గురిచేశాయి. ములుగు కేంద్రంగా వచ్చిన ఈ భూకంపం ప్రభావంతో దాదాపు 225 కి.మీ. వ్యాసార్థంతో భూమి 5 సెకండ్ల దాకా కంపించింది. ఈ నేపథ్యంలో భూ ప్రకంపనలకు గల కారణాలపై ఎన్‌జీఆర్ఐ శాస్త్రవేత్తలు స్పందించారు.

భూకంప తీవ్రత 6 వరకు ఎలాంటి ప్రమాదం లేదని ఎన్‌జీఆర్ఐ సైంటిస్ట్ డాక్టర్ శేఖర్ తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లో భూ ప్రకంపనలు కామన్ అని చెప్పారు. మళ్లీ భూ ప్రకంపలు వచ్చే అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. అయితే తమ అంచనా ప్రకారం భూ ప్రకంపనల తీవ్రత 6కు మించకపోవచ్చని అభిప్రాయపడ్డారు. 1969లో భద్రాచలంలో అత్యధికంగా 5.7 తీవ్రతతో నమోదైందని తెలిపారు. భూప్రకంపనలతో భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని చెప్పారు.కాగా, గోదావరి పరివాహక ప్రాంతంలో భూ ప్రకంపనలు వచ్చాయని ఎన్‌జీఆర్ఐ డైరెక్టర్ తెలిపారు. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలపైనే ఎక్కువ ప్రభావం ఉందని పేర్కొన్నారు. నది పరివాహక ప్రాంతాల నుంచి 300 కి.మీ.వరకు భూకంప ప్రభావం ఉంటుందని అన్నారు. అందువల్లే హైదరాబాద్‌లో భూమి కంపించిందని వివరించారు. మళ్లీ భూ ప్రకంపనలు వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పాత భవనాలు, పగుళ్లు వచ్చిన భవనాలను ఖాళీ చేయడం మంచిదని సూచించారు.

## బీటెక్ మేనేజ్‌మెంట్ కోటా ఫీజులో భారీ పెంపు.. మూడు రెట్లు పెంచే ఛాన్స్!



**హైదరాబాద్-నవభూమి:** రాష్ట్రంలోని బీటెక్ మేనేజ్‌మెంట్ కోటా ఫీజులను ఖరారు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. బీ-క్యాటగిరీ కోటా ఫీజులను కన్వీనర్ కోటా సీట్ల ఫీజుకు అదనంగా మూడు రెట్లు పెంచే అవకాశముంది. సాక్షాత్తు ప్రభుత్వమే అధికారింగా ఫీజులను పెంచనుంది. ఇందుకు మూడు ప్రతిపాదనలు రూపొందిం చిన ఉన్నత విద్యామండలి త్వరలో నే ప్రభుత్వం ముందుంచనుంది.

రాష్ట్రంలో బీటెక్ బీ-క్యాటగిరీ సీట్ల భర్తీలో అక్రమాలు జరుగుతున్నాయి. సీఎస్ఈ వంటి డిమాండ్ ఉన్న సీట్లను రూ. 14-16లక్షలకు అమ్ముకుంటున్న దాఖలాలున్నాయి. దీంతో బీ-క్యాటగిరీ సీట్లను ఆన్‌లైన్‌లో భర్తీచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు కొన్ని కాలేజీలు సైతం సుముఖత వ్యక్తంచేశాయి. కన్వీనర్‌యే ఈ సీట్లను భర్తీచేయనుండటంతో తొలుత ఫీజులను ఖరారు చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే ఉన్నత విద్యామండలి పలు ప్రతిపాదనలను సిద్ధం చేసింది.

ఇవి ప్రతిపాదనలు..బీ-క్యాటగిరీ సీట్లను ప్రభుత్వమే కౌన్సెలింగ్ ద్వారా భర్తీచేస్తుంది. ఫీజులు ప్రభుత్వ పరిధిలో ఉండవు. నిర్ణయించిన ఫీజులను కాలేజీలు వసూలు చేసుకుంటాయి. మెరిట్ ఉన్నవారికే సీట్లొస్తాయి. బీ-క్యాటగిరీ సీట్ల ఫీజులు కన్వీనర్ కోటా కన్నా మూడు రెట్లు, సీ-క్యాటగిరీ ఫీజులు మరో రెండు రెట్లు అధికంగా ఉంటాయి.

బీ-క్యాటగిరీ, సీ-క్యాటగిరీ సీట్లకు ఫీజులను ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. కన్వీనర్ కోటా కన్నా మూడు రెట్లు ఫీజులు అధికంగా ఉంటాయి. టీఏఎఫ్ఆర్‌సీ ఒక కాలేజీ ఫీజు రూ.1.3 లక్షలుగా ఖరారుచేస్తే, బీ-క్యాటగిరీ కింద రూ.3.9లక్షలు, సీ-క్యాటగిరీ కింద మరో రెండు రెట్లు అనుమతిస్తాయి.నీట్‌లో ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి అనుసరిస్తున్న విధానాన్ని అనుసరించాలని మరో ప్రతిపాదన చేశారు. దీంట్లోనూ సీట్ల భర్తీ ఆన్‌లైన్‌లో ఉంటుంది.

# భయపెట్టిన భూకంపం

(1వపేజీ తరువాయి)సమ్మక్క-సారలమ్మ గద్దెలు కంపించాయి.

గద్దెల వద్ద ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల్లో భూకంపం నమోదైంది. భక్తులు పూజలు చేస్తుండగా ఒక్కసారిగా కంపించింది. అయితే, పూజల్లో నిమగ్నమైన భక్తులు అదేమీ పట్టించుకోలేదు. మరో గద్దె వద్ద ఏర్పాటు చేసి సీసీ కెమెరాలో అక్కడున్న పూజారి తీవ్రతను అనుభవించడం కనిపించింది. ఏం జరిగిందో తెలియక ఆయన అయోమయంగా దిక్కులు చూస్తుండిపోయాడు.బుధవారం ఉదయం తెలుగు రాష్ట్రాలను భూ ప్రకంపనలు కలవర పెట్టాయి. ముఖ్యంగా హైదరాబాద్ పలు చోట్ల ప్రకంపనలు రావడంతో జనాలు బయటకు పరుగులు పెట్టారు. అయితే భూ కంపాలు ఎందుకు వస్తాయో తెలుసుకుందాం. భూమి క్రస్ట్‌లో టెక్టోనిక్ ప్లేట్లు ఉంటాయి. మన భాషలో చెప్పుకోవాలంటే.. ప్లేట్లు ఉంటాయి. ఇవి నిరంతరం అత్యంత నెమ్మదిగా కదులుతాయి. ఒక్కోసారి వీటి కదలికలు వేగంగా జరిగినప్పుడు భూ కంపాలు వస్తాయి. వీటి తీవ్రత పలకాలు ఢీకునే స్పీడ్, అలాగే లోతును బట్టి ఉంటుంది. ఎక్కువ లోతులో భూకంప కేంద్రం ఉంటే తీవ్రత కాస్త తక్కువగా ఉండే అవకాశం ఉంది. ప్లేట్ల కదలడంతో పాటు భూగర్భజలాల ప్రవాహంలో మార్పుల వల్ల కూడా ప్రకంపనలు వస్తాయి. ఇక సముద్రంలో భూకంపం వస్తే దాన్న సునామీగా పరిగణిస్తారు. అంటే సముద్రం అడుగు భాగంలో భూమి ఉంటుంది. ఆ భూమికి కింద ప్రకంపనలు రావడం వల్ల సునామీ వస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇండియాలో భూకంపం వచ్చే ప్రాంతాలను తీవ్రత ఆధారంగా వర్గీకరించారు. జోన్ 2, 3, 4, 5లుగా విభజించారు. 'అధిక తీవ్రతతో వచ్చే భూకంపాలు ప్రాంతాలను జోన్ 5లో చేర్చారు. ఇందులో హిమాచల్ ప్రదేశ్‌లోని పశ్చిమ భాగం, ఉత్తరాఖండ్‌లోని తూర్పు భాగం, గుజరాత్‌లోని కచ్, ఉత్తర బీహార్‌లో కొంత భాగం, భారతదేశంలోని అన్ని ఈశాన్య రాష్ట్రాలు, అండమాన్ నికోబార్ దీవులు, జమ్మూకాశ్మీర్‌లోని కొన్ని ప్రాంతాలు ఉన్నాయి. ఇక జోన్ 4లో భారీ భూకంపాలు వచ్చే ప్రాంతాలు ఉన్నాయి. ఇందులో లడఖ్, జమ్మూకాశ్మీర్‌లోని కొన్ని ప్రాంతాలు, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, హర్యానాలోని కొన్ని ప్రాంతాలు, పంజాబ్‌లోని కొన్ని ప్రాంతాలు, ఢిల్లీ, సిక్కిం, ఉత్తరప్రదేశ్‌లోని ఉత్తర భాగం, బీహార్, పశ్చిమ బెంగాల్‌లోని కొన్ని ప్రాంతాలు ఉన్నాయి. జోన్ 4 కంటే తక్కువ తీవ్రత వచ్చే ప్రాంతాలను జోన్ 3 చేర్చారు. ఇందులో ఉత్తరప్రదేశ్, హర్యానాలోని కొన్ని ప్రాంతాలు, కేరళ, గోవా, లక్షద్వీప్ దీవులు, గుజరాత్, పంజాబ్‌లోని కొన్నిప్రాంతాలు, పశ్చిమ బెంగాల్‌లోని కొన్ని ప్రాంతాలు, పశ్చిమ రాజస్థాన్, మధ్యప్రదేశ్, బీహార్‌లోని పలు ప్రాంతాలు, ఉత్తర జార్కండ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర,లోని కొంత భాగం, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ కొన్ని ప్రాంతాలు, తెలంగాణలోని కొన్ని ఏరియాలు, తమిళనాడు కర్ణాటకలోని కొంత భాగం ఇందులో ఉన్నాయి.

# భూకంపాలకు కాళేశ్వరం ఓ కారణం

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** తెలుగు రాష్ట్రాల్లో బుధవారం ఉదయం 7:27 గంటల ప్రాంతంలో పలు చోట్ల భూమి కంపించింది. తెలంగాణలోని ములుగులో 5.3 తీవ్రతతో వచ్చిన ఈ భూకంప తీవ్రత రెండు తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో ప్రజలను భయాందోళనకు గురి చేసింది. ఈ సమయంలో ఈ భూకంపాలపై శాస్త్రవేత్తలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అవును... తెలుగు రాష్ట్రాల్లో బుధవారం ఉదయం పలుచోట్ల భూమి కంపించిన సంగతి తెలిసిందే. ఏపీలోనూ, తెలంగాణలోనూ పలు జిల్లాల్లో భూప్రకంపనలు వచ్చాయి. అయితే... తెలంగాణ రాష్ట్రంలో గత మూడేళ్లుగా సంభవించిన భూకంపాల్లో ప్రతీ ఏటా దాదాపు ఒకే ప్రాంతంలో.. ములుగు చుట్టుపక్కల భూమి కంపించడాన్ని గుర్తించినట్లు నిపుణులు పేర్కొన్నారు. కాకపోతే గత మూడేళ్లుగా వచ్చిన భూకంపాలతో పోలిస్తే రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత ఎక్కువని పేర్కొన్నారు. ఇందులో భాగంగా.. 2021లో గడ్చిరోలి సమీపంలో 4.0 తీవ్రతతో భూమి కంపించగా.. 2022లో 3.8, 2023లో భద్రాద్రిలో 3.6 తీవ్రతతో భూకంపాలు సంభవించాయి. తాజాగా భూకంప తీవ్ర 5.3గా నమోదైంది! పెద్ద పెద్ద భూకంపాలు వచ్చే అవకాశం లేదు!: తెలుగు రాష్ట్రాల్లో బుధవారం ఉదయం అలజడి సృష్టించిన భూ ప్రకంపనలపై నేషనల్ జియో ఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఎన్.జీ.ఆర్.ఐ.) రిటైర్డ్ శాస్త్రవేత్త పూర్ణచంద్ర రావు ఆసక్తికర విషయాలు వెల్లడిం చారు. ఇందులో భాగంగా.. తెలుగు రాష్ట్రాల్లో పెద్ద పెద్ద భూకంపాలు వచ్చే అవకాశం లేదని.. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. అయితే.. తెలుగు రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం గతంలోనూ భూకంపాలు సంభవించాయని.. ప్రధానంగా గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో భూమి లోపల పగుళ్లు ఏర్పడతాయని.. వాటి సర్దుబాటు వల్ల అప్పుడప్పుడూ భూకంపాలు వస్తాయని అన్నారు. తాజాగా సంభవించిన భూకంపంలో ప్రధాన కంపనం పూర్తయ్యిందని.. దీనితో పాటు ఇంకా చిన్న చిన్న కంపాలు వస్తే రావొచ్చని అన్నారు. అయితే... తాజాగా సంభవించిన 5.3 తీవ్రతవల్ల పెద్దగా డ్యామేజీ కాదనే తాను భావిస్తున్నట్లు తెలిపారు. గతంలోనూ వరంగల్, ఖమ్మం, భద్రాచలం ప్రాంతాల్లో గతంలోనూ భూకంపాలు వచ్చాయని.. వీటిలో భద్రాచలంలో 1969లో 5.7 తీవ్రతతో సంభవించిందే పెద్ద భూకంపమని అన్నారు. 1967లో ఒంగోలు లో కూడా వచ్చిందని.. వాటి తర్వాత తాజాగా సంభవించిందే పెద్దదని తెలిపారు. భూకంపానికి కాళేశ్వరం ప్రాజెక్టు ఓ కారణం!: తాజాగా తెలుగు రాష్ట్రాల్లో సంభవించిన భూకంపానికి కాళేశ్వరం ప్రాజెక్ట్ సైతం ఓ కారణం అని సీనియర్ భూగర్భ శాస్త్రవేత్త బీవీ సుబ్బారావు వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో వాటర్ స్టోర్ చేయడం వల్ల ఒత్తిడి పెరిగి, ఇటువంటివి సంభవిస్తాయని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించిన ప్రాంతం మొత్తం డిజాస్టర్ కు అనుకూలంగా ఉంటుందని అన్నారు. ఈ విషయాన్ని కేంద్రం సైతం వెల్లడించిందని చెబుతున్నారని చెప్పిన సుబ్బారావు... కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కారణంగా భూమిలో నీరు బాగా పెరిగిందని.. ఎప్పుడైతే భూమిలో నీరు పెరుగుతుందో.. అప్పుడు భూమిలోపల ఫలకాల మధ్య కదలికలు తేలిక అవుతాయని.. ఫలితంగా భూకంపాలు వచ్చే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

## ఏపీలో మహిళలకుఉచిత బస్సు ప్రయాణం

(1వపేజీ తరువాయి)నివేదిక సమర్పించారు. ఈ పథకం అమలు చేస్తున్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో పర్యటించి అక్కడి వాస్తవ పరిస్థితులను నివేదించారు. ఈ పథకం అమలు కోసం చేస్తున్న ఖర్చు.. ప్రభుత్వం పైన భారం...వ్యతిరేకతలు వంటి వాటి పైన పూర్తి సమాచారం అందించారు. ఇక, ఏపీలోనూ ఈ పథకం అమలు గురించి కొంత కాలంగా ఉన్నత స్థాయిలో చర్చ జరుగుతోంది. ఇప్పుడు ఈ పథకం అమలు పైన ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం త్వరలోనే అమలు చేస్తామని చెప్పారు. అమలు దిశగా ఇప్పటికే అధ్యయనం చేస్తున్నట్లు వెల్లడించారు. త్వరలోనే మహిళలకు శుభవార్త చెప్పనున్నట్లు తెలిపారు.

## 'వన్ నేషన్ వన్ సబ్‌స్క్రిప్షన్'కు

(1వపేజీ తరువాయి)జరగనుంది. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, పరిశోధనా సంస్థలు ప్రయోగశాలలు సహా అభివృద్ధి ఆవిష్కరణలను ప్రోత్సహించే లక్ష్యంతో మోదీ సర్కారు అమలుకు ఉపక్రమించింది. 30 ప్రధాన అంతర్జాతీయ జర్నల్ పబ్లిషర్‌లు ఈ పథకంలో భాగస్వాములుగా ఉన్నారు. దాదాపు 13 వేల ఇ-జర్నల్‌లకు యాక్సెస్ లభిస్తుంది. అన్ని విభాగాల్లోని 1.8 కోట్ల మంది విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు శాస్త్రవేత్తలకు ముఖ్యంగా టైర్-2 టైర్-3 నగరాలకు చెందిన వారికి ప్రయోజనం చేకూరుతుందని అంచనా వేస్తున్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అభివృద్ధి చేసిన "వన్ నేషన్ వన్ సబ్‌స్క్రిప్షన్" అనే పోర్టల్ ద్వారా ఈ వనరులను యాక్సెస్ చేయవచ్చు.

## పెద్దపల్లిపై వరాల జల్లు

(1వపేజీ తరువాయి)జరగాలని ఆకాంక్షించారు. 50 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో ఆర్థిక మంత్రిగా, ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా అనేక పదవులకు రోశయ్యగారు వన్నె తెచ్చారని కొనియాడారు. సమస్యలను పరిష్కరించడానికి ముఖ్యమంత్రులకు కుడిభుజంగా రోశయ్య ఉండేవారని చెప్పారు. ఏ సమస్య వచ్చినా ప్రభుత్వాన్ని కంచె వేసి కాపాడేవారన్నారు. చట్ట సభల్లో రోశయ్య వ్యవహరించిన తీరుతెన్నులను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్మరించుకుంటూ చట్ట సభల్లో ఆనాటి స్ఫూర్తి కొరవడిందని అన్నారు. రోశయ్య పాలక పక్షంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా మాటల చతురతతో విషయావగాహనతో మాట్లాడేవారని గుర్తుచేశారు. "ఏపీ ప్రాజెక్టులపై తేల్చండి: సీఎం రేవంత్ కీలక ఆదేశాలు" రోశయ్య నుంచి నేర్చుకోవలసింది ఎంతో ఉందన్నారు. వారు ఏనాడూ పదవులు కావాలని అడగలేదని, వారిలోని ప్రతిభ, క్రమశిక్షణ, పార్టీ పట్ల నిబద్ధత వారికి అనేక పదవులను తెచ్చిపెట్టిందని సీఎం రేవంత్ చెప్పారు. కొణిజేటి రోశయ్య మెమోరియల్ ఫోరమ్ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఇరు రాష్ట్రాలకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు హాజరయ్యారు.

## మహారాష్ట్ర సీఎంగా ఫడ్నవిస్

(1వపేజీ తరువాయి)ప్రమాణ స్వీకార ఏర్పాట్లపై ప్రభుత్వం దృష్టి సారించింది. ముంబైలోని ప్రఖ్యాత ఆజాద్ మైదాన్‌లో ఇప్పటికే దీని పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గురువారం సాయంత్రం సరిగ్గా 5:30 నిమిషాలకు ప్రమాణ స్వీకారోత్సవానికి ముహూర్తాన్ని నిర్ణయించారు. మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్.. ఆయనతో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ఫడ్నవిస్‌తో పాటు ఉప ముఖ్యమంత్రులుగా ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మంత్రులూ ప్రమాణ స్వీకారం చేస్తారు.

## జగన్ పోరుబాట

(1వపేజీ తరువాయి)సమావేశంలో స్పష్టం చేసారు. ప్రతీ బుధ, గురువారం జిల్లాల్లో ప్రతీ పార్లమెంట్ లోని ఏడు నియోజకవర్గాలకు చెందిన పార్టీ నేతలు...కేడర్‌తో సమావేశం అవ్వనున్నట్లు వెల్లడించారు. ఆ సమయంలో కేడర్ తో మమేకం అవుతూ అన్ని అంశాలు చర్చకు వచ్చేలా సమావేశం ఉంటుందని వివరించారు. ఇక, ఇప్పుడు జగన్ ఎన్నికల్లో ఓటమి తరువాత ప్రకటించిన తొలి నిరసన కార్యక్రమం కావటంతో రాజకీయంగా ఆసక్తి కరంగా మారుతోంది.

## నామినేటెడ్ పోస్టుల మరో..


(1వపేజీ తరువాయి)పవన్ చర్చల్లో మలి విడత జాబితా పైన చర్చించారు. ఈ లిస్టులో పలువురు సీనియర్లకు ఛాన్స్ దక్కే అవకాశం కనిపిస్తోంది. తుది కసరత్తు కూటమి ప్రభుత్వం ఇప్పటికే రెండు నామినేటెడ్ పదవుల జాబితాలను ప్రకటించింది. తొలి జాబితాలో 21 మందికి, రెండో జాబితాలో 59 మందికి అవకాశం కల్పించారు. అయితే, ఈ రెండు జాబితాల్లో మూడు పార్టీలకు చెందిన పలువురు సీనియర్లకు అవకాశం దక్కలేదు. ఎన్నికల్లో పార్టీ సూచన మేరకు సీట్లు త్యాగం చేసిన వారికి పదవులు ఇవ్వాల్సి ఉంది. దీంతో, ఇప్పుడు ఈ జాబితా పైన 3 పార్టీల నుంచి అందిన జాబితాల పైన కసరత్తు జరుగుతోంది. తాజాగా చంద్రబాబు - పవన్ భేటీలోనూ ఈ అంశం పైన చర్చ జరిగింది. టీడీపీలో పలువురు సీనియర్ల ఈ లిస్టు లో తమ పేర్లు ఉంటాయనే ఆశతో ఉన్నారు.టీడీపీ నేతల ఆశలు టీడీపీ నుంచి మాజీ మంత్రి దేవినేని ఉమా, మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న, నాగుల్ మీరా, మేక పాటి చంద్రశేఖర్‌రెడ్డి, యామినీ బాల వంటి వారు నిరీక్షిస్తున్నారు. అదే విధంగా ఎమ్మెల్యే సీట్లు త్యాగం చేసిన ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్, పిఠాపురం సీటును త్యాగం చేసిన వర్మ, ప్రభాకర్ చౌదరి, సుగుణమ్మ, కు ఈ జాబితా లో ఛాన్స్ దక్కుతుందని చెబుతున్నారు. రాష్ట్రంలో దాదాపుగా 60కి పైగా కార్పోరేషన్లు భర్తీ చేయాల్సి ఉందని అంచనా. వీటితో పాటగా ప్రణాళిక సంఘం, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ వంటి వాటికి ఇప్పటికే పేర్లు ఖరారు అయినట్లు తెలుస్తోంది. వీటితో పాటుగా కుల సంఘాలకు నియామకాలు చేయాల్సి ఉంది. ఎన్నికల సమయంలో టీడీపీ గెలుపు కోసం పని చేసిన నేతలు సైతం ఈ సారి జాబితాలో తమకు ప్రాధాన్యత ఉంటుందని భావిస్తున్నారు. బీజేపీ - జనసేన నుంచి రాజానగరంకు చెందిన నేత పెందుర్తి వెంకటేశ్ కు తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు కార్యక్ర మాల పరిశీలన బాధ్యతలు కేబినెట్ హోదాతో అప్పగించారు. మాల్యాద్రి, దారపునేని నరేంద్ర, ఏవీ సుబ్బారెడ్డిపదవులు ఆశిస్తున్నారు. అదే విధంగా బీజేపీ నుంచి పాతూరు నాగభూషణం, అన్నం సతీష్, బాజీ, కోలా ఆనంద్ వంటి పేర్లు రేసులో ఉన్నాయి. జనసేన నుంచి అమ్మిశెట్టి వాసు, రాయపాటి అరుణ, రామకృష్ణ, బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ వంటి వారు ఆశలు పెట్టుకున్నారు. దీంతో, ఈ లిస్టులో ఎవరికి ఛాన్స్ దక్కుతుందనేది ఆసక్తి కరంగా మారుతోంది.

## ఏపీలో అర్హులందరికీ ఉచిత

(1వపేజీ తరువాయి)రాష్ట్రంలో 19,92,885 మంది ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు ఉచిత విద్యుత్ పథకంలో లబ్ధిదారులుగా ఉన్నారని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వ నెలకు 477. 30 కోట్లు దీనికోసం వినియోగిస్తున్నట్టు మంత్రి పేర్కొన్నారు.తక్కువ ఆదాయం ఉన్న వర్గాలకు ఎంతో ఉపయోగంగా ఉన్న ఉచిత విద్యుత్ పథకానికి అడ్డంకులు సృష్టించడానికి కొందరు అసత్యాలను ప్రచారం చేస్తున్నారని వాటిని నమ్మకూడదన్నారు. కూటమి సంక్షేమ పాలన తట్టుకోలేక వైసీపీ అసత్య ప్రచారం కూటమి ప్రభుత్వం దళిత గిరిజనుల కోసం అమలు చేస్తున్న పథకాలు అలాగే రాష్ట్రంలో అమలవుతున్న సూపర్ సిక్స్ పథకాలు చూసి తట్టుకోలేకపోతున్న వైసిపి ఈ విధంగా తప్పుడు ప్రచారాలు చేయిస్తుందని మంత్రి గొట్టిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతో కాలంగా తాము ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్తు పథకాన్ని అందిస్తున్నామని, దళిత గిరిజనులకు మొదట ఈ ఉచిత పథకాన్ని అందించింది టిడిపి ప్రభుత్వం అని ఆయన పేర్కొన్నారు. "ఏపీలో రోడ్లకు మోక్షం.. యాక్షన్ ప్లాన్ చెప్పిన మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి" అనుమానాలుంటే ఈ నెంబర్ కు కాల్ చెయ్యండి ఈ పథకం అమలు గురించి విధివిధానాల గురించి ఎవరికైనా ఎలాంటి అనుమానాలు ఉన్న 1912 కాల్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవాలని లేనిపోని అపోహలకు పోకూడదని అర్హులైన ప్రతి ఒక్కరికి ఉచిత విద్యుత్ అందిస్తామని స్పష్టం చేశారు మంత్రి గొట్టిపాటి రవికుమార్.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 హైదరాబాద్ గురువారం 05 । డిసెంబర్ । 2024

## వ్యక్తితో కలిసి కారులో వెళ్తున్న భార్య.. ఫాలో అయ్యి ఆ కారుకు నిప్పంటించిన భర్త



**తిరువనంతపురం -నవభూమి:** ఒక వ్యక్తితో కలిసి మహిళ కారులో వెళున్నది. ఈ విషయం తెలిసిన ఆమె భర్త మరో కారులో ఫాలో అయ్యాడు. ఒక చోట ఆ కారును అడ్డగించి పెట్రోల్ పోసి నిప్పంటించాడు. మంటల్లో కాలి అతడి భార్య మరణించింది. ఆ కారులో ఉన్న వ్యక్తి గాయాలతో బయటపడ్డాడు. కేరళలోని కొల్లాంలో ఈ సంఘటన జరిగింది. 44 ఏళ్ల మహిళ ఒక వ్యక్తితో కలిసి కారులో ప్రయాణించింది. ఈ విషయం తెలుసుకున్న ఆ మహిళ భర్త అయిన 50 ఏళ్ల పద్మరాజన్ మరో కారులో వారిని ఫాలో అయ్యాడు.కాగా, మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో కొల్లాం సిటీ ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చెమ్ముముక్కు ప్రాంతంలో ఆ



కారును పద్మరాజన్ అడ్డుకున్నాడు. ఆ వాహనంపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. అతడి భార్య అనీలా మంటల్లో కాలి మరణించింది. ఆ కారులో ఉన్న మరో వ్యక్తికి కాలిన గాయాల య్యాయి. మరోవైపు ఈ విషయం తెలిసిన పోలీసులు మృతురాలి భర్త పద్మరాజన్‌ను అరెస్ట్ చేశారు. కాలిన గాయాలైన వ్యక్తిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎల్‌ఏసీలో పరిస్థితి ఏంటీ..? చైనాతో సంబంధాలపై రాజ్యసభలో జైశంకర్ కీలక ప్రకటన..




**న్యూఢిల్లీ-నవభూమి:**విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ బుధ వారం రాజ్యసభలో భారత్-చైనా సంబంధాలపై కీలక ప్రకటన చేశారు. ఈ సందర్భంగా వాస్తవ నియంత్రణ రేఖ వద్ద పరిస్థితులపై సైతం సమాచారం ఇచ్చారు. ఎల్‌ఏసీ లో ఇంకా చైనాతో కొన్ని భూభాగాలపై విభేదాలు ఉన్నాయని.. ఎప్పటికప్పుడు చర్చలు జరుపుతామని జైశంకర్ పేర్కొన్నారు. జూన్ 2020 గాల్వాన్ లోయరలో జరిగిన ఘర్షణ ఘటన భారత్ - చైనా సంబంధాలపై ప్రభావం చూపిందన్నారు. సరిహద్దులో సైనికులు మారణించడం 45 ఏళ్లలో మొదటిసారి కాదని.. అయితే, ఘటన తర్వాత పెద్ద సంఖ్యలో బలగాల మోహరింపునకు దారి తీసిందన్నారు. ఎన్నో సవాళ్లు ఉన్నప్పటికీ.. మన సైనిక బలగాలు కొవిడ్ , లాజిస్టిక్స్ సమస్యలు ఎదుర్కొంటున్న సమయంలోనూ గాల్వాన్ ఘటనలో అవసరమైన మేరకు స్పందించాయన్నారు. తీవ్రమైన చలితోపాటు ఎన్నో సవాళ్ల మధ్య వేగంగా పరిస్థితిని ఎదుర్కొన్నారన్నారు. తూర్పు లద్దాఖ్‌లోని దళాల ఉపసంహరణ దశలవారీగా ప్రక్రియ పూర్తయ్యిందని.. దేప్‌సాంగ్, డెమ్‌చోక్‌లలో పూర్తి కాలేదన్నారు.ఎల్‌ఏసీ ఒప్పందాలకు కట్టుబడి ఉండడంపై ఇరుదేశాల మధ్య సంబంధాలు ఆధారపడి ఉంటాయన్నారు. సంబంధాలు చాలారంగాల్లో పురోగామించాయని.. ఇటీవలి సంఘటనలు స్పష్టంగా ప్రతికూలంగా ప్రభావితమయ్యాయన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో శాంతిని కొనసాగించడం, సంబంధాల మెరుగునకు ప్రాథమిక షరతులు విధించామని స్పష్టం చేశారు. చైనాతో భవిష్యత్ సంబంధాలపై స్పందిస్తూ.. సమస్యల పరిష్కారానికి సంబంధాలను పెంపొందించుకునేందుకు సరిహద్దులో శాంతి అవసరమన్నారు. చైనా ప్రతిని ధులతో ఇటీవల జరిగిన సమావేశాలకు సంబంధించిన వివరాలను సైతం రాజ్యసభకు వివరించారు. ఆ తర్వాత బ్రిక్స్ సదస్సు సందర్భంగా చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ సందర్భంగా ఇరు దేశాల మధ్య సంబంధాలను సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు చర్చించారన్నారు. జైశంకర్ ప్రకటన అనంతరం కాంగ్రెస్ సహా ఇతర ప్రతిపక్ష సభ్యులు వివరణ కోరేందుకు అనుమతి కోరగా.. డిమాండ్లను చైర్మన్ జగ్‌దీప్ ధంకర్ తోసిపుచ్చారు. అభ్యంతరం వ్యక్తం చేయడంతో విపక్ష సభ్యులు రాజ్యసభ నుంచి వాకౌట్ చేశారు.

## నానబెట్టిన శనగలు తినలేదని భర్తను చితకబాది వేలు కొరికేసిన భార్య..!



**న్యూఢిల్లీ-నవభూమి:**మహారాష్ట్రలోని పుణె సిటీలోగల సోమవార్ పేట్‌లో షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. నానబెట్టిన శనగలు తినడానికి నిరాకరించిన భర్తపై భార్య విచక్షణారహితంగా దాడి చేసింది. బండబూతులు తిడుతూ కర్రతో కొట్టింది. మిక్సీ జార్‌తో తలపై బాధింది. అతడి చేతి వేలిని కొరికేసింది. ముఖంపై గోళ్లలో గీరింది. ఎడమ చెవి వెనుక భాగంలో రక్తం వచ్చేలా రక్కింది. దాంతో భర్త పోలీసులను ఆశ్రయించాడు.వివరాల్లోకి వెళ్తే.. సోమవార్ పేట్‌లోని త్రిశుండ గణపతి ఆలయం సమీపంలోని ఓ ఇంట్లో 44 ఏళ్ల భర్త, 40 ఏళ్ల భార్య ఉంటున్నారు. ఈ నెల 1న రాత్రి నానబెట్టిన శనగల విషయమై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. నానబెట్టిన శనగలు తినాలని భార్య ఇవ్వగా.. భర్త అందుకు నిరాకరించాడు. తనకు ఇష్టం లేదని చెప్పాడు. దాంతో ఆగ్రహించిన భార్య అతడితో గొడవపడింది. బూతులు తిట్టింది.భర్త ఎదురుతిరగడంతో సుత్తితో దాడి చేసేందుకు ప్రయత్నించింది. భర్త ఆ సుత్తిని గుంజుకోవడంతో మిక్సీ జార్‌తో తలపై బాధింది. ఆమె దాడి నుంచి తప్పించుకునేందుకు తలకు చేతులు అడ్డం పెట్టుకోవడంతో వేలు కొరికేసింది. ఆపై కర్రతో విచక్షణారహితంగా కొట్టింది. ఎలాగోలా భార్య బారి నుంచి తప్పించుకున్న భర్త స్థానిక పోలీసులను ఆశ్రయించాడు.జరిగిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణకు వస్తాం ఇంటికి వెళ్లమని చెప్పగా.. అప్పటికే భయంతో వణికిపోతున్న బాధితుడు నిరాకరించాడు. రాత్రికి తనకు పోలీస్‌స్టేషన్‌లోనే ఆశ్రయం కల్పించాలని పోలీసులను వేడుకున్నాడు. తన భార్య మిక్సీతో తలపై రెండు సార్లు కొట్టిందని, తన చిటికెన వేలును కొరికేసిందని, కర్రతో కొట్టిందని పోలీసులకు చేసిన ఫిర్యాదులో బాధిత భర్త పేర్కొన్నాడు.

## గూండా యాక్ట్ కఠినంగా ఉంది.. సుప్రీంకోర్టు వ్యాఖ్యలు..!



**న్యూఢిల్లీ-నవభూమి:** గూండా, సామాజిక వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కఠినంగా ఉందని సుప్రీంకోర్టు బుధవారం పేర్కొంది. పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథ్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. 2023 మేలో గూండా చట్టం కింద పెండింగ్‌లో ఉన్న విచారణలను నిలిపివేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు తిరస్కరించింది. దాంతో పిటిషన్ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా.. విచారణకు సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది. ఈ పిటిషన్ గతేడాది నవంబర్‌లో సుప్రీంకోర్టు యూపీ ప్రభుత్వ స్పందన కోరింది. దీంతో గ్యాంగ్‌స్టర్ చట్టం కింద పిటిషనర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకుండా సుప్రీంకోర్టు స్టే విధించింది. విచారణ సందర్భంగా పిటిషనర్ తరఫున న్యాయవాదులు గౌరవ్ అగర్వాల్, తన్వి దూబే వాదనలు వినిపించారు. యూపీ గ్యాంగ్‌స్టర్ చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ఎఫ్ఐఆర్ నిరాధారమని పేర్కొన్నారు.
ఎఫ్ఐఆర్ దాఖలు చేయడం న్యాయ ప్రక్రియను దుర్వినియోగం చేయడమేనని పిటిషనర్ ఆరోపించారు. పిటిషనర్‌పై గ్యాంగ్‌స్టర్ల చట్టాన్ని వర్తింపజేయడం పక్షపాతంతో కూడుకున్నదని, ఇది పోలీసు, న్యాయ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయడమేనని పిటిషనర్ పేర్కొన్నారు. బుధవారం పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. తొలుత 1986 చట్టంలోని సెక్షన్ల కింద అక్రమ మైనింగ్ కేసు నమోదు చేశారని.. ఒకే అభియోగంపై రెండుసార్లు కేసు నమోదైందన్నారు. గూండా చట్టాన్ని విమర్శించిన ధర్మాసనం దాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఈ చట్టంలోని కొన్ని నిబంధనల రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన మరో పిటిషన్‌ను కూడా కోర్టు విచారిస్తుందని ధర్మాసనం తెలిపింది. అంతకుముందు హైకోర్టులో పిటిషనర్ తరపు న్యాయవాది గ్యాంగ్‌స్టర్ చట్టం కింద నమోదైన కేసులో తనను ఇరికించారని వాదనలు వినిపించారు. పిటిషనర్ పేరు లేని మరో కేసు ఆధారంగానే గ్యాంగ్‌స్టర్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు ఆయన తరపు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు.

## సంభల్ వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు.. వెనుదిరిగిన రాహుల్, ప్రియాంక



**న్యూఢిల్లీ-నవభూమి:**దేశ రాజధాని ఢిల్లీ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని సంభల్ లో న్యాయస్థానం ఆదేశాల మేరకు ఓ ప్రార్థనా మందిరంలో సర్వే చేస్తుండగా అల్లర్లు చెలరేగిన విషయం తెలిసిందే. ఈ అల్లర్లలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆయన సోదరి ప్రియాంక గాంధీ వాద్రా ఇవాళ సంభల్‌కు బయల్దేరారు. అయితే, వారిని ఘాజీపూర్ సరిహద్దు వద్ద పోలీసులు అడ్డుకున్నారు.బారికేడ్లను వారి వాహనాలకు అడ్డుపెట్టారు. సంభల్ వెళ్లేందుకు అనుమతి నిరాకరించారు. దీంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసుల తీరుపై కాంగ్రెస్ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బారికేడ్లను ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. రాహుల్ కారు దిగి పోలీసులతో మాట్లాడినప్పటికీ వారు ఎలాంటి అనుమతీ ఇవ్వలేదు. చేసేదేమీ లేక రాహుల్, ప్రియాంక సరిహద్దు వద్దే వెనక్కి తిరిగారు. ఢిల్లీకి బయల్దేరారు.ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. మేము సంభల్‌కు వెళ్లాలనుకున్నాం.. కానీ పోలీసులు అడ్డుకున్నారని చెప్పారు. 'సంభల్ వెళ్లేందుకు పోలీసులు మమ్మల్ని అనుమతించడం లేదు. అక్కడికి వెళ్లడం నా హక్కు. కానీ వారు నన్ను అడ్డుకుంటున్నారు. సంభల్ వెళ్లి అక్కడి పరిస్థితుల గురించి తెలుసుకోవాలనుకుంటున్నాం. అక్కడ ఏం జరుగుతోందో చూడాలనుకుంటున్నాం. కానీ మమ్మల్ని అక్కడికి వెళ్లకుండా అడుగడుగునా అడ్డుకుంటున్నారు' అంటూ రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సంభల్‌కు వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడంపై ప్రియాంక గాంధీ స్పందించారు. రాహుల్ గాంధీ ప్రతిపక్ష నేత అని, ఆయనకు రాజ్యాంగపరమైన హక్కులు ఉన్నాయన్నారు. ఆయన్ని అడ్డుకోవడం సరికాదన్నారు.

## భూకంపం విషయంలో ప్రకృతి ముందే హెచ్చరించిందా?




**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రకృతి వైపరీత్యాల్లో తుఫాన్లు, వర్షాలు, వరదలు, హిమపాతం సహా అనేక రకాల వాతావరణ పరిస్థితులు సహా అగ్నిపర్వతాల విస్ఫోటనం వంటి భౌగోళిక అంశాలపై కూడా కాస్తో, కూస్తో ముందుగానే గుర్తించి ప్రజల్ని అప్రమత్తం చేసే అవకాశం ఉంది. కానీ భూకంపాలను ముందుగానే గుర్తించి అప్రమత్తం చేసే వ్యవస్థ భూగోళం మీద ఎక్కడా లేదు. గత శతాబ్దకాలంలో ప్రపంచవ్యాప్తంగా నమోదైన భూకంపాలు, భౌగోళిక పరిస్థితులను అధ్యయనం చేసి భూకంపాలు ఎక్కువగా సంభవించడానికి ఆస్కారమున్న ప్రాంతాలను మాత్రం గుర్తించవచ్చు. వాటినే మనం వాడుక భాషలో సీస్మిక్ జోన్లుగా వ్యవహరిస్తుంటారు. జోన్-1లో భూకంపాలు సంభవించే ఆస్కారం చాలా తక్కువగా ఉంటుంది. జోన్-4, జోన్-5లో భూకంపాలు సంభవించడానికి ఆస్కారమూ ఎక్కువే. వాటి కారణంగా జరిగే నష్టమూ ఎక్కువే ఉంటుంది. భారత ఉపఖండంలో గమనిస్తే హిమాలయ పర్వతాలున్న ప్రాంతాలు జోన్-5లో ఉంటాయి. 2015లో నేపాల్‌లో సంభవించిన భారీ భూకంపం సృష్టించిన విధ్వంసం ఇప్పటికీ ఉపఖండంలోని ప్రజల కళ్లల్లో మెదులుతూనే ఉంటుంది.జోన్-5లో నేపాల్, భూటాన్, చైనా(టిబెట్ ప్రాంతం), పాకిస్తాన్ %-% అఫ్ఘనిస్తాన్‌లోని కారకోరం పర్వత శ్రేణులు, భారత్‌లోని జమ్ము-కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, సిక్కిం వంటి రాష్ట్రాలు ఉన్నాయి. జోన్-4లో గంగా, సింధు మైదానంలో విస్తరించిన ప్రాంతాలు, రాష్ట్రాలున్నాయి. అయితే వీటికి చాలా దూరంగా.. దక్కను పీఠభూమిపై ఉన్న తెలంగాణలో హైదరాబాద్ సహా చాలా ప్రాంతాలు జోన్-2లో ఉన్నాయి. గోదావరి నదీ లోయ ప్రాంతం మాత్రం జోన్-3లో ఉందని శాస్త్రవేత్తలు వర్గీకరించారు. జోన్-2, జోన్-3లో భూకంపాలు సంభవించే అవకాశాలు అరుదుగానే ఉన్నప్పటికీ, ఒక్కోసారి అవి తీవ్ర విధ్వంసాలను సృష్టించి మానవాళి చరిత్రలో విషాదాలను సృష్టిస్తుంటాయి. తాజాగా తెలంగాణలోని ములుగు జిల్లా మేడారం సమీపంలో సంభవించిన భూకంపం (రిక్టర్ స్కేలుపై తీవ్రత 5.3) రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్, ఒడిశా వరకు ప్రకంపనాల తీవ్రత కనిపించింది. తెలుగు రాష్ట్రాల ప్రజలను భయకంపితులను చేసింది. అదే సమయంలో గతంలో ఈ ప్రాంతంలో సంభవించిన భూకంపాలను గుర్తుచేసింది.

### వైపరీత్యానికి ముందు పరోక్ష సంకేతాలు

మూడు దశాబ్దాల క్రితం మహారాష్ట్రలోని లాతూర్‌లో వచ్చిన భూకంపం భారీ విధ్వంసాన్ని సృష్టించి చరిత్ర పేజీల్లో నిలిచిపోయింది. సెప్టెంబరు 30, 1993న తెల్లవారుజామున 3:56 గంటల సమయంలో ప్రజలు గాఢ నిద్రలో ఉన్న సమయంలో భూకంపం విరుచుకుపడింది. ఇందులో 10 వేల మందికి పైగా మరణించారు. మరో 30 వేల మందికి పైగా గాయపడ్డారు. ఈ భూకంపం ధాటికి లాతూర్ మాత్రమే కాకుండా చుట్టుపక్కల 12 జిల్లాల్లోని దాదాపు 2 లక్షల 11 వేల ఇళ్లు ధ్వంసమయ్యాయి. 52 గ్రామాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. భూకంప కేంద్రానికి జనసాంద్రత ఎక్కువగా ఉన్న లాతూర్ పట్టణం సమీపంలో ఉండడంతో విధ్వంసం తీవ్రత, ప్రాణనష్టం ఎక్కువగా జరిగింది. ఈ భూకంపం రిక్టర్ స్కేలుపై తీవ్రత 6.4గా నమోదైంది. ఇంత భారీస్థాయిలో కంపనాలు విరుచుకుపడడానికి కనీసం 6 నెలల ముందు నుంచే ప్రకృతి సంకేతాలు పంపించిందని స్థానికులు చెబుతారు. రికార్డయిన గణాంకాల ప్రకారం ఈ భూకంపం కంటే ముందు లాతూర్, దాని పరిసర ప్రాంతాల్లో 6 నెలల్లో 125 తేలికపాటి ప్రకంపనాలు, భూకంపాలు వచ్చాయి. ఇదంతా ఆగస్టు 1992 %-% మార్చి 1993 మధ్య జరిగింది.అంటే ఇక్కడ ఓ భారీ వైపరీత్యం సంభవించబోతుందని ప్రకృతి ముందుగానే హెచ్చరించిందని స్థానికులు అభిప్రాయపడ్డారు. లాతూర్ జిల్లా ఔసా తాలూకా, ఉస్మానాబాద్‌లోని ఉమర్గా తాలూకా భూకంపానికి ఎక్కువగా ప్రభావితమయ్యాయి. ప్రజలు సర్వం కోల్పోయారు. ఈ భూకంపం మహారాష్ట్రను సంక్షోభంలోకి నెట్టింది. ఆ సమయంలో రాష్ట్రానికి దేశ విదేశాల నుండి సహాయం అందింది. ఇది జరిగి 30 ఏళ్లు దాటినప్పటికీ మహారాష్ట్రలో ఆ భూకంప గాయం ఇంకా పచ్చిగానే ఉంది. తాజాగా మహారాష్ట్రకు ఆనుకున్న తెలంగాణలో సంభవించిన భూకంపం మహారాష్ట్ర వాసుల గుండెల్లో గుబులు రేపింది. భూకంపం యొక్క కేంద్రం ఉన్న చోట, ఒకప్పుడు పెద్ద బిలం (అగ్నిపర్వత నోరు) ఉండేదని నమ్ముతారు. ఈ భూకంపం సంభవించినప్పుడు, చాలా మంది ప్రజలు గాఢ నిద్రలో ఉన్నారు, దీని కారణంగా చాలా ప్రాణ, ఆస్తి నష్టం జరిగింది.

### మేడారం భూకంపానికి ముందు


%లాతూరులో సంభవించిన భారీ భూకంపానికి ముందు స్వల్ప భూకంపాలు, ప్రకంపనాలు సంభవించడం ఒక హెచ్చరికలా భావిస్తే.. మేడారం భూకంపానికి ముందు అలాంటి హెచ్చరికలు ఏవైనా వచ్చాయా అన్న ప్రశ్న మొదలైంది. మూడు నెలల క్రితం సెప్టెంబర్ 3న ఇదే ప్రాంతంలో టోర్నడో తరహాలో ప్రచండ వేగంతో వచ్చిన సుడిగాలి 50 వేలకు పైగా చెట్లను నేల కూల్చింది. వేలాది హెక్టార్ల అడవిని నాశనం చేసింది. సహజంగా టోర్నడోలు అమెరికా వంటి రాష్ట్రాల్లో తీవ్ర విధ్వంసం సృష్టిస్తుంటాయి. కానీ ఆ రోజు మేడారం అడవుల్లో సంభవించింది టోర్నడోనా లేక బలమైన సుడిగాలా అన్న విషయంపై శాస్త్రవేత్తల అధ్యయనాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఈ అధ్యయనాల సంగతెలా ఉన్నా.. స్థానిక ప్రజలు మాత్రం ప్రకృతి ముందే హెచ్చరించిందని అభిప్రాయపడుతున్నారు.
మేడారం గిరిజన-ఆదీవాసులతో పాటు తెలంగాణలో చాలా మందికి పవిత్ర పుణ్యక్షేత్రం. ఇక్కడ జరిగే జాతరకు కుంభమేళాను తలపించేలా జనం తరలి వస్తుంటారు. అలాంటి ప్రాంతంలో అడవిని నాశనం చేసిన సెప్టెంబర్ నాటి విపత్తును, తాజాగా సంభవించిన 5.3 తీవ్రత కల్గిన భూకంపంతో ముడిపెడుతున్నారు. శాస్త్రవేత్తలు మాత్రం ఈ రెండు పరస్పర భిన్నమైన అంశాలని స్పష్టం చేస్తున్నారు. సుడిగాలి లేదా టోర్నడో, తుఫాను గాలులు వంటివి భూ ఉపరితలంపై ఉన్న వాతావరణంలో మార్పుల కారణంగా ఏర్పడుతుంటాయి. కానీ భూకంపాలు ఏర్పడేందుకు భూగర్భంలో సంభవించే మార్పులు కారణమవుతాయి. ఈ రెండింటినీ ఒకే గాటన కట్టలేమని శాస్త్రవేత్తలు తేల్చి చెబుతున్నారు. శాస్త్రవేత్తల నిర్వచనాలు ఎలా ఉన్నా.. ప్రకృతిని దైవంగా భావించే భారతదేశంలో ప్రకృతి నుంచి ఎదురయ్యే ఏ రకమైన విపత్తునైనా ఒక హెచ్చరికలాగే ప్రజలు భావిస్తుంటారు.

## స్టూడెంట్ చనిపోయాడని చెప్పి సెలవు తీసుకున్న టీచర్.. తర్వాత ఏం జరిగిందంటే?



**భోపాల్-నవభూమి:** విద్యార్థి మరణించినట్లు చెప్పి ఒక ఉపాధ్యాయుడు సెలవు తీసుకున్నాడు. ఆ బాలుడి అంత్యక్రియలకు వెళ్తున్నట్లు రిజిస్టర్‌లో పేర్కొన్నాడు. ఈ విషయం ఆ విద్యార్థి తండ్రి దృష్టికి వెళ్లింది. దీంతో షాక్ అయిన ఆయన జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. మధ్యప్రదేశ్‌లోని మౌగంజ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. చిగ్రిక తోలాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా హీరాలాల్ పటేల్ పని చేస్తున్నాడు. నవంబర్ 27న ఆయన సెలవు తీసుకున్నాడు. స్కూల్‌లో 3వ తరగతి చదువుతున్న విద్యార్థి చనిపోయాడని, ఆ బాలుడి అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వెళ్తున్నట్లు హాజరు రిజిస్టర్‌లో పేర్కొన్నాడు.కాగా, ఆ విద్యార్థి తండ్రికి ఈ విషయం తెలిసింది. బతికున్న తన కుమారుడు మరణించినట్లుగా టీచర్ పేర్కొని సెలవు తీసుకున్నట్లు తెలిసి షాక్ అయ్యాడు. ఉపాధ్యాయుడు హీరాలాల్ పటేల్‌పై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో ఆ టీచర్‌ను సస్పెండ్ చేశారు. ఈ సంఘటనపై దర్యాప్తునకు కలెక్టర్ ఆదేశించారు.

## సుఖ్‌బీర్ బాదల్‌పై కాల్పులు జరిపిన నారాయన్ సింగ్ ఎవరో తెలుసా?



**అమృత్‌సర్ -నవభూమి:**శిరోమణి అకాలీ దళ్ చీఫ్, పంజాబ్ మాజీ డిప్యూటీ సీఎం సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌పై ఓ దుండగుడు ఇవాళ కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. గన్‌తో ఫైర్ చేసిన అతన్ని నారాయణ్ సింగ్ చౌరాగా గుర్తించారు. అతను మాజీ ఖలిస్తానీ మిలిటెంట్. అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయం వద్ద సేవాదార్ విధులు నిర్వర్తిస్తున్న సుఖ్‌బీర్‌పై నారాయణ్ సింగ్ కాల్పులు జరిపాడు.
గతంలో అకాల్ ఫెడరేషన్ చీఫ్‌గా చేశాడతను. పాకిస్థాన్‌లో శిక్షణ పొందాడు. సిక్కు తీవ్రవాదంపై పుస్తకాలు రాశాడు. మూడుసార్లు అతను పాకిస్థాన్‌కు వెళ్లాడు. 1995లో అతను ఇండియాకు వచ్చాడు. పంజాబ్ మాజీ సీఎం బియాంత్ సింగ్ హత్య కేసులో చౌరా అనుమానితుడిగా ఉన్నాడు. 2004లో బురెయిల్ జైలు నుంచి పారిపోయిన కేసులోనూ అనుమానితుడిగా ఉన్నాడు. బియాంత్ సింగ్‌ను హత్య చేసిన బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ చీఫ్ గజతార్ సింగ్ హవారాతో పాటు నలుగురు వ్యక్తులు జైలులోని బరాక్ నెంబర్ 7 నుంచి పారిపోయారు. 2004 , జనవరి 21వ తేదీన ఆ ఎస్కేప్ ఘటన చోటుచేసుకున్నది.

## శబరిమల భక్తులతో వెళ్తున్న బస్సును ఢీ కొట్టిన లారీ.. ఒకరు మృతి

**న్యూఢిల్లీ-నవభూమి:**కరళ రాష్ట్రం కొల్లాం జిల్లాలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. శబరిమల భక్తుల తో వెళ్తున్న బస్సును లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. డజను మందికిపైగా గాయపడ్డారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం తెల్లవారుజామున 3:45 గంటల ప్రాంతంలో ఆర్యన్‌కావు గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. అతి వేగంగా వెళ్తున్న లారీ.. బస్సును బలంగా ఢీ కొట్టింది. దీంతో బస్సు రోడ్డు పక్కన 40 అడుగుల లోతులోకి పడిపోయింది. ఈ ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. మృతుడు సేలంకు చెందిన వ్యక్తిగా గుర్తించారు.
ఈ ప్రమాదంలో చిన్నారులు, వృద్ధులు సహా మొత్తం 16 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.

## ఢిల్లీ వాసులకు కాస్త ఉపశమనం.. మెరుగుపడిన గాలి నాణ్యత



**న్యూఢిల్లీ-నవభూమి:** గత కొన్ని రోజులుగా తీవ్ర వాయు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అయిన ఢిల్లీ వాసులకు కాస్త ఉపశమనం లభించింది. రాజధాని ప్రాంతంలో బుధవారం గాలి నాణ్యత కాస్త మెరుగుపడింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి డేటా ప్రకారం.. బుధవారం ఉదయం 8 గంటల సమయంలో ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 211గా నమోదైంది. దీన్ని మోడరేట్ కేటగిరీ కింద సూచిస్తారు. కాగా, 20 రోజుల క్రితం ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 500 మార్క్‌ను తాకి ప్రమాదకర స్థాయిలో నమోదైన విషయం తెలిసిందే. ఆ తర్వాత కాస్త తగ్గుతూ వచ్చింది. ఈ వారం మరింత తగ్గుముఖం పట్టింది. ఆదివారం 285, సోమవారం 273గా నమోదైన ఏక్యూఐ లెవల్స్.. మంగళవారం 268 వద్ద నిలిచిన విషయం తెలిసిందే. ఇవాళ ఇంకాస్త మెరుగుపడటంతో రాజధాని వాసులు ఊపిరి పీల్చుకుంటున్నారు.మరోవైపు ఢిల్లీలో ఇవాళ కనిష్ట ఉష్ణోగ్రతలు 12 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. సీజన్ సగటు కంటే 2.5 డిగ్రీలు ఎక్కువగా నమోదైనట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. ఇవాళ ఉదయం 8:30 గంటల సమయంలో ఢిల్లీలో తేమ స్థాయి 68 శాతంగా ఉంది. గరిష్ట ఉష్ణోగ్రతలు దాదాపు 27 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది.గాలి నాణ్యత సున్నా నుంచి 50 మధ్య ఉంటే బాగా ఉన్నట్టు అర్థం. 51 నుంచి 100 వరకు ఉంటే సంతృప్తికరమైనదని, 101 నుంచి 200 వరకు ఉంటే మితమైన నాణ్యత, 201 నుంచి 300 ఉంటే తక్కువ నాణ్యత అని, 301 నుంచి 400 వరకు ఉంటే చాలా పేలవమైనదని, 401 నుంచి 500 ఉంటే ప్రమాదకరస్థాయిగా పరిగణిస్తారు.

## సౌత్ కొరియా అధ్యక్షుడిపై అభిశంసన తీర్మానం

**సియోల్-నవభూమి:** సౌత్ కొరియాలో మంగళవారం ఉన్నట్టుండి ఎమర్జెన్సీ విధించిన ప్రెసిడెంట్ యూన్ సుక్ యోల్ పై అక్కడి ప్రతిపక్షాలు అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. ఎమర్జెన్సీ విధింపును తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఈ తీర్మానం ప్రవేశపెట్టినట్లు సమాచారం. పార్లమెంట్ లో ప్రతిపక్షానికే మెజారిటీ ఉండడంతో అభిశంసన తీర్మానం నుంచి ప్రెసిడెంట్ యోల్ గట్టెక్కే సూచనలు కనిపించడంలేదని సౌత్ కొరియా రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ తీర్మానంపై శుక్రవారం పార్లమెంట్‌లో ఓటింగ్ జరుగుతుందని, ఆ లోపే అధ్యక్షుడు పదవి నుంచి దిగిపోయే సూచనలు కనిపిస్తున్నాయని అంటున్నారు.మంగళవారం రాత్రి టీవీ ప్రత్యక్షప్రసారంలో అధ్యక్షుడు యోల్ సౌత్ కొరియన్లను ఉద్దేశించి మాట్లాడారు. పార్లమెంట్ లో ప్రతిపక్షాలకు మెజారిటీ ఉండడంతో ప్రభుత్వాన్ని ప్రతీ విషయంలో అడ్డుకుంటున్నాయని, దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. దాయాది దేశం నార్త్ కొరియాకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ ప్రతిపక్షాలపై అధ్యక్షుడు తీవ్ర విమర్శలు చేశారు. వారిని కట్టడి చేసి, దేశంలో పరిస్థితిని చక్కదిద్దేందుకు మార్షల్ లా విధిస్తున్నట్లు ప్రకటించి ప్రజలను ఆశ్చర్యానికి గురిచేశారు.

## బైక్ రైడర్‌ను బ్యానెట్‌పై ఎక్కించుకుని ఈడ్చుకెళ్లిన ఆడీ డ్రైవర్.. షాకింగ్ వీడియో

**న్యూఢిల్లీ-నవభూమి:** మహారాష్ట్ర పూణెలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. ఓ ఆడీ కారు డ్రైవర్ బైక్ రైడర్‌ని ఢీ కొట్టి.. అలాగే మూడు కిలోమీటర్ల మేర ఈడ్చుకెళ్లాడు. ఇందుకు సంబంధించిన షాకింగ్ వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.ఈ ఘటన పూణెలోని పింప్రి --చించ్‌వాడ్ టౌన్‌షిప్ వద్ద చోటు చేసుకుంది. డిసెంబర్ 1వ తేదీ రాత్రి సమయంలో లగ్జరీ ఆడీ కారు అతి వేగంగా



వెళ్తూ.. ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో బైక్ రైడర్ కారు బ్యానెట్‌పైకి ఎగిరిపడ్డాడు. అనంతరం కారును ఆపకుండా డ్రైవర్ అలాగే రెండు నుంచి మూడు కిలోమీటర్ల మేర ముందుకు వెళ్లిపోయాడు. ఈ ఘటనలో ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. అతడు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశారు.

## బాలల పండుగ ఎప్పుడు?

చాచా నెహ్రూ పుట్టిన రోజు అంటే పిల్లలకు పండుగే... తెలు గు రాష్ట్రాలకు సంబంధించినంతవరకు మొన్న మొన్నటి వరకూ బాలల దినోత్సవం అంటే బాలల చలన చిత్రోత్సవం అనే కదా. నవంబర్ నెల అనగానే అందరికీ గుర్తొచ్చేది రెండేళ్లకోసారి విచ్చేసి సందడి సందడి చేసే అంతర్జాతీయ బాలల చలనచిత్రోత్సవమే. ఊహలకే రెక్కలు తొడిగినట్టు, ఆకసం నుంచి తారలు జారిపడినట్టు, చందమామే పిల్లలకు మంచి కథలు చెప్పడానికి దివి నుంచి దిగివచ్చినట్టు... ఉండేది ఆ చిత్రోత్సవం. అదో అనిర్వచనీయమైన అనుభవం. ఎన్నెన్ని అద్భుతమైన చిత్రాలు... ఎన్నెన్ని కళాఖండాలు... వాటిని తనివితీరా చూసి, మనసారా ఆస్వాదించి మనవాళ్లు ఎంతగా తాదాత్మ్యం చెందారు! ఎన్నెన్ని ఉత్తేజపూరితమైన చిత్రాలు చూసి పిల్లలు ఎంతగా ఆశ్చర్యచకితులయ్యారు! దేశ దేశాల జానపద సాహిత్యం నుంచి, ఇతిహాసాల నుంచి, వర్తమాన వైచిత్రిక స్థితిగతుల నుంచి, దైనిక దుర్భర జీవన యవనిక నుంచీ వచ్చిన మరచిపోలేని వినూత్నమైన కథలు తిన్నగా మన మధ్య నిల్చుని మనతో సంభాషించేవి. ఎక్కడెక్కడో ప్రాణం పోసుకుని పరుగులు తీసుకుంటూ పరోపకారి పాపన్న వంటి పాత్రలు మన కోసమే అరుదెంచినట్టు ఉండేది. సున్నితమైన అంశాలతో పిల్లలని, పెద్దలనీ సమానంగా అలరించే ఇరాన్ సినిమాలు అంటే అందరికీ ప్రత్యేకమైన అభిమానం. ఎన్నెన్ని తియ్యని అనుభవాలు... పిల్లలతో పాటు కవులు, కళాకారులు, చిత్రకారులు, పాత్రికేయులు, సినిమా విమర్శకులు, దర్శక నిర్మాతలు, నటీనటులు... ఎందరో ఔత్సాహిక కళాకారులు ఈ హైదరాబాద్ చలన చిత్రోత్సవంలో చురుకుగా పాల్గొనేవారు. దేశ వ్యాప్తంగా వందల సంఖ్యలో పిల్లలు బిరబిరా గలగలా ఉత్సాహం ఉరకలెత్తగా వచ్చి ఈ చిత్రోత్సవంలో పాల్గొనేవాళ్లు. ప్రపంచ వ్యాప్తంగా సృజనాత్మకతకు ప్రతీకలుగా వచ్చిన ఆ చిత్రాలతో ఆ మధ్య వరకు మిలమిలా మెరిసిపోయిన హైదరాబాద్ వెండితెరలు కొన్నేళ్లుగా వెలవెలబోతున్నాయి. అంతమందిని మైమరిపించిన ఆ చిత్రోత్సవాలు ఇప్పుడు ఏమైపోయాయి? హైదరాబాద్ చిత్రోత్సవం అంటేనే అదో భావోద్వేగం... ఆ పరిస్థితి ఇప్పుడు లేదు. అంతటా నిస్తేజం. బంగారు, వెండి ఏనుగులతో ఉత్తమ చిత్రాలను గుర్తించి, గౌరవించిన మన చలన చిత్రోత్సవం ఇప్పుడు ఏకంగా చిరునామా లేకుండా పోయింది! ఎందుకీ దైన్య స్థితి?సినిమా అంటే కేవలం కదలాడే బొమ్మలు కాదని విశ్వసించిన మన తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ ఉత్తమ చిత్రాలను తీసుకువచ్చి ప్రదర్శిస్తే అవి మన యువతీ యువకులపై నిర్మాణాత్మక ప్రభావం చూపిస్తాయని, తద్వారా దేశ సంస్కార వికాసానికి, కళా ప్రాభవానికీ కొత్త దారులు ఏర్పడతాయని భావించారు. అందుకే అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల నిర్వహణకు 1952లో అంకురార్పణ చేశారు. ప్రధాన స్రవంతి సినిమా ఒకవైపు ప్రేక్షకులను విపరీతంగా ఆకర్షిస్తున్నా, జీవితంలో ఏదో ఒక విలువ కోసమో, కనీ కనిపించని ఒక జీవిత పార్శ్వాన్ని తడిమి, మనసును ఆర్ద్రం చేసి చూపించడానికో సృజనాత్మక దర్శకులు చేసే ప్రయత్నాలను కూడా నెహ్రూ గమనించారు.అటువంటి చలన చిత్రాల దర్శక నిర్మాతలను ప్రోత్సహించడానికి జాతీయ స్థాయిలో సినిమా పురస్కారాలను కూడా ఏర్పాటు చేశారు. ఉత్తమ చలన చిత్రాల నిర్మాణం కోసం ముందుకు వచ్చే దర్శకులకు సాయంగా ఉంటుందని నెహ్రూ నేషనల్ ఫిల్మ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్‌కి కూడా నెహ్రూ శ్రీకారం చుట్టారు. సినిమా అంటే మన సామాజిక, సాంస్కృతిక, రాజకీయ పరిణామాలకు ప్రతీక అని నమ్మి అలనాటి చిత్రాల తరగని గనిగా పూణేలో నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్స్‌ను ఏర్పాటు చేశారు. అలాగే నటీనటులు, దర్శకులు, సినిమా రచయితలు, ఛాయాచిత్ర దర్శకులు కాదలచిన ఔత్సాహికులకు మంచి శిక్షణ ఇవ్వడం కోసం ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఎక్కడెక్కడో నిర్మించిన చిత్రాలను వడపోసి మన ప్రేక్షకులకు అందించే దిశగా అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలకు బీజం వేశారు. అందుకు ఏకంగా ఒక డైరెక్టరేట్‌నే ఏర్పాటు చేశారు. ఆ పరంపరలోనే పిల్లల కోసం అంటూ ముంబై కేంద్రంగా ఒక ఫిల్మ్ సొసైటీ ఏర్పాటు అయ్యింది. ఈ సొసైటీ నిర్వహణలో పిల్లల కోసం ఉత్తమ చిత్రాల ప్రదర్శన కూడా మొదలైంది. కొన్ని నిర్వహణ లోపాలు ఎదురుకావడంతో వాటికి పరిష్కారంగా 2005లో నాటి కేంద్ర సమాచార శాఖ మంత్రి జైపాల్ రెడ్డి హైదరాబాద్ నగరాన్ని బాలల చలన చిత్రోత్సవాలకు శాశ్వత వేదికగా ప్రకటించారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయిస్తే చిత్రోత్సవాల సమయంలో సినిమా ప్రదర్శనలకు వీలుగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో శాశ్వత థియేటర్లు నిర్మిస్తామన్నారు. చిత్రోత్సవాలు లేని సమయంలో అక్కడే అలనాటి ఆణిముత్యాలు అనదగిన తెలుగు, హిందీ పాత చిత్రాల ప్రదర్శ నకు ఈ థియేటర్లను వినియోగించుకోవచ్చు. భారతీయ చిత్రాలపైనా, తెలుగు సినిమా చరిత్ర పైనా అమెరికాలో లాగా మంచి ఆడియో విజువల్ ప్రదర్శనలు, అలాగే సినిమాలపై ఒక గ్రంథాయలం, సినిమా పరిశోధనలకు దేశదేశాల నుంచి వచ్చే అతిథులకోసం విడిది సౌకర్యాలు కల్పించాలన్నది ఆనాటి ప్రకటన సారాంశం. వాటితో పాటు అసలు చిల్డ్రన్స్ ఫిల్మ్ సొసైటీనే హైదరాబాద్‌కు తరలించాలనే ఆకాంక్షను ఆ రోజున జైపాల్ రెడ్డి వ్యక్తం చేశారు. అందుకు వెంటనే సానుకూలంగా స్పందించిన నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి హైదరాబాద్ ఫిల్మ్ నగర్‌లో 15 ఎకరాల స్థలాన్ని మంజూరు చేశారు. శాశ్వత భవనాలు సిద్ధమయ్యేలోపు హైదరాబాద్ నడిబొడ్డున గల ఐమాక్స్, తదితర ముఖ్యమైన థియేటర్లలో చిత్రోత్సవాల సమయంలో మిగిలిన చిత్రాల ప్రదర్శనలు ఆపి చిత్రోత్సవాల సినిమాల ప్రదర్శనలకు కేటాయించాలని కూడా నిర్ణయించారు.ఆ దిశగా కొన్ని మంచి అడుగులు పడ్డాయి. సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ హోదాలో డాక్టర్ కెవి రమణ హైదరాబాద్ లోని ముఖ్యమైన థియేటర్ల యాజమాన్యాన్ని ఒప్పించి బాలల చిత్రోత్సవాలను అద్వితీయంగా నిర్వహించారు.

# పుత్తడి లాంటి పుడమి తల్లిని కాపాడుకుందాం



**డిసెంబర్ 5 ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా**

భూమి ఉపరితలంపై అభివృద్ధి చెంది మొక్కల పెరుగుదలకు తోడ్పడే చిన్న రాతి కణాలు, శిథిలాలు, సేంద్రీయ పదార్థాలు, హ్యూమస్ కలయికను సరళంగా నేల అంటారు. 2050 నాటికి ప్రపంచ ఆహార అవసరాలను తీర్చడానికి వ్యవసాయ ఉత్పత్తి 60% అధికంగా పెరగాలని అంతర్జాతీయ నివేదికలు వెల్లడిస్తున్నాయి. మనం తీసుకుంటున్న ఆహారంలో తొంభై ఐదు శాతానికి పైగా నేల నుండి వస్తుంది. మొక్కలకు అవసరమైన 18 సహజ రసాయన మూలకాల్లో 15 మూలకాలను నేలలు సరఫరా చేస్తాయి. జీవవైవిధ్యాన్ని కాపాడుకోవడంలో, నేల కోతను, కాలుష్యాన్ని తగ్గించడంలో, నీటి వడపోతను మెరుగుపరచడంలో, స్థిరమైన ఆహార వ్యవస్థలను నిర్మించడంలో ఆరోగ్యకరమైన నేలలు కీలక పాత్ర పోషిస్తాయి. కార్బన్ నిల్వలో పాత్ర పోషిస్తున్న కోట్లాది జీవులకు నేల నిలయం. కేవలం రెండు నుండి మూడు సెంటీమీటర్ల మట్టిని ఉత్పత్తి చేయడానికి వెయ్యి సంవత్సరాలు పడుతుందని శాస్త్రవేత్తల అంచనా. సుస్థిర భూసార నిర్వహణ ద్వారా 58% వరకు ఎక్కువ ఆహారాన్ని ఉత్పత్తి చేయవచ్చు

ప్రపంచ నేల దినోత్సవం:

ఆరోగ్యకరమైన నేల ప్రాముఖ్యతపై దృష్టి పెట్టడానికి, నేల వనరుల సుస్థిర నిర్వహణ కోసం ప్రతి సంవత్సరం డిసెంబర్ 5 న ప్రపంచ నేల దినోత్సవం నిర్వహించబడుతుంది. ఆహారాన్ని అందించడం, పర్యావరణ వ్యవస్థలకు మద్దతు ఇవ్వడం, వాతావరణ మార్పులను తగ్గించడం, నేల సారవంతం అవసరాన్ని నొక్కి చెప్పడం ఈ రోజు లక్ష్యం.

ప్రపంచ నేల దినోత్సవం 2024 థీమ్" నేలల సంరక్షణ: కొలవడం, పర్యవేక్షించడం, నిర్వహించడం" ఇది నేల ఆరోగ్యం, ఆహార భద్రత, పర్యావరణ స్థితిస్థాపకత మధ్య పరస్పర సంబంధాన్ని బలపరుస్తుంది. నేల కోతను ఎదుర్కోవటానికి




సారవంతమైన పై మట్టిని కోల్పోయే కోతను నివారించే పద్ధతులను ఈ రోజు నొక్కి చెబుతుంది. నేల లక్షణాలను అర్థం చేసుకోడానికి, ఆహార భద్రత కోసం స్థిరమైన నేల నిర్వహణ కొరకు, నిర్ణయాలు తీసుకోవడానికి వివిధ రకాలయిన నేల సమాచారం యొక్క ప్రాముఖ్యత ఆవశ్యకతను ఇది తెలియజేస్తుంది.

ఎదుర్కొంటున్న సవాళ్లు:

వాతావరణ మార్పులు, మానవ కార్యకలాపాల నేపథ్యంలో మన నేలలు క్షీణిస్తున్నాయి. నేల కోత సహజ సమతుల్యతను దెబ్బతీస్తుంది. నీటి లభ్యతను తగ్గిస్తుంది. జీవ వైవిధ్యాన్ని దెబ్బతీస్తుంది. ఆహారంలో విటమిన్లు పోషకాల స్థాయిని తగ్గిస్తుంది. నేల క్షీణత, కాలుష్యం, అస్థిరమైన పద్ధతులు వంటి సవాళ్లు నేడు ఎదురవుతున్నాయి. ఇవి భూసారాన్ని తగ్గించడం, పర్యావరణ వ్యవస్థలను దెబ్బతీయడం, ప్రపంచ ఆహార భద్రతకు ముప్పు కలిగించడం చేస్తాయి. నేల క్షీణతకు నేల కోత ఒక కారణం. గాలి, నీరు వంటి సహజ శక్తులు, అటవీ నిర్మూలన, అనుచిత భూ వినియోగ పద్ధతులు వంటి మానవ కార్యకలాపాలు నేల క్షీణతకు కారణాలవుతున్నాయి. ఇది వ్యవసాయాన్ని దెబ్బతీయడమే కాకుండా నదీ పూడిక సమస్యలను పెంచి ప్రవాహ సామర్థ్యాన్ని తగ్గించి వరదలు కలిగించి నేల కోతకు పరోక్ష కారణమవుతుంది. సేంద్రియ ఎరువులు లేకుండా రసాయనిక ఎరువులపై ఆధారపడటం వల్ల భూమి గట్టిపడి కాలక్రమేణా భూసారం సారం క్షీణిస్తుంది. హరిత విప్లవం తర్వాత నదీ లోయ ప్రాజెక్టుల కమాండ్ ఏరియాల్లో ఇబ్బందులు కనిపించాయి. నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ (నాస్) ప్రకారం దేశంలో వార్షిక నేల నష్టం రేటు హెక్టారుకు 15.35 టన్నులు. ఫలితంగా 53.7 నుండి 80 లక్షల టన్నుల పోషకాలు కోల్పోతున్నాయి.

**మన దేశంలో పరిస్థితి:**

మన దేశ మొత్తం భూభాగంలో దాదాపు సగం క్షీణతను ఎదుర్కొంటున్నందున దేశం ఏటా లక్షల టన్నుల మట్టి, పోషకాలను కోల్పోతుంది. ఇది జాతీయ ఉత్పాదకతను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. మన దేశ నేలలు ప్రధానంగా నత్రజని, భాస్వరం లోపం కలిగి ఉంటాయి. ఇండో గంగా మైదానాలు, ఈశాన్య ప్రాంతాల నేలలలో భాస్వర లోపం, దక్షిణ భాగంలో నత్రజని లోపం ఎక్కువగా ఉంది. అసమతుల్య ఎరువుల వాడకం నేల ఆరోగ్యాన్ని మరింత దెబ్బతీస్తుంది. 1990లలో దేశంలో పొటాషియం లోపం ఎక్కువగా కనిపించింది. 2000లో సల్ఫర్ లోపం ఒక ప్రధాన సమస్యగా ఉద్భవించింది. దాదాపు 36.5% మట్టిలో జింక్ లోపం ఉంది. బోరాన్ లోపం 23.4% నేలల్లో కనిపిస్తుంది. 4.20% నేలల్లో రాగి లోపం గమనించవచ్చు. మాంగనీస్ లోపం 7.10% నేలలను ప్రభావితం చేస్తుంది.

**పరిష్కారాలు:**నేల పోషకాలు, ఆరోగ్యాన్ని పెంచేందుకు పంట మార్పిడి పరిరక్షణ వ్యవసాయ పద్ధతులను అమలు చేయాలి. నేల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు సేంద్రీయ వ్యవసాయం,డిజిటల్ వ్యవసాయం, కర్బన వ్యవసాయాలను ప్రోత్సహించాలి. డిజిటల్ అగ్రికల్చర్ అనేది "ఐసిటి (ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీస్) డేటా ఎకోసిస్టమ్‌లు, అందరికీ సురక్షితమైన పోషకమైన సరసమైన ఆహారాన్ని అందజేస్తూ వ్యవసాయాన్ని లాభదాయకంగా స్థిరంగా చేయడానికి సకాలంలో లక్ష్య సమాచారం, సేవల అభివృద్ధికి మద్దతు ఇస్తుంది. వాతావరణ పర్యవేక్షణ, రోబోటిక్స్, డ్రోన్ టెక్నాలజీ మొదలైనవి ఈ పద్ధతిలో అనుసరిస్తారు. కార్బన్ వ్యవసాయం ( కార్బన్ సీక్వెస్ట్రేషన్ ) అనేది వ్యవసాయ నిర్వహణ వ్యవస్థ. ఇది భూమి మరింత కార్బన్‌ను నిల్వ చేయడానికి వాతావరణంలోకి విడుదల చేసే గ్రీన్ హౌస్ వాయువుల మొత్తాన్ని తగ్గిస్తుంది . ఇది వాతావరణం నుండి కార్బన్ డయాక్సైడ్ తొలగించబడినరేటును మెరుగుపరచడానికి తెలిసిన అభ్యాసాలను కలిగి ఉంటుంది. మొక్కల పదార్థం నేల సేంద్రీయ పదార్థంగా మార్చబడుతుంది. మెరుగైన భూ నిర్వహణ, పరిరక్షణ పద్ధతుల ఫలితంగా కార్బన్ లాభాలు కార్బన్ నష్టాలను అధిగమించినప్పుడు కార్బన్ వ్యవసాయం విజయవంతమవుతుంది. ఎడారీకరణ, అనియంత్రిత పశుపోషణ, అటవీ నిర్మూలన జనాభా ఒత్తిళ్లు వంటి మానవ నిర్మిత చర్యలు ఎడారి లాంటి పరిస్థితులను వ్యాప్తి చేస్తున్నాయి. దేశంలో సుమారు 1.2 కోట్ల హెక్టార్ల భూమికి సరైన డ్రైనేజీ లేకపోవడం, లింక్ చేయని కాలువల నుండి నీరు కారడం వల్ల ముంపుకు గురవుతుంది. దీనివలన లవణీయత, క్షారత్వం పెరుగుతుంది. పంజాబ్, హరియాణాలో మితిమీరిన నీటి పారుదల పద్ధతులతో అధోగతి పాలవుతున్నాయి. పట్టణీకరణ, పారిశ్రామికీకరణ దీర్ఘకాలిక కార్సినోజెనిక్ ప్రభావాలతో రసాయన విషాన్ని, భారీ లోహాలను నేలలలోకి ప్రవేశపెడుతుంది.

పారిశ్రామిక వ్యర్థాలు పేలవమైన వ్యర్థాల నిర్వహణ మట్టి కలుషితానికి మరింత దోహదం చేస్తుంది. ఓపెన్ కాస్ట్ మైనింగ్ నేల యొక్క భౌతిక, రసాయన జీవ లక్షణాలను తీవ్రంగా మారుస్తుంది. దుక్కు దున్నడం, పంట మార్పిడి, సేంద్రీయ పదార్థాల జోడింపు, లాంటి స్థిరమైన నేల నిర్వహణ పద్ధతులు నేల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి, నేల కోతను తగ్గిస్తాయి, నీటి నిల్వలను మెరుగుపరుస్తాయి. ఈ పద్ధతులు నేల జీవవైవిధ్యాన్ని కూడా సంరక్షిస్తాయి, సారాన్ని మెరుగుపరుస్తాయి. వాతావరణ మార్పులకు వ్యతిరేకంగా పోరాటంలో కీలక పాత్ర పోషిస్తాయి.

**జనక మోహన రావు దుంగ**
**8244045230**

# వరకట్న నేరాల్లో పాలకుల పాపమెంత?



జగిత్యాలకు దగ్గరగా రేచుపల్లి గ్రామంలో పోగుల లత వరకట్న హత్యకు గురైంది. గొంతు పిసికి చంపేశారని శవాన్ని చూసిన ఎవరికైనా అనుమానం రాకమానదు. అలాగే ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని కుటుంబ నేపథ్యం చూసినవారికి సులభంగా అర్థమవుతుంది. ఇలాంటి సంఘటనలు అనేకం జరుగుతున్నాయి. కానీ లత మరణం గురించి ప్రత్యేకంగా చర్చించుకోవాలి. లత కిక్ బాక్సింగ్‌లో నేషనల్ ఛాంపియన్. జిల్లా స్థాయిలో కరాటేలో సిల్వర్ మెడల్ సాధించింది. ఆమెకు 17 నెలల బాబు. భార్యాభర్తల మధ్య సమస్యను అనేకమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పరిష్కరించడానికి ప్రయత్నించారు. లత తండ్రి పౌరహక్కుల సంఘం జిల్లా బాధ్యుడు. ఆయనను తొమ్మిది నెలల క్రితం అకస్మాత్తుగా చత్తీస్‌గడ్ ఎన్‌ఐఎ పోలీసులు కిడ్నాప్ చేసి ఉపా కింద అరెస్టు చూపించారు. ఇలా తండ్రి జగదల్పూర్ జైలులోను, అన్న పని కోసం బయట దేశంలోనూ ఉన్న సమయాన్ని అదనుగా చూసి లతను ఆమె భర్త మంచిగా చూసుకుంటాను రమ్మని నమ్మించాడు. నమ్మి వెళ్లినందుకు లత నాలుగు నెలల్లోనే శవంగా తిరిగి వచ్చింది.


భారతదేశంలో భర్తను నమ్మినందుకు ఇలా పుట్టింటికి శవాలుగా తిరిగివస్తున్న వారెందరో! మన మనువాద కుటుంబ నియమాలు చెప్పేది కూడా ఇదే- పెళ్లయిన అమ్మాయి తల్లి గారింటికి వస్తే గిస్తే శవాలుగా మాత్రమే రావాలని. కనీసం కూతుర్ని కడసారి చూసుకొనేందుకైనా ఆ తండ్రికి కోర్టు పెరోల్ ఇవ్వలేదు. 2014 నుండి 2020 వరకు 8719 ఉపా కేసులు రిజిస్టర్ చేసి 10,522 మందిని అరెస్టు చేశారు. ఇక వీరికి బెయిలు రావడం గానీ చార్జిషీట్లు మొదలు పెట్టడం గాని కష్టమైన పనులే. ఉపా కేసుల ఉద్దేశ్యమే మానసికంగా ఏళ్లకేండ్లు జైల్లో నిర్బంధించి మానసికంగా వేధించడం. ఉపా చట్టమే అలా రూపొందించబడింది. లతను చంపిన భర్తకు బెయిల్ వస్తుందేమో కానీ ఉపా కేసులో అరెస్టయిన తండ్రి మాత్రం బెయిల్ కోసం వేచిచూడవలసిందే.నేరాలు చేసి జైలుకెళ్ళిన కరుడుగట్టిన గూండాలకు, రాజకీయ నాయకులకు, బాబాలకు మతోన్మాదులకు 'బెయిల్ ఈస్ రూల్' వర్తిస్తుంది. గుజరాత్ మత కల్లోలాల్లో మూడేళ్ళ బిడ్డను, భర్తను, బంధువులను కోల్పోయి, సామూహిక అత్యాచారానికి గురైన బిల్కీస్ బానో రేపిస్టులను విడుదల చేసి దండలు వేసి మరీ సత్కరించిన దేశం మనది. అందుకే ఇక్కడ న్యాయం అందరి సొత్తు కాదు. రేపిస్టులు, నేరస్థులు బాహాటంగా తిరుగుతారు. మళ్ళీ మళ్ళీ అత్యాచారాలు, హత్యలు జరుగుతూనే ఉంటాయి. అత్యాచారాలు జరిగినప్పుడల్లా మహిళలే జాగ్రత్తగా, ఒద్దికగా ఉండలేదని వాళ్ళనే నేరస్థుల్ని చేస్తారు. అందుకే కుటుంబాల్లో ఆడవాళ్ళ మీద ప్రాణాలు తీసేంత కర్కశత్వం పెరుగుతూనే ఉంది. ఈ కర్కశత్వాన్ని అరికట్టాల్సిన పాలకులేఫాదర్ స్టాన్ స్వామిని, వికలాంగుడైన ప్రొఫెసర్ సాయిబాబాలని బెయిలు ఇవ్వకుండా వేధించి చంపారు. కాబట్టి పాలకుల్లో లేని మానవత్వాన్ని లత భర్త లాంటి వ్యక్తుల్లో ఎలా చూడగలం!

1975-80 ప్రాంతంలో విపరీతంగా పెరిగిన వరకట్న హత్యలకు వ్యతిరేకంగా వచ్చిన మహిళా ఉద్యమాల ఫలితంగా 1983లో 498ఎ చట్టం వచ్చింది. ఇది అత్తగారింట్లో మహిళలపై జరిగే క్రూరత్వాన్ని అరికట్టడానికి వచ్చిన క్రిమినల్ చట్టం. అయితే వ్యవస్థలో ఉన్న లొసుగుల కారణంగా దీని అమలులో వచ్చిన లోపాలను సాకుగా చూపి 2014 నుండి 498ఎ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ వస్తున్నారు. నిందితుడిని అరెస్టు చేయడమన్నది పోలీసుల విచారణ మీదే ఆధారపడుతున్నది. 2017లో 498ఎ కేసు పెట్టిన తర్వాత ఫ్యామిలీ వెల్ఫేర్ కమిటీలతో నిందితుడి అరెస్టుకు ముందు విచారణ జరుపాలని సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ఇచ్చింది. ఇందులో సామాజిక వర్కర్లు, న్యాయ నిపుణులు ఉంటారు. 2018లో మళ్ళీ వీటిని రద్దు చేశారు. ఇలా సుప్రీంకోర్టులో చిన్న చిన్న మార్పులు జరుగుతూనే ఉన్నాయి. ఇక భారతీయ న్యాయ సంహిత (బిఎన్‌ఎస్) వచ్చాక 2024లో కుటుంబంలో భార్యాభర్తలిద్దరికీ న్యాయపరమైన రక్షణ ఉండాలని సుప్రీంకోర్టు ప్రతిపాదనలు వస్తున్నాయి. ఇది 498ఎ చట్టానికి మరింత తూట్లు పొడవడమే అవుతుంది. ఇదంతా కూడా మన దేశ కుటుంబ వ్యవస్థను విచ్ఛిన్నం చేయవద్దనే కారణం మీద జరుగుతున్నాయి.

ఎంతో చలాకీ అమ్మాయి పోగుల లత హత్యకు గురి కావడానికి భర్త మాత్రమే బాధ్యుడు కాదు. మానవత్వం లేని మనుషులను తయారు చేస్తున్న పాలకులది ప్రధాన బాధ్యత. కాబట్టి పాలకుల విధానాలను నిలదీయడం ద్వారానే వరకట్న హత్యలను, కుటుంబ హింసను నివారించగలం.

# కాలమహిమ

భక్తి



కాలచక్రం నిర్విరామంగా పరిభ్రమిస్తూ ఉంటుంది. దాన్ని నిలువరించడం ఎవరికీ సాధ్యంకాని పని. కాలగమనంలో ఎన్నో పరిణామాలు సంభవిస్తూ ఉంటాయి. వాటిని తెలుసుకొని, సాక్షులుగా ఉండడం తప్ప మనకు వేరే మార్గం ఉండదు. ఒకప్పుడు నిరుపేదగా ఉన్న వ్యక్తి... కొంతకాలానికి గొప్ప ఐశ్వర్యవంతుడిగా కనిపిస్తాడు. అదే కాల మహిమ.

కాలం అత్యంత పవిత్రమైనది. నిర్ణీత కాలంలో చేసిన కార్యం ఏదైనా విజయవంతమై తీరుతుంది. చేయబోయే పనికి సరైన సమయాన్ని నిర్దేశించడం, ఆ నిర్దేశించిన సమయాన్ని మరే కార్యానికీ ఖర్చు చేయకుండా... దేనికోసం కేటాయించారో దానికే ఉపయోగించడం వివేకవంతులు తీసుకొనే తెలివైన నిర్ణయం. కార్యసాధకుడు ఏనాడూ కాలానికి తలవంచడు. తన ప్రయత్నం తాను చేస్తూ ముందడుగు వేస్తాడు. కార్యసాధనలో మొదట నిరాశ ఎదురైనా... దాన్ని లక్ష్యపెట్టకుండా, పట్టుదలతో ముందుకు సాగి విజయాన్ని కైవసం చేసుకుంటాడు.

ఈ విషయంలో మనకు హనుమంతుడు స్ఫూర్తిప్రదాత. సీతాన్వేషణలో హనుమంతుడికి ముందుగా మైనాకుడు ఎదురై, తన ఇంటికి రమ్మని ఆహ్వానిస్తాడు. ఆ ఆహ్వానాన్ని ఆయన సున్నితంగా తిరస్కరించి, లంకకు చేరుకుంటాడు. అక్కడ తనకు శాప విముక్తి ప్రసాదించే వానరుడి కోసం లంకిణి ఎంతో కాలంగా నిరీక్షిస్తోంది. చివరకు హనుమ చేతిలో ఆమెకు శాపవిమోచన కలిగింది. అదే కాలమహిమ. కాలమే అన్నిటికీ సమాధానం చెబుతుంది. కాలం ఎప్పుడూ తక్షణమే సత్ఫలితాలను ఇవ్వదు. అలాగని వెంటనే దుఃఖాలను కూడా ఇవ్వదు. ఎవరికి ఏ సమయంలో ఏది అనుకూలమో దాన్ని మాత్రమే ఇవ్వగలుగుతుంది.

శ్రీరామచంద్రుడికి మరుసటిరోజు పట్టాభిషేకం జరగబోతోందని అయోధ్యలో ప్రజలు ఎంతో ఆనందంగా గడిపారు. కానీ ఆ మర్నాడు... అదే సమయానికి సీతా రామ లక్ష్మణులు నార వస్త్రాలను ధరించి వనవాసానికి బయలుదేరుతారని ఎవరూ ఊహించలేదు. కానీ రాముడు వనవాసానికి వెళ్ళకపోతే రావణ వధ జరిగి ఉండేది కాదు కదా! కాలమహిమ అంటే అదే మరి! రామ దర్శనం కోసం శబరి పన్నెండేళ్ళపాటు నిరీక్షించింది. ఆ తరువాతే ఆమెకు రామదర్శనం అయింది. ఆమె పునీత అయింది, చివరకు పవిత్ర నదిగా మారింది.

మహా భారతాన్ని గమనిస్తే... మాయా ద్యూతంలో ఓడిన పాండవులు పన్నెండేళ్ళపాటు వనవాసం, ఒక ఏడాది అజ్ఞాత వాసం చేయవలసి వచ్చింది. అయితే వాళ్ళు కుంగిపోలేదు. ఆ కఠినతరమైన సమయాన్ని తమకు అనుకూలంగా మార్చుకున్నారు. వనవాస సమయంలోనే అర్జునుడు ఇంద్రకీలాద్రిపై తపస్సు చేసి, శివుణ్ణి మెప్పించి, పాశుపతాస్త్రాన్ని వరంగా పొందగలిగాడు. అదే విధంగా స్వర్గలోకంలో ఒక రోజు తన సన్నిధిలో ఉండడానికి నిరాకరించాడని అర్జునుణ్ణి ఏడాదిపాటు బృహన్నలగా మారిపోతావని ఊర్వశి శపించింది. ఆ శాపాన్ని ఆయన వరంగా మార్చుకున్నాడు. అజ్ఞాతవాస సమయంలో... విరాట రాజు కొలువులో నాట్యాచార్యుడిగా చేరి... ఆ శాపాన్ని ఉపయోగించుకున్నాడు. సాక్షాత్తూ నారాయణుడైన కృష్ణుడే కంసుడు, శిశుపాలుడు తదితర దుష్టుల్ని శిక్షించడానికి సమయం తీసుకున్నాడు. పాపం పండితే కాదని ఫలితం బయటకు రాదన్నది సత్యం.

కాలం మనల్ని కొన్ని సందర్భాల్లో కష్టపెట్టినా... ఆ తరువాత తగిన ఫలితాన్ని తప్పక ఇస్తుంది. ఆ ఫలితాన్ని పొందడానికి ముందు మనకు ఎదురయ్యే గడ్డు కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి. దానికోసం మనకు కావలసింది ఓర్పు. ఓర్పు స్థానంలో ఉదాసీనత ఏర్పడితే... కాలం సత్ఫలితాలను ఇవ్వదనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. ప్రస్తుతం పరిగెడుతున్న కాలంతో మనం సహజీవనం చేస్తున్నాం. ఈ ప్రహసనంలో దుఃఖం మనకు చేరువైన వెంటనే... దానికి సరైన నివారణ వెతకడానికి ప్రయత్నించాలి. అప్పుడు తప్పకుండా విజయం వరిస్తుంది. కాబట్టి కాలాన్ని గౌరవిద్దాం. కాలంతోపాటు పయనిస్తూ... కష్టాలు ఎదురైనప్పుడు వాటికి ఎదురీదుదాం. పట్టుదలతో ముందుకు సాగితే విజయం లభిస్తుంది. కాలం ఎప్పుడూ మనకు అర్హమైన విజయాన్ని ఇవ్వకుండా ఉండదని గుర్తు పెట్టుకొని ముందుకు సాగినప్పుడు జీవితం ఫలప్రదం అవుతుంది.

కాలం మనల్ని కొన్ని సందర్భాల్లో కష్టపెట్టినా... ఆ తరువాత తగిన ఫలితాన్ని తప్పక ఇస్తుంది. ఆ ఫలితాన్ని పొందడానికి ముందు మనకు ఎదురయ్యే గడ్డు కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి. దానికోసం మనకు కావలసింది ఓర్పు. ఓర్పు స్థానంలో ఉదాసీనత ఏర్పడితే... కాలం సత్ఫలితాలను ఇవ్వదనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి.

## స్నానం చేసేటప్పుడు ఈ చిట్కాలు పాటిస్తే జుట్టు రాలదు..



ప్రస్తుతం చాలా మంది జుట్టు రాలే సమస్యతో బాధపడుతున్నారు. నేటి ఆధునిక జీవనశైలి, ఆహారపు అలవాట్ల వల్ల జుట్టు సమస్యలు అన్ని వయసుల వారికి సర్వసాధారణంగా మారాయి. కెమికల్ బేస్డ్ ప్రొడక్ట్స్ వాడితే జుట్టు మరింత డ్యామేజ్ అవుతుంది. తలస్నానం చేసేటప్పుడు మీ జుట్టును శుభ్రంగా కడగకపోతే, షాంపూలోని రసాయనాలు అలాగే ఉండి మీ జుట్టును పాడు చేస్తాయి. జుట్టు రాలడానికి ఇది కూడా ఒక ప్రధాన కారణం కావచ్చు. అయితే, ఈ సమస్యను తగ్గించేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా జుట్టు రాలడం తగ్గడం లేదా? తరచూ షాంపూ, ఆయిల్ మార్చుకున్నా జుట్టు రాలుతునే ఉందా? అయితే కొన్ని ఇంటి చిట్కాలు పాటిస్తే జుట్టు రాలడం తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. అవేంటో ఈ కథనంలో తెలుసుకుందాం..

సల్ఫేట్ లేని షాంపూ..తలస్నానం చేసేటప్పుడు కొన్ని విషయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. జుట్టు రాలడాన్ని నివారించడానికి సల్ఫేట్ లేని షాంపూని ఉపయోగించి మీ జుట్టును కడగాలని నిపుణులు సిఫార్సు చేస్తున్నారు. ఇలా చేస్తే జుట్టు పొడవుగా, ఆరోగ్యంగా ఉంటుందంటున్నారు.

వారానికి 2-3 సార్లు..రోజూ తలస్నానం చేయడం వల్ల జుట్టు పొడిబారుతుంది. దీని వల్ల స్కాల్ప్‌లో ఉండే సహజసిద్ధమైన నూనె నశించి జుట్టు ఎక్కువగా రాలిపోతుంది. దీని నివారణకు వారానికి 2-3 సార్లు తలస్నానం చేస్తే సరిపోతుంది.

వేడి నీటితో స్నానం చేయవద్దు..చాలా వేడి నీటితో స్నానం చేయవద్దు. ఇది జుట్టు రాలడానికి కారణమవుతుంది.



# ఈ నెల్లో.. ఓ పువ్వు పుట్టింది!



పున్నమి నాడు పుట్టిందని పూర్ణిమ అనీ, కార్తిక మాసంలో పుట్టాడని కార్తిక్ అనీ ఇలా పుట్టిన నక్షత్రాన్నీ, రోజునీ, మాసాన్నీ బట్టి పేర్లు పెట్టుకోవడం మనకు అలవాటే. అచ్చం అలాగే మనం ఓ రకం పూలకీ పేరు పెట్టాం. అవే డిసెంబరాలు. కనకాంబరాలు, నీలాంబరాల్లాగే డిసెంబర్‌లో పుట్టిన వీటిని డిసెంబరాలు అని ప్రేమగా పిలుచుకుంటాం. ఎన్నెన్నో రంగుల్లో విరబూసే ఈ పూల వెనుక మరెన్నో సంగతులున్నాయి.

చలికాలం రాగానే వాకిట్లో ఫ్లవర్‌వేజ్ పెట్టినట్టు చెట్టునిండా పూస్తాయి డిసెంబర్ పూలు. ఇక, పూల బుట్ట చేత బట్టి, అందమైన మాల కట్టి జడతో దానికి జుట్టు కట్టడమే మన పని. పొడవుగా ఉండే పూలు కనుక లావైన దండ ముస్తాబవుతుంది వీటితో. ఈ నెలలో పూస్తాయి కాబట్టి డిసెంబర్ పూలు అంటాం కానీ వీటి అసలు పేరు బార్లీరియా. ఇందులో 300 రకాల దాకా రకాలు ఉన్నాయట. తెలుపు, గులాబీ, నీలం, ఊదా, లావెండర్ రంగులు ఎక్కువగా ఉంటాయి. మనకు ఎక్కువగా పరిచయం లేని ఎరుపు రంగు కూడా ఈ రకంలో పూస్తుంది. ఇవి భారత్‌తో పాటు చైనా, తైవాన్, అమెరికా, ఆఫ్రికా, అరేబియన్ దీవులు, ఈజిప్ట్- ఇలా ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లోని ఉష్ణ, సమశీతోష్ణ మండలాల్లో పెరుగుతాయి. పెరిగే చోటును బట్టి సెప్టెంబర్ మొదలు జనవరి దాకా బాగా పూస్తాయివి. ఒక రకంగా చెప్పాలంటే మంచుకురిసే మాసపు రంగుల మల్లెలన్నమాట.

వజ్రదంతి ఇదే

బార్లేరియాలకు సంబంధించిన ఆసక్తికర అంశం ఏమిటంటే మన దగ్గర పెరిగే ముళ్ల గోరింట పువ్వులు కూడా ఈ రకానికి చెందినవే. ముళ్ల గోరింటనే వజ్రదంతి అని కూడా పిలుస్తారు. ఈ చెట్టు ఆకుల రసం పళ్లను వజ్రాల్లా బలంగా ఉంచేందుకు సాయపడుతుందట. ఇదనే కాదు, బార్లేరియాలో చాలా జాతుల్ని పూర్వకాలపు మందుల నుంచీ నేటి మోడ్రన్ మెడిసిన్ వరకూ వివిధ వ్యాధులకు ఔషధంగా వినియోగిస్తున్నారు. ఆయుర్వేదంలోనూ దీనికి ఎంతో ప్రశస్తి ఉంది. యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ వైరల్ గుణాలున్న ఇది చిగుళ్ల నుంచి రక్తాన్ని కారడం ఆపడంతో పాటు, అల్సర్లను నివారిస్తుంది.

కోరింత దగ్గు, మధుమేహంలాంటి వాటి నియంత్రణకు ఉపయోగ పడుతుంది. అంతేకాదు, క్యాన్సర్లను నివారించడంలోనూ ఈ మొక్క ప్రభావవంతంగా పనిచేస్తుందట. దీని వేళ్లను పాము, తేలు కాటుకు చేసే వైద్యంలో వినియోగిస్తారు. దీని ఆకుల రసాన్ని కాళ్ల పగుళ్లను తగ్గించేందుకు వాడతారు. ఇక, ఎంతో అందంగా చెట్టు నిండా విరబూసే ఈ పూలు సీతాకోక చిలుకల్ని విపరీతంగా ఆకర్షిస్తాయి. వాటి లార్వాలు ఏర్పడేందుకు అనుకూలంగా ఉంటాయి. ఈ పూలు ఎంత తీయగా ఉంటాయో సీతాకోక చిలుకలకేంటి, పువ్వు తెంపి చివర చప్పరించిన వారందరికీ తెలిసిందే. అందుకే ఈ చెట్టుకు తేనె పూవు చెట్టన్న పేరూ ఉందన్న మాట!







## తీయ తీయ్యని 'తర్బూజా'



వేసవి తాపాన్ని తీర్చే పళ్లలో చెప్పుకోదగినది తర్బూజా. నీటి శాతం ఎక్కువగా ఉండే తర్బూజా ముక్కలు తింటే పొట్టలో చల్లగా ఉండటంతోపాటు చలువ కూడా చేస్తుంది. ఇక తర్బూజా పండుతో పొందే ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఎక్కువే!

ఈ పండులో ఉండే పొటాషియం రక్తపోటును క్రమపరిచి హైపర్‌టెన్షన్‌ని దూరంగా ఉంచుతుంది.

తర్బూజాలో ఉండే విటమిన్ ఎ, బీటా కెరొటిన్ దృష్టిని మెరుగుపరిచి శుక్లాలు రాకుండా కాపాడుతుంది.

తర్బూజాలోని చక్కెరను శరీరం తేలికగా జీర?ం చేసుకోగలదు. తర్బూజా విత్తనాల్లో ఉండే ప్రత్యేకమైన పీచు వల్ల బరువు తగ్గే అవకాశం కూడా ఉంటుంది. వీటిలో ఉండే పొటాషియం పొట్ట దగ్గరి కొవ్వును కరిగిస్తుంది.

ఈ పండు తినటం వల్ల రక్తంలోని చక్కెర స్థాయిలు స్థిరంగా ఉంటాయి.

దీన్లోని విటమిన్ సి రోగనిరోధకశక్తిని పెంచుతుంది. తెల్ల రక్తకణాల సంఖ్య పెంచి వ్యాధికారక బ్యాక్టీరియా, వైరస్‌ల నుంచి రక్షణ కల్పిస్తుంది.


తర్బూజా తింటే మలబద్ధకం సమస్య నుంచి విముక్తి కలుగుతుంది.

ఆక్సికైన్' అనే పదార్థం వల్ల మూత్రపిండాల వ్యాధులు తగ్గుముఖం పడతాయి.

తర్బూజా తింటే కండరాలు, నరాలు రిలాక్స్ అయి మంచి నిద్ర పడుతుంది.

దీనికుండే 'యాంటి కోయాగులెంట్'(రక్తపు గడ్డలు కరిగించే స్వభావం) వల్ల నెలసరి నొప్పులు తగ్గుతాయి.

# ఇంతి చేతికి.. ఇంపైన నగలు






**ఆభరణాలు ఎంచుకోవడంలో అతివల అభిరుచులే వేరు. ఒక్కొక్కరూ ఒక్కోరకాన్ని ఇష్టపడతారు. సందర్భాన్ని బట్టి నచ్చిన వాటిని అలంకరించుకుంటారు. అయితే, పెళ్లి లాంటి వేడుకల్లో మాత్రం.. సంప్రదాయ నగలకే 'జై' కొడతారు. అలాంటి వాటిలో ముందుండేవి.. హాత్ఫూల్ జువెల్లరీ! ఇవే అసలు సిసలైన హస్త భూషణాలు! ఇంతిచేతిపై కొలువుదీరే.. ఈ ఇంపైన నగల విశేషాలేంటో తెలుసుకుందాం..**

భారతీయ వివాహ వేడుకల్లో హాత్ఫూల్ నగలది ప్రత్యేక స్థానం. వధువు వస్త్రధారణలో ముఖ్యమైన ఆభరణం. ఇవి మహిళల సౌందర్యానికి, శుభానికి, వైవాహిక బంధానికి ప్రతీకలుగా నిలుస్తాయి. వివాహాలతోపాటు, పండుగలు, సాంస్కృతిక వేడుకల్లోనూ చెలియల చేతులపై సందడి చేస్తాయి. బంగారం, వెండిలాంటి ఖరీదైన లోహాలకు వజ్రాలు, రూబీలు, ఎమరాల్డ్, ముత్యాల లాంటి విలువైన రత్నాలు జతకూడి.. ఈ హాత్ఫూల్ ఆభరణాలు తయారవుతున్నాయి. క్లిష్టమైన ఫిలిగ్రీలాంటి సంప్రదాయ డిజైన్ల నుంచి, మినిమలిస్ట్, ఎనామెల్ లాంటి ఆధునిక డిజైన్ల వరకూ.. ఈ నగల్లో ఒదిగి పోతున్నాయి.

కొన్ని డిజైన్లలో పూల నమూనాలు, రేఖాగణిత ఆకారాలు, నెమళ్లు, ఏనుగులు, హంసల వంటి ఆకృతులూ కొలువు దీరుతున్నాయి. సాంస్కృతిక ప్రాముఖ్యతనూ పెంచుతున్నాయి. వీటి తయారీలో ఉపయోగించే ఆకారాలు, రాళ్లు, డిజైన్లను బట్టి.. ఈ నగల్లో చాలారకాలు ఉంటాయి. కుందన్లను పొదిగిన వాటిని 'కుందన్ హాత్ఫూల్' అంటారు. వీటిని బంగారం లేదా వెండితో చేస్తారు. రంగురంగుల రత్నాలు, ముత్యాలను ఉపయోగించి జాడవ్ పద్ధతిలో వీటిని తయారుచేస్తారు.

లోహాలపై ఎనామెల్ మెరుపులను జోడించేది.. మీనాకారీ హాత్ఫూల్. ఆకర్షణీయమైన రంగుల్లో రకరకాల ఆకృతులను పొదిగిన ఈ నగలు.. హస్తకళకు తార్కాణంగా నిలుస్తాయి. అన్నిరకాల దుస్తులకూ సంప్రదాయ కళను తీసుకొస్తాయి. ముత్యాలను జోడించి చేస్తే.. 'పెర్ల్ హాత్ఫూల్'. వీటిని స్వచ్ఛత, దయకు చిహ్నంగా భావిస్తారు. కట్ డైమండ్స్‌ను పొదిగిన డిజైన్లను.. 'పోల్కీ హాత్ఫూల్' అంటారు. ఇవి మిలమిల మెరుస్తూ.. అందరి దృష్టినీ ఆకర్షిస్తాయి.

ఇక గులాబీలు, చామంతుల వంటి పూల డిజైన్లతో కనిపించేవి 'ఫ్లోరల్ హాత్ఫూల్'. ఈరకం డిజైన్లు లోహాలతోనే కాకుండా.. నిజమైన పూలు, ప్లాస్టిక్ పూలతోనూ రూపుదిద్దుకుంటున్నాయి. ధరించే దుస్తులను బట్టి.. వాటికి నప్పేలా రంగులను ఎంచుకోవచ్చు. ఇవేకాకుండా.. సిల్వర్ హాత్ఫూల్, క్రిస్టల్ హాత్ఫూల్, గోల్డ్ హాత్ఫూల్, రాజస్థానీ హాత్ఫూల్, వింటేజ్ హాత్ఫూల్, ట్రైబల్ హాత్ఫూల్.. ఇలా దీని లిస్టు చాంతాడంత! మగువల మనసుకు నచ్చినట్టుగా ఎంచుకోవచ్చు! మరెందుకు ఆలస్యం.. మీరూ ఓసారి ట్రై చేసి చూడండి!



## వేడి తగ్గించే వినూత్న పదార్థం!



నాటింగ్‌హామ్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ఓ వినూత్న ఆవిష్కరణ చేశారు. తనంతట తానే ఉష్ణోగ్రతను తగ్గించుకునే ఓ పదార్థాన్ని తయారు చేయగలిగారు. అంతేకాదు.. ఈ పదార్థంతో కాలిన గాయాలకు మెరుగైన చికిత్స కల్పించవచ్చు... అంతరిక్షంలో రేడియోధార్మికత తదితర శక్తుల నుంచి రక్షణ పొందవచ్చు కూడా. క ృత్రిమ ప్లాస్టిక్... అతిసూక్ష్మస్థాయి చానెళ్లు.. కొన్ని ద్రవాలతో రూపొందిన ఈ కొత్త పదార్థం ధర్మాన్ని ఎప్పుడు కావాలంటే అప్పుడు మార్చుకోవచ్చు.మొక్కలు, మానవ శరీరాల మాదిరిగా పనిచేసే ఈ పదార్థం కాలిన గాయాల నుంచి వేడిని తొలగించేందుకు బాగా ఉపయోగపడుతుందని.. తద్వారా గాయం తొందరగా మానేందుకు అవకాశం ఏర్పడుతుందని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త డాక్టర్ మార్క్ ఆల్ట్‌సన్. అంతేకాకుండా.. అంతరిక్ష ప్రయాణాల్లో సౌర రేడియోధార్మికత కారణంగా వేడి విపరీతంగా పెరిగిపోతూంటుందని.. ఈ వేడిని క్రమ పద్ధతిలో తగ్గించడం.. ఒక దగ్గర కేంద్రీక ృతమయ్యేలా చేయడం.. ఆ తరువాత ఆ వేడిని విద్యుత్తుగా మార్చగలగడం ఈ పదార్థం ప్రత్యేక లక్షణమని వివరించారు. ప్రస్తుతం తాము ఈ పదార్థాన్ని పరిశోధనశాలలో ప్రయోగాత్మకంగా పరిశీలించి చూశామని.. తగినన్ని నిధులు సమకూర్చుకున్న తరువాత వాణిజ్య స్థాయిలో పరిశోధనలు చేస్తామని వివరించారు.

**మూర్ఛను ముందుగా గుర్తించే పరికరం...**మూర్ఛ లక్షణాలు ఎప్పుడు కనిపిస్తాయో చెప్పడం కష్టం. ఏమాత్రం ముందు తెలిసినా తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా అనవసరమైన గాయాలు, ప్రాణాపాయం నుంచి రక్షణ పొందవచ్చు. ఐండోహెూవెన్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ శాస్త్రవేత్తలు ఇప్పుడు అచ్చంగా అలాంటి యంత్రాన్ని తయారు చేశారు. చేతి కంకణం మాదిరిగా తొడుక్కునే ఈ యంత్రాన్ని తాము 28 మంది రోగులపై పరీక్షించి సత్ఫలితాలు సాధించామని... మూర్ఛ వచ్చే ముందు ఈ యంత్రం ఓ అలారం మోగిస్తుందని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త డాక్టర్ జొహాన్ అరెండ్స్ తెలిపారు.


## వరుసగా నాలుగో రోజు.. లాభాల్లో ముగిసిన సూచీలు..



**న్యూఢిల్లీ-నవభూమి:**దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో రోజు లాభాల్లో ముగిశాయి. బ్యాంకింగ్, రియల్టీ స్టాక్స్ కొనుగోళ్లతో మార్కెట్లు లాభపడ్డాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 81,036.22 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. మధ్యాహ్నం వరకు ఒక్కసారిగా పడిపోయింది. తిరిగి కోలుకొని చివరకు లాభాల్లో ముగిసింది. ఇంట్రాడేలో 80,630.53 పాయింట్ల కనిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. గరిష్ఠంగా 81,245.39 పాయింట్ల వరకు పెరిగింది. చివరకు 110.58 పాయింట్ల లాభంతో 80,956.33 వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ 10.30 పాయింట్లు పెరిగి 24,467.45 వద్ద ముగిసింది.
ట్రేడింగ్‌లో దాదాపు 2,307 షేర్లు పురోగమించగా, 1,507 షేర్లు పతనమయ్యాయి. మరో 95 షేర్లు మాత్రం మారలేదు. నిఫ్టీలో హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, అపోలో హాస్పిటల్స్, ఎన్‌టీపీసీ, బజాజ్ ఫిన్‌సర్వ్ టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. భారతీ ఎయిర్‌టెల్, సిప్లా, బజాజ్ ఆటో, టాటా మోటార్స్, అదానీ పోర్ట్స్ నష్టపోయాయి. సెక్టోరల్ ఫ్రంట్‌లో ఆటో, ఎఫ్ఎంసీసీ ఒక్కొక్కటి 0.7శాతం క్షీణించగా.. ఐటీ, మీడియా ఒక్కొక్కటి 0.5 శాతం, రియాల్టీ, పీయూఎస్ బ్యాంక్ రంగాల షేర్లు 2శాతానికి పైగా లాభపడ్డాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ దాదాపు ఒకశాతం లాభపడగా.. స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.6 శాతం పెరిగింది.




## నిర్వహణలో లేని ఖాతాలను తగ్గించుకోండి




**ముంబై-నవభూమి:** నిర్దిష్ట కాలం పాటు ఎలాంటి లావాదేవీలు నిర్వహించని ఖాతాలు లేదా స్తంభింపచేసిన ఖాతాల సంఖ్య తగ్గించాలని బ్యాంకులను భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఆదేశించింది. అలాంటి ఖాతాల సంఖ్య ఎంత ఉన్నది ప్రతి త్రైమాసికానికి ఒకసారి ప్రతి బ్యాంకు ప్రకటించాలని సూచించింది. అలాంటి ఖాతాల్లో నిల్వ ఉండిపోతున్న సొమ్ము క్రమక్రమంగా పెరిగిపోతూ ఉండడం పట్ల ఆవేదన ప్రకటించింది. ఇలా ఖాతాలు స్తంభించిపోవడానికి కారణాలెన్నో ఉన్నట్టు తమ తనిఖీల్లో తేలిందని ఆర్‌బీఐ తెలిపింది. ఆర్‌బీఐకి చెందిన సూపర్‌విజన్ డిపార్ట్‌మెంట్ ఇలాంటి ఖాతాలపై ఇటీవల విశ్లేషణ నిర్వహించింది.
మొత్తం డిపాజిట్లలో చలామణిలో లేని ఖాతాలు/క్లెయిమ్ చేసుకోని డిపాజిట్ల సంఖ్య పలు బ్యాంకుల్లో పెరుగుతున్నట్టు తేలిందని తెలిపింది. అలాంటి ఖాతాలన్నింటినీ తేలికైన విధివిధానాలు అనుసరించడం ద్వారా పునరుద్ధరించేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని సూచిస్తూ బ్యాంకు చీఫ్‌లందరికీ నోటిఫికేషన్ పంపింది. మొబైల్/ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా కేవైసీ అప్‌డేట్ చేయడానికి , వీడియో కస్టమర్ గుర్తింపు విధానం అనుసరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించింది. అలాగే సమాజంలో దిగువ వర్గాలకు చెందిన ఖాతాలను ఇలాంటి ఖాతాల నుంచి వేరు చేసి ఆ ఖాతాల్లోకి నిరంతరాయంగా నగదు బదిలీ పథకాల నిధులు డిపాజిట్ అయ్యే వెసులుబాటు కల్పించాలని కూడా కోరింది. ఈ దిశగా బ్యాంకులు తీసుకుంటున్న చర్యలను ఆయా బ్యాంకులకు చెందిన కస్టమర్ సర్వీస్ కమిటీ (సీఎససీ) పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించింది. అలాగే ఖాతాల సంఖ్య తగ్గించడంలో సాధిస్తున్న పురోగతిని దక్ష్ పోర్టల్ ద్వారా ప్రతి త్రైమాసికానికి ఒకసారి సీనియర్ సూపర్‌వైజరీ మేనేజ్‌కు (ఎస్ఎసఎం) నివేదించాలని తెలిపింది.డిసెంబరు త్రైమాసికం నుంచే ఈ కృషి ప్రారంభం కావాలని ఆదేశించింది. ఇదిలా ఉండగా రుణ ప్రణాళికల రూపకల్పనలో బ్యాంకులు "దిగువ నుంచి ఎగువకు" వైఖరి అనుసరించాలని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ స్వామినాథన్ సూచించారు. డేటా విస్తృతంగా అందుబాటులో ఉంటున్న ప్రస్తుత యుగంలో రుణ ప్రణాళికల రూపకల్పనకు డేటా ఆధారిత వైఖరిని అనుసరించాలని కూడా సూచించారు. ఇలాంటి విధానాలు అనుసరించడం వల్ల లక్షిత వ్యూహాల రూపకల్పన సరళం అవుతుందన్నారు.

## లాభాల హ్యాట్రిక్

**న్యూఢిల్లీ-నవభూమి:**భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా మూడో రోజు లాభపడ్డాయి. మంగళవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 597.67 పాయింట్ల వృద్ధితో 80,845.75 వద్దకు చేరుకుంది. నిఫ్టీ 181.10 పాయింట్లు బలపడి 24,457.15 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాల నేపథ్యంలో ఈక్విటీ ఇన్వెస్టర్లు మార్కెట్ దిగ్గజాలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫసీ బ్యాంక్ సహా పలు బ్లూచిప్ షేర్లలో కొనుగోళ్లు పెంచడం సూచీల ర్యాలీకి దోహదపడింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 25 రాణించాయి. అదానీ పోర్ట్స్ షేరు 6 శాతానికి పైగా పెరిగి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. ఎన్‌టీపీసీ, ఎస్‌బీఐ, ఎల్ అండ్ టీ, యాక్సిస్ బ్యాంక్ షేర్లు 2 శాతానికి పైగా పుంజుకోగా.. ఆర్ఐఎల్, హెచ్‌డీఎఫసీ బ్యాంక్ షేర్లు ఒక శాతానికి పైగా వృద్ధి చెందాయి.
సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులు, శీతల పానీయాలపై జీఎసటీని 28 శాతం నుంచి 35 శాతానికి పెంచాలని మంత్రుల బృందం ప్రతిపాదించిన నేపథ్యంలో ఐటీసీ, గాడ్‌ఫ్రే ఫిలిప్స్, వరుణ్ బెవరేజెస్ నష్టాలు చవిచూశాయి. ఇంట్రాడేలో 3 శాతం క్షీణించిన ఐటీసీ షేరు చివరికి 1.02 శాతం నష్టంతో సరిపెట్టుకుంది. వరుణ్ బెవరేజెస్ 1.86 శాతం తగ్గింది.

**హెచ్‌డీఎఫసీ బ్యాంక్‌ఏ : రూ.14 లక్షల కోట్లు**

ప్రైవేట్ రంగ హెచ్‌డీఎఫసీ బ్యాంక్ షేరు ఒక దశలో దాదాపు 2 శాతం పెరిగి రూ.1,837 వద్ద సరికొత్త ఏడాది గరిష్ఠాన్ని నమోదు చేసింది. దీంతో బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ తొలిసారిగా రూ.14 లక్షల కోట్ల స్థాయికి చేరింది. చివరికి బ్యాంక్ షేరు 1.24 శాతం లాభంతో రూ.1,826.85 వద్ద ముగిసింది. మార్కెట్ క్యాప్ రూ.13.96 లక్షల కోట్ల స్థాయి వద్ద స్థిరపడింది.

**గ్రాన్యూల్స్ షేరు ఢమాల్**

హైదరాబాద్‌కు చెందిన ఫార్మా కంపెనీ గ్రాన్యూల్స్ లిమిటెడ్ షేరు బీఎసఈలో 10.12 శాతం క్షీణించి రూ.534.45 వద్దకు జారుకుంది. తెలంగాణలోని గాగిల్లాపూర్‌లో ఉన్న యూనిట్‌లో తనిఖీలు జరిపిన యూఎసఎఫ్‌డీఏ ఆరు లోపాలను గుర్తించినట్లు కంపెనీ వెల్లడించడం ఇందుకు కారణమైంది. ఎందుకంటే, కంపెనీకి మెజారిటీ ఆదాయం ఈ యూనిట్‌లో తయారయ్యే ఔషధాల ద్వారానే సమకూరుతోంది.

## రూ.45 కోట్ల ఐపీఓ నిధులను ఇన్వెస్టర్లకు తిరిగి ఇచ్చేయండి..

TrafkSol The Soul of Traffic Safety

**న్యూఢిల్లీ-నవభూమి:**నోయిడాకు చెందిన ట్రాఫిక్‌సోల్ ఐటీఎస్ టెక్‌కు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ గట్టి షాకిచ్చింది. పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ద్వారా సమీకరించిన రూ.45 కోట్ల నిధులను ఇన్వెస్టర్లకు వారం రోజుల్లో రిఫండ్ చేయాలని మంగళవారం ఆదేశించింది. రిఫండ్ ప్రక్రియను పర్యవేక్షించాల్సిందిగా బీఎసఈని సెబీ నిర్దేశించింది. ఐపీఓ ద్వారా నిధుల సేకరణ కోసం ఈ కంపెనీ తన పత్రాల్లో తప్పుడు సమాచారం ఇవ్వడంతోపాటు ఓ షెల్ కంపెనీతో కుమ్మక్కైనట్లు సందేహాలున్న నేపథ్యంలో సెబీ ఈ నిర్ణయం తీసుకుంది. ట్రాఫిక్‌సోల్ ఐటీఎస్ టెక్‌కు అనూహ్య స్పందన లభించింది. కంపెనీ ఆఫర్ ఏకంగా 345 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. రూ.10,000 కోట్లకు పైగా విలువైన బిడ్లను ఆకర్షించింది. ఐపీఓ అనంతరం ఈ కంపెనీ బీఎసఈ ఎస్ఎంఈ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌లో తన షేర్లను నమోదు చేయాల్సింది. కానీ, ఈ ఐపీఓపై రిటైల్ మదుపరుల సంఘం అనుమానాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో సంస్థ షేర్ల లిస్టింగ్‌ను బీఎసఈ వాయిదా వేసింది.

# జీఎస్టీలో 35 శాతం శ్లాబ్!



**న్యూఢిల్లీ-నవభూమి:**వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) శ్లాబుల్లో కొత్తగా మరొకటి రాబోతున్నదా? ఇప్పుడున్న 5, 12, 18, 28 శాతం శ్లాబులకుతోడు ప్రత్యేకంగా గరిష్ఠ శ్రేణిలో మరో శ్లాబు ఉండబోతున్నదా? అంటే.. అవుననే సమాధానాలే కేంద్ర ప్రభుత్వ వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. జీఎస్టీ రేటు హేతుబద్ధీకరణపై ఏర్పాటైన మంత్రుల బృందం.. సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులు, వివిధ రకాల శీతల పానీయాలు, గ్యాంబ్లింగ్‌పై 35 శాతం పన్ను వేయాలని ప్రతిపాదించింది మరి. ప్రస్తుతం ఇవన్నీ 28 శాతంలోనే ఉన్నాయి. ఇక సెస్సుతో కలిపితే పన్ను పోటు 57 శాతానికి చేరుతుండటం గమనార్హం. బీహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరి నేతృత్వంలోని మంత్రుల బృందం ప్రతిపాదిత జీఎస్టీ రేట్ల సర్దుబాట్లపై తాజాగా సమావేశమైంది. ఈ క్రమంలోనే ఆరోగ్యానికి హానికరమైన, సమాజాన్ని పెడదోవ పట్టించేవాటిపై (సిన్ గూడ్స్) పన్నులను పెంచాలన్న నిర్ణయానికి సభ్యులు వచ్చారు.

**21న నిర్ణయం?**

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నాయకత్వంలో ఈ నెల 21న జరుగబోయే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో మంత్రుల బృందం చేసిన ఈ సిఫార్సులు చర్చకు రానున్నాయి. ఆపై తుది నిర్ణయం తీసుకునే వీలున్నది. అయితే పన్ను వసూళ్లను పెంచడంలో భాగంగానే ఆయా వస్తూత్పత్తులపై ఈ ట్యాక్స్ రేట్ల సర్దుబాట్లు అని సమాచారం. దీంతో ఖజానాను నింపుకోవడానికి భవిష్యత్తులో మరిన్ని వస్తూత్పత్తులను ఈ హై రేంజ్ కేటగిరీలోకే మోదీ సర్కారు తెస్తుందా? అన్న అనుమానాలూ తలెత్తుతున్నాయి.

**పన్ను రేట్ల సర్దుబాట్లు**

దుస్తులు, మరికొన్నింటిపైనున్న జీఎస్టీ మార్పులపైనా ఈ సమావేశంలో చర్చ జరిగింది. ఈ క్రమంలోనే విలువనుబట్టి రూ.1,500దాకా 5 శాతం, రూ.1,500-10,000 మధ్య 18 శాతం, రూ.10,000పైన 28 శాతం పన్నులు వేయాలని మంత్రుల బృందం నిర్ణయానికొచ్చినట్టు తెలుస్తున్నది. మొత్తం 148 వస్తూత్పత్తులు, సేవలపై ప్రస్తుతం పడుతున్న పన్ను రేట్లను సవరించాలని మంత్రుల బృందం ప్రతిపాదించింది. ఇప్పుడు అత్యధిక వస్తూత్పత్తులు, సేవలు 18 శాతం శ్లాబులోనే ఉన్న సంగతి విదితమే.
ఇదీ విధానం..
జీఎస్టీ విధానంలో నిత్యావసరాలకు పన్ను మినహాయింపు (0 శాతం) లేదా కనిష్ఠ శ్లాబు 5 శాతం పన్ను పడుతున్నది. అయితే లగ్జరీ, ఆరోగ్యానికి హాని కలిగించే, సమాజంపై చెడు ప్రభావం చూపే వాటిపై గరిష్ఠంగా 28 శాతం పన్ను ఉన్నది. వీటిలో ఖరీదైన కార్లు, మోటర్‌సైకిళ్లు, ఏసీలు, వాషింగ్ మెషీన్లు, రిఫ్రిజిరేటర్లు వంటి కన్స్యూమర్ డ్యూరబుల్స్, సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులు, కొన్ని రకాల శీతల పానీయాలు, గ్యాంబ్లింగ్, క్యాసినోలు, లాటరీ తదితర ఆన్‌లైన్ గేమ్స్ ఉన్నాయి.
ఈ 28 శాతం పన్నుకుతోడు అదనంగా 22 శాతం సెస్సు కూడా ఉంటుంది. ఇక ప్రత్యేకంగా ముడి వజ్రాలు, రత్నాలపై పావు శాతం, బంగారంపై 3 శాతం జీఎస్టీ ఉన్నది. 2017 జూలై 1న జీఎస్టీని దేశవ్యాప్తంగా అమల్లోకి తెచ్చిన విషయం తెలిసిందే. వివిధ కేంద్ర, రాష్ట్ర పన్నులను కలిపి ఒకే దేశం, ఒకే పన్ను లక్ష్యంతో జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం పరిచయం చేసింది. ఇందుకుగాను ఆదాయాన్ని నష్టపోతున్న రాష్ట్రాలకు పన్ను వసూళ్లలో వాటాలనూ ఇస్తున్నది.

## ఆఫీస్ స్పేస్‌లో రీట్స్‌దే హవా



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశంలోని 7 ప్రధాన నగరాల్లో రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్)లకు చెందిన ఆఫీస్ స్పేస్ 526 మిలియన్ చదరపు అడుగులుగా ఉన్నదని ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ వెస్టియన్ మంగళవారం తెలిపింది. 'రీట్స్: రీషేపింగ్ ఇండియాస్ కమర్షియల్ స్పేస్' పేరిట విడుదల చేసిన నివేదికలో ఈ మేరకు వెల్లడించింది. ఈ స్టాక్ విలువ దాదాపు రూ.5 లక్షల కోట్లుగా ప్రకటించింది. హైదరాబాద్, ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, బెంగళూరు, చెన్నై, పుణె, కోల్‌కతా నగరాల్లో మొత్తం 884.1 మిలియన్ చదరపు అడుగుల గ్రేడ్-ఏ కార్యాలయ స్థలాలున్నాయని వెస్టియన్ డాటా చెప్తున్నది. ఇందులో రీట్స్‌కు చెందినదే 526.3 మిలియన్ చదరపు అడుగులని, దీని విలువ రూ.4.5 లక్షల కోట్లు అని స్పష్టం చేసింది. దీనిలో స్టాక్ మార్కెట్లలో నమోదైన రీట్స్‌ల్లో మూడింటికి చెందినదే 110.7 మిలియన్ చదరపు అడుగులుగా ఉందని వివరించింది.

**హైదరాబాద్ టాప్**

ఆయా నగరాలపరంగా చూస్తే.. హైదరాబాద్‌లోని మొత్తం ఆఫీస్ స్పేస్‌లో దాదాపు 74 శాతం రీట్స్ ఆధ్వర్యంలోని ఆఫీస్ స్పేసే కావడం గమనార్హం. అలాగే ముంబై, పుణెల్లోగల ఆఫీస్ స్పేస్‌లో రీట్స్‌కు చెందినదే 50 శాతం. అయితే ఈ విషయంలో 24 శాతంతో కోల్‌కతా ఆఖర్లో ఉన్నట్టు వెస్టియన్ తెలియజేసింది. ఇక ఈ ఏడు ప్రధాన నగరాల్లో రీట్స్‌కున్న ఆఫీస్ స్పేస్‌లో 60 శాతానికిపైగా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లలోనే ఉన్నది. ఇదిలావుంటే భారతీయ రీట్ సంస్థల్లో 4 మాత్రమే స్టాక్ మార్కెట్లలో నమోదయ్యాయని, వీటి ఆధ్వర్యంలో అటు రిటైల్, ఇటు ఆఫీస్ మార్కెట్లలోని స్పేస్ 125 మిలియన్ చదరపు అడుగులని వెస్టియన్ ఈ సందర్భంగా తెలిపింది.
2014లో రీట్స్ మొదలు.
2019లో స్టాక్ మార్కెట్లలోకి.
ప్రస్తుతం 4 రీట్స్ ట్రేడ్ అవుతుండగా, వాటిలో బ్రూక్‌ఫీల్డ్ ఇండియా రియల్ ఎస్టేట్ ట్రస్ట్, ఎంబసీ ఆఫీస్ పార్క్స్ రీట్, మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్, నెక్సస్ సెలెక్ట్ ట్రస్ట్ ఉన్నాయి. నెక్సస్ సెలెక్ట్ ట్రస్ట్‌కు రియల్ ఎస్టేట్ అసెట్స్ మాత్రమే ఉన్నాయి.

## మహిళా మణులకు శుభవార్త.. బంగారం ధర ఎలా ఉందంటే..



**న్యూఢిల్లీ-నవభూమి:**దసరా, దీపావళి, దంతేరాస్ పండగల వేళ బంగారం ధరలకు రెక్కలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ పండగల వేళ జీవితకాల గరిష్ఠానికి పసిడి, వెండి రేట్లు పెరిగాయి. అయితే కొన్ని రోజులుగా అంతర్జాతీయ మార్కెట్ ప్రభావం కారణంగా వీటి ధరలు తగ్గుతూ వస్తున్నాయి. నేడు (04-12-2024) బంగారం ధర స్వల్పంగా పెరిగింది. గ్రాముకు కేవలం ఒక రూపాయి మాత్రమే పెరిగి మహిళా మణులకు ఊరట కలిగించింది. 10 గ్రాముల బంగారం ధర నిన్న రూ.77,780 ఉండగా, నేడు రూ.10 పెరిగి రూ.77,790గా ఉంది. నిన్న వెండి కిలో ధర రూ.99,500 ఉండగా.. నేడు కిలోకు రూ.100 తగ్గి రూ.99,400కు చేరుకుంది.
దేశరాజధాని ఢిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.71,460 ఉండగా, 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.77,940గా ఉంది. కిలో వెండి రూ.100 తగ్గి రూ.90,900కు చేరుకుంది. హైదరాబాద్, విజయవాడలో 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ. 71,310 ఉండగా.. 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ. 77,790గా ఉంది. అలాగే కిలో వెండి రూ. 100 తగ్గి రూ. 99,400గా ఉంది. ఇక దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం..
దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం రేట్లు 10 గ్రాములకు (22 క్యారెట్, 24 క్యారెట్)
హైదరాబాద్- రూ. 71,310, రూ. 77,790,
విజయవాడ- రూ. 71,310, రూ. 77,790,
ఢిల్లీ- రూ.71,460 , రూ.77,940
ముంబై- రూ. 71,310, రూ.77,790
కోల్‌కతా- రూ. 71,310, రూ. 77,790
చెన్నై- రూ. 71,310, రూ. 77,790
పుణె- రూ. 71,310, రూ. 77,790
ప్రధాన నగరాల్లో వెండి ధరలు (కేజీకి)
పుణె- రూ.90,900
హైదరాబాద్- రూ. 99,400
విజయవాడ- రూ. 99,400
ఢిల్లీ రూ.90,900
చెన్నై- రూ. 99,400
కోల్‌కతా- రూ. 90,900
ముంబై- రూ.90,900

## లాభాలతో మొదలైన స్టాక్ మార్కెట్లు.. టాప్ 5 స్టాక్స్ ఏవంటే..



**ముంబై-నవభూమి:**దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం (డిసెంబర్ 4) భారీ లాభాలతో మొదలయ్యాయి. ఈ క్రమంలో ఉదయం 9.45 గంటల నాటికి సెన్సెక్స్ 347 పాయింట్లు పెరిగి 81,193 పరిధిలో ట్రేడ్ కాగా, నిఫ్టీ బ్యాంక్ 98 పాయింట్ల లాభంతో 24,542 దగ్గర ట్రేడవుతోంది. ఇదే సమయంలో బ్యాంక్ నిఫ్టీ 268 పాయింట్లు వృద్ధి చెంది 52,958 స్థాయిలో ట్రేడవగా, మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 272 పాయింట్లు లాభపడింది. దీంతో మదుపర్లు కొన్ని నిమిషాల్లోనే లక్షల కోట్ల రూపాయలను దక్కించుకున్నారు. నిన్నటి ముగింపుతో పోలిస్తే మార్కెట్ స్వల్ప పెరుగుదలతో మొదలై, క్రమంగా పుంజుకున్నాయి.

**టాప్ 5 స్టాక్స్**

ఈ నేపథ్యంలో లైఫ్, లైఫ్ ఇన్సూరెన్స్, విప్రో, HDFC బ్యాంక్ కంపెనీల స్టాక్స్ టాప్ 5లో ఉండగా, భారతి ఎయిర్‌టెల్, సిప్లా, అదానీ పోర్ట్స్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, అదానీ ఎంటర్‌ప్రైస్ సంస్థల స్టాక్స్ టాప్ 5 నష్టాల్లో ఉన్నాయి. బుధవారం నాటి ట్రేడింగ్‌లో స్విగ్గీ షేర్లు 6.6 శాతం జంప్ చేసి ఒక్కో షేరుకు రూ. 534.85 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని నమోదు చేశాయి. ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫాం తన సెప్టెంబర్ త్రైమాసికాన్ని మంగళవారం, పోస్ట్ మార్కెట్ అవర్స్‌లో విడుదల చేసిన తర్వాత మదుపర్లలో కొనుగోలు ఆసక్తి పెరిగింది. ప్రస్తుతం ఈ కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ రూ.1,15,727.73 కోట్లుగా ఉంది.
కారణమిదేనా..ప్రపంచ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు వెలువడినప్పటికీ ఈ వారం మార్కెట్ నిరంతరం లాభాలను చూపించడం విశేషం. చాలా రంగాల సూచీలు కూడా క్రమంగా పెరుగుతున్నాయి. ఇదే సమయంలో విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల నుంచి కూడా కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఈ కారణంగా మార్కెట్ సెంటిమెంట్ మెరుగుపడుతోంది. ఎఫ్ఐఐలు నిన్న రూ. 5700 కోట్లకు పైగా నగదు, ఇండెక్స్ ఫ్యూచర్లను కొనుగోలు చేయగా, దేశీయ ఫండ్స్ రూ. 250 కోట్ల విక్రయాలు చేశాయి.

**మార్కెట్ క్యాపిటలైజేషన్**

ఈరోజు ప్రారంభమయ్యే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్య విధాన కమిటీ సమావేశంతో పాటు నవంబర్‌కు సంబంధించిన సేవలు, మిశ్రమ డేటా కూడా మార్కెట్‌పై ప్రభావం చూపించింది. ఈక్విటీ మార్కెట్లలో ఇటీవల దిద్దుబాటు ఉన్నప్పటికీ భారతదేశంలో స్థూల దేశీయోత్పత్తికి మార్కెట్ క్యాపిటలైజేషన్ నిష్పత్తి ఎలివేట్‌గా ఉంది. ఇది మంగళవారం నాటికి 147.5 శాతంగా ఉంది. ఇది 10 సంవత్సరాల సగటు 94 శాతం కంటే 56 శాతం ఎక్కువ కావడం విశేషం. ప్రస్తుత నిష్పత్తి ఈ ఏడాది సెప్టెంబర్ చివరినాటికి ఆల్ టైమ్ హై రేషియో 154 శాతం కంటే కొంచెం తక్కువగా ఉంది. డిసెంబర్ 2007, సెప్టెంబర్ తర్వాత ఇది అత్యధికం.

## ఉద్యోగాల కల్పనలో దూసుకెళ్తున్న టాప్ 2 నగరాలు..




**న్యూఢిల్లీ-నవభూమి:** కొంతకాలం క్రితం వరకు ఉద్యోగాల విషయంలో కేవలం మెట్రో నగరాల పైనే దృష్టి ఉండేది. కానీ ఇప్పుడు పరిస్థితి క్రమంగా మారుతోంది. ఉపాధి రంగం అనేక ప్రాంతాల్లో పుంజుకుంటోంది. ఈ నేపథ్యంలో జైపూర్, కోయంబత్తూర్ వంటి టైర్- నగరాలు కూడా వ్యాపార కేంద్రాలుగా అభివృద్ధి చెందుతున్నాయి. పుష్కలమైన ప్రతిభ, తక్కువ నిర్వహణ ఖర్చులు మొదలైన వాటి కారణంగా ఈ నగరాలు వ్యాపారాలను ఆకర్షిస్తున్నాయని ఓ నివేదిక తెలిపింది. దీంతో ఈ ప్రాంతాల్లో లాజిస్టిక్స్, ఎలక్ట్రిక్ వాహనాలు, వ్యవసాయం వంటి రంగాలలో గణనీయమైన వృద్ధి కనిపిస్తోందని చెబుతున్నారు.

**ఈ నగరాలు వేగంగా నడుస్తున్నాయి**

ప్రముఖ రిక్రూట్‌మెంట్, హెచ్‌ఆర్ సేవల సంస్థ టీమ్‌లీజ్ నివేదిక ప్రకారం టైర్-2 నగరాలు ఉద్యోగాల కల్పనలో కొత్త హబ్‌లుగా మారబోతున్నాయని వెల్లడించింది. ఈ నగరాలు విద్యార్థులు, నిపుణుల కోసం మెట్రో నగరాలకు ప్రత్యామ్నాయంగా తమను తాము మార్చుకుంటున్నాయని వెల్లడించింది. అయితే ఉద్యోగాల కల్పన విషయంలో మెట్రో నగరాల క్రేజ్ తగ్గిందని కాదు. ఢిల్లీ, ముంబై, బెంగళూరు వంటి నగరాలు ఇప్పటికీ అగ్రస్థానంలో ఉన్నాయి. ఈ విషయంలో బెంగళూరు 53.1%, ముంబై 50.2% ఆ తర్వాత హైదరాబాద్ 48.2 తో టాప్ 3లో ముందంజలో ఉన్నాయి. చిన్న పట్టణాలు కూడా ఇప్పుడు వేగంగా విస్తరించడం విశేషం.

**ఇక్కడ చాలా ఉద్యోగాల వృద్ధి**

కోయంబత్తూరులో 24.6% ఉద్యోగ వృద్ధి కనిపిస్తోంది. ఈ సంఖ్య గుర్గావ్‌లో 22.6%, జైపూర్‌లో 20.3%గా ఉంది. ఈ 3 నగరాలతో పాటు లక్నో, నాగ్‌పూర్‌లలో కూడా ఉద్యోగావకాశాలు పెరిగాయి. ఈ నగరాల్లో ఉద్యోగ వృద్ధి వరుసగా 18.5%, 16.7%. ఈ నగరాలు వాటి ఖర్చుతో కూడుకున్న వ్యాపార వాతావరణం, పుష్కలమైన టాలెంట్ పూల్, తక్కువ నిర్వహణ ఖర్చుల కారణంగా కంపెనీలను ఆకర్షిస్తున్నాయని నివేదిక సూచిస్తుంది. మెట్రో మార్కెట్ సంతృప్తత, పెరుగుతున్న ఖర్చులను ఎదుర్కొంటున్న కంపెనీలు చిన్న నగరాల వైపు మొగ్గు చూపుతున్నాయి. ఈ నగరాల్లో మెట్రో నగరాలతో పోలిస్తే కంపెనీలు వర్క్‌ఫోర్స్‌పై తక్కువ ఖర్చు చేస్తున్నాయి.

**కంపెనీలు కూడా లాభపడతాయి**

కోయంబత్తూర్, గుర్గావ్‌లు ఉద్యోగాల కల్పనకు ప్రధాన గమ్యస్థానాలుగా ఆవిర్భవించడం కంపెనీల వ్యూహాత్మక నిర్ణయాలలో మార్పును ప్రతిబింబిస్తున్నాయని చెప్పవచ్చు. మెట్రో ప్రాంతాల్లో కార్యకలాపాల ఖర్చులు పెరుగుతున్నందున, కంపెనీలు తక్కువ ఖర్చుతో కూడిన ఎంపికల కోసం వెతుకుతున్నాయి. దీంతో టైర్-2 నగరాలు కంపెనీలకు గొప్ప ఎంపికగా మారాయి. రియల్ ఎస్టేట్ ఖర్చులు, యుటిలిటీలు, లేబర్ ఖర్చులు ఇక్కడ చాలా తక్కువగా ఉన్నాయి. నివేదిక ప్రకారం టైర్-2 నగరాల వైపు కంపెనీలు మొగ్గు చూపడానికి మరో ప్రధాన కారణం టాలెంట్ పూల్ పెరగడం. దీంతోపాటు కోయంబత్తూర్, గుర్గావ్‌లు వివిధ రంగాలలో తయారీ, సేవల వంటి రంగాలలో నైపుణ్యం కలిగిన నిపుణుల సంఖ్యను పెంచాయి.

## 6ఈ'పై ట్రేడ్‌మార్క్ గొడవ





**న్యూఢిల్లీ-నవభూమి:**ఆటోమొబైల్ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం), దేశీయ విమానయాన సంస్థ ఇండిగో మధ్య ట్రేడ్ మార్క్ వివాదం తలెత్తింది. మహీంద్రా ఇటీవల మార్కెట్లోకి విడుదల చేసిన ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ) 'బీఈ 6ఈ' ఎస్‌యూవీ పేరులోని '6ఈ' తన ట్రేడ్ మార్క్ అని పేర్కొంటూ ఇండిగో కేసు నమోదు చేసింది. మహీంద్రా మాత్రం ఈ విషయాన్ని సామరస్యంగా పరిష్కరించుకునేందుకు ఇండిగోతో చర్చలు జరుపుతున్నట్టు ప్రకటించింది. తమ కొత్త ఈవీ ఎస్‌యూవీకి పెట్టిన 'బీఈ 6ఈ'కి ఇండిగో ట్రేడ్‌మార్క్ '6ఈ'కు అసలు సంబంధమే లేదని పేర్కొంది.

# సుప్రీంకోర్టు జడ్జిగా జస్టిస్ మన్మోహన్



**న్యూఢిల్లీ–నవభూమి:** ఢిల్లీ హైకోర్టు సీజే జస్టిస్ మన్మోహన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమించడానికి కేంద్రప్రభుత్వం మంగళవారం ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని కేంద్రమంత్రి అర్జున్ మేఘ్వాల్ వెల్లడించారు. సుప్రీంకోర్టు జడ్జిగా జస్టిస్ మన్మోహన్‌ను నియమించాలంటూ కొలీజియం నవంబరు 28న కేంద్రానికి సిఫారసు చేసింది. సుప్రీంకోర్టులో మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 34 కాగా, జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ హిమాకోహ్లి పదవీ విరమణతో జడ్జిల సంఖ్య 32కు పడిపోయింది, జస్టిస్ మన్మోహన్ ప్రమాణ స్వీకారం చేస్తే 33కు పెరుగుతుంది. కాగా, జస్టిస్ మన్మోహన్ 2008 మార్చి 13న ఢిల్లీ హైకోర్టు జడ్జిగా నియమితులయ్యారు. 2023 నవంబరు 9న సీజేగా పదోన్నతి పొందారు.

## ఆ గంగాజలం స్నానానికి తప్ప తాగడానికి పనికిరాదు: పీసీబీ



**డెహ్రాడూన్–నవభూమి:** భారత్‌లోని పలు నదులలో పెరుగుతున్న కాలుష్య స్థాయిలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా హిందువులు ఎంతో పవిత్రంగా భావించే హరిద్వార్ లోని గంగాజలంపై పరిశోధకులు షాకిచ్చే వార్త చెప్పారు. ఈ జలాల్లోని నీటిపై ఉత్తరాఖండ్ లోని కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) ఓ రిపోర్టును వెల్లడించింది. ఈ నీరు బి కేటగిరీకి వస్తుందని.. అందులోని నీరు స్నానానికి సురక్షితమే కానీ, తాగేందుకు ఏమాత్రం పనికిరాదని తెలిపింది. నదీ నాణ్యతనకు పరీక్షించేందుకు నడుబిగించిన ఈ బోర్డు ఉత్తర్ ప్రదేశ్ కు సరిహద్దులోని మొత్తం ఎనిమిది ప్రాంతాల్లోని నీటిని పరిశీలించింది.
పీసీబీ తెలిపిన వివరాల ప్రకారం నీటి నాణ్యతను ఎ నుంచి ఇ వరకు ఐదు వర్గాలుగా విభజిస్తారు. ఇందులో ఎ వర్గం అతి ఎక్కు తక్కువ విషంగా మారిన నీటి ప్రమాణాన్ని సూచిస్తుంది. క్రిమిసంహారకాలు వాడిన తర్వాత తాగడానికి అనువైనదిగా భావిస్తారు. ఇ వర్గం అత్యంత విషపూరితమైనది. దీని ఆధారంగా గంగానదిలో నీటికి బి కేటగిరీని కేటాయించారు. అంటే ఇది స్నానానికి తప్ప తాగడానికి ఏమాత్రం అనువైనది కాదని తేల్చారు. ఇటీవల ఢిల్లీలోని యమునా నదిలో కాలుష్య స్థాయిలు పెరుగుతుండటంపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో డిసెంబర్ 1న యమునా నది నుంచి విషపూరితమైన నురగ మందంపాటి పొరలాగా అలుముకుంది. ఇది దేశవ్యాప్తంగా నదీ జలాల్లో పెరుగుతున్న కాలుష్యానికి అద్దం పడుతోంది. తాజాగా హరిద్వార్ లోని పరిశోధనలు భారత్ వంటి నదులలో నీటి నాణ్యతను కాపాడుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతున్నాయి. మెరుగైన కాలుష్య నియంత్రణ చర్యల అవశ్యకతపై దృష్టి సారించాల్సిన అవసరాన్ని తెలుపుతున్నాయి.

## ‘ఫెంగల్’ తుపాను చరిత్రలో కొత్తది..




**చెన్నై: –నవభూమి:** రాష్ట్ర తుఫాను చరిత్ర 50 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా రూ.500 కి.మీ దూరాన్ని మెల్లగా కదిలిన తుపానుగా ‘ఫెంగల్’ నిలిచింది. బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుపాను చెన్నై, చెంగల్పట్టు, కడలూరు, విల్లుపురంమార్గాల్లో కదిలింది. అనంతరం దిశ మార్చుకొని పశ్చిమ దిశగా పయనించి తిరువణ్ణామలై, కృష్ణగిరి, సేలం తదితర జిల్లాల మీదుగా సాగింది. ఫెంగల్ ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ప్రస్తుతం వర్షాలు తగ్గినా, జనజీవనం ఇంకా సాధారణ స్థితికి చేరుకోలేదు.
ఈ నేపథ్యంలో, ఫెంగల్ తుపానుకు సంబంధించి పలు ఆసక్తికర విషయాలు వెలుగుచూశాయి. 50 ఏళ్లగా రాష్ట్ర తుఫాన్‌ల చరిత్రలో ఇంత నిదానంగా కదులుతూ తుఫాన్ తీరం దాటలేదని వాతావరణ పరిశోధకులు పేర్కొంటున్నారు. ఈ విషయమై వాతావారణ కేంద్రం మాజీ అధికారి ఒకరు మాట్లాడుతూ... సాధారణంగా తుపానులు ఎప్పుడూ 220 కి.మీ నుంచి 300 కి.మీ వరకు 10 నుంచి 12 కి.మీ వేగంతో పయనిస్తుంటాయి. కానీ, ఫెంగల్ తుఫాన్ 3 కి.మీ వేగంతో మాత్రమే పయనించింది. అలా 500 కి.మీ వెళ్లేందుకు ఐదు రోజులు తీసుకుంది. తుపానుగా మారిన మూడు రోజుల్లో బలపడుతుంది. కానీ నవంబరు 25వ తేది బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, నాలుగు రోజుల అనంతరం అంటే 29వ తేది తుపానుగా మారింది. గత 50 ఏళ్ల రాష్ట్ర తుఫాను చరిత్రలో ఓ తుఫాను ఇలా మెల్లగా కదిలిన సందర్భాలు లేవు. సహజంగా తుఫాను తీరం దాటిన తర్వాత బలహీనపడుతుంది. కానీ, 9 గంటలు ఒకే ప్రాంతంలో ఉంటూ, సముద్రంలో తేమను బాగా గ్రహించి ఆ తర్వాత మెల్లగా తీరం దాటడం ప్రారంభించింది.
పలు జిల్లాల్లో అతి భారీవర్షాలు కురవడానికి ఇది కారణం. వాతావరణ సమాచారాన్ని సరైన రీతిలో అంచనా వేసే వ్యవస్థ మన వద్ద లేదని అర్థమవుతుందని ఆయన పేర్కొన్నారు. తొలుత, అరేబియా సముద్రం వైపు ఫెంగల్ తుఫాన్ కదులుతున్న నేపథ్యంలో, తిరుపత్తూర్ నుంచి తేని వరకు 15 జిల్లాలకు భారత వాతావరణ కేంద్రం ఆరెంజ్ అలర్ట్ ప్రకటించడం కొనమెరుపు.

## సంభల్ హింస వెనక కుట్ర!

**న్యూఢిల్లీ–నవభూమి:** యూపీలోని సంభల్‌లో చెలరేగిన హింస వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని, బీజేపీ జపిస్తున్న ‘తవ్వకాల మంత్రం’ దేశంలో మతసామరస్యాన్ని దారుణంగా దెబ్బతీస్తోందని సమాజ్‌వాదీపార్టీ అధినేత, ఎంపీ అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. యూపీలో ఇటీవలి ఉప ఎన్నికల నేపథ్యంలోనే.. సంభల్‌లో మసీదు వివాదాన్ని ముందుకు తీసుకొచ్చారన్నారు. ఈ మేరకు మంగళవారం లోక్‌సభలో అఖిలేశ్ మాట్లాడారు. ‘నవంబరు 13వ తేదీన జరగాల్సిన యూపీ ఉప ఎన్నికలను నవంబరు 20వ తేదీకి వాయిదా వేశారు. షాహీ జామామసీదులో సర్వే జరపాలంటూ దాఖలైన పిటిషన్ మీద.. మసీదు కమిటీ వాదనలు సైతం వినకుండా సర్వేకు అనుకూలంగా నవంబరు 19న స్థానిక కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కొన్ని గంటల్లోనే అధికారులు అక్కడికి చేరుకొని సర్వే జరిపారు. మసీదులోని వారందరూ సహకరించారు. 29న కోర్టులో విచారణ జరగాల్సి ఉంది. కానీ, 24న అధికారులు మరోసారి సర్వే జరుపుతామంటూ మసీదుకు వచ్చారు. కోర్టు ఉత్తర్వులు లేకుండా ఎలా జరుపుతారంటూ.. ముస్లిం సంఘాలు అభ్యంతరం తెలిపాయి. అయినప్పటికీ, అధికారులు నిరంకుశంగా సర్వే జరిపారు.

# ప్రతి ప్రయాణీకుడి టిక్కెట్‌పై 46 శాతం సబ్సిడీ.. రైల్వే మంత్రి కీలక ప్రకటన



**న్యూఢిల్లీ–నవభూమి:** దేశంలోని ప్రతి రైల్వే ప్రయాణీకుడికి ప్రయాణ టిక్కెట్‌పై 46 శాతం సబ్సిడీ ఇస్తున్నట్లు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం తెలిపారు. లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో అనుబంధ ప్రశ్నలకు సమాధానమిస్తూ, రైల్వే మంత్రిత్వ శాఖ ప్రయాణీకుల కోసం సబ్సిడీపై ప్రతి సంవత్సరం 56,993 కోట్ల రూపాయలను ఖర్చు చేస్తుందని వెల్లడించారు. వృద్ధులు, గుర్తింపు పొందిన జర్నలిస్టులకు గతంలో ఇచ్చిన సబ్సిడీని పునరుద్ధరించే అవకాశం గురించి అడిగినప్పుడు వైష్ణవ్ ఈ మేరకు స్పందించారు. ప్రయాణికులకు సబ్సిడీపై రైల్వే మంత్రిత్వ శాఖ ప్రతి ఏటా రూ.56,993 కోట్లు వెచ్చిస్తోందని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ప్రతి 100 రూపాయలకు ఈ క్రమంలో ప్రతి రూ.100 ప్రయాణ సేవకు రూ. 54 మాత్రమే వసూలు చేస్తున్నట్లు చెప్పారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలోని ప్రభుత్వం దేశంలోని చిన్న, మధ్యతరహా రైల్వే స్టేషన్‌లను అభివృద్ధి చేస్తున్నట్లు వైష్ణవ్ వెల్లడించారు. మహారాష్ట్రలోని షోలాపూర్‌కు చెందిన కాంగ్రెస్ ఎంపీ ప్రణితి షిండే లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆటగాళ్ల రైలు ప్రయాణంలో సబ్సిడీపై ఒక ప్రశ్న అడిగారు. క్రీడాకారులు క్రీడల్లో పాల్గొనేందుకు దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుందని ప్రణితి షిండే తన ప్రశ్నలో పేర్కొన్నారు. ప్రణితి షిండ్ అడిగిన ప్రశ్నకు రైల్వే మంత్రి సమాధానమిచ్చారు.

**చిన్న, మధ్య తరహా రైల్వే స్టేషన్ల అభివృద్ధి**

ప్రభుత్వం రూ. 56,993 కోట్ల సబ్సిడీని ఇచ్చే రైల్వే ప్రయాణీకులలో క్రీడాకారులు కూడా ఉన్నారని వెల్లడించారు.

మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలోని ప్రభుత్వంలో దేశం మొత్తం రోడ్ల ద్వారా అనుసంధానించబడినట్లుగా తెలిపారు. దేశంలోని చిన్న, మధ్యతరహా రైల్వే స్టేషన్‌లను కూడా అభివృద్ధి చేశామని అశ్విని వైష్ణవ్ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఇది తెలిసిన నెటిజన్లు తాము రైళ్లలో ప్రయాణం కోసం చెల్లిస్తున్న మొత్తం సబ్సిడీ ద్వారా వస్తుందా అని పలు రకాలుగా కామెంట్లు చేస్తున్నారు. మరికొంత మంది మాత్రం ప్రత్యేక తరగతులకు చెందిన వారికి మాత్రమే సబ్సిడీ ఇస్తున్నారని అంటున్నారు.

## ఈ రైల్వే ప్రయాణికులకు ఆహారం ఉచితం.. కారణమిదే..



**న్యూఢిల్లీ–నవభూమి:** భారతీయ రైల్వేలను దేశానికి జీవనాడి అని పిలవడం తప్పు కాదు. ఇది ప్రపంచంలోనే నాల్గో అతిపెద్ద రైలు నెట్‌వర్కును కల్గి ఉంది. దీని ద్వారా ప్రతిరోజూ కోట్లాది మంది ప్రయాణికులు ప్రయాణించి తమ గమ్యాన్ని చేరుకుంటున్నారు. రైలు ప్రత్యేకత ఏమిటంటే, ప్రతి తరగతి వ్యక్తులు దీని ద్వారా ప్రయాణించవచ్చు. అదే సమయంలో ఇది సుదూర ప్రయాణానికి చాలా సౌకర్యంగా ఉంటుంది. మీరు మీ బడ్జెట్ ప్రకారం స్లీపర్, థర్డ్ ఏసీ, సెకండ్ ఏసీ లేదా ఫస్ట్ ఏసీ టిక్కెట్‌లను బుక్ చేసుకోవచ్చు. కానీ చలి కాలంలో రైళ్లు చాలా గంటలు ఆలస్యంగా రావడంతో పలువురు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దట్టమైన పొగమంచు కారణంగా, దృశ్యమానత గణనీయంగా తగ్గుతుంది. అనేక ఇతర కారణాల వల్ల, రైళ్లు కొన్నిసార్లు ఆలస్యం అవుతాయి. చలి వాతావరణం వచ్చి రైళ్ల రాకపోకలపైనా ప్రభావం కనిపిస్తోంది. రైలు ఆలస్యంగా వస్తే భారతీయ రైల్వే ప్రయాణికులకు అనేక సౌకర్యాలను అందిస్తుంది. ఇందులో ప్రయాణీకులకు ఉచితంగా ఆహారం అందించే సౌకర్యం కూడా ఉంది. మీ రైలు ఆలస్యం అయితే మీరు వెయిటింగ్ రూమ్‌ను ఉచితంగా యాక్సెస్ చేసుకోవచ్చు.

**స్టాల్స్ ఎక్కువ సమయం**

మీరు రాజధాని లేదా శతాబ్ది వంటి ప్రీమియం రైలులో ఎక్కడికైనా ప్రయాణం చేయబోతున్నట్లయితే ఈ రైళ్లు 3 గంటల కంటే ఎక్కువ ఆలస్యం అయితే, రైల్వే ప్రయాణికులకు ఉచిత ఆహారాన్ని అందిస్తున్నారు. కొన్ని కారణాల వల్ల రైలు చాలా ఆలస్యమైతే, ప్రయాణీకుల సౌకర్యార్థం, రైల్వే స్టేషన్‌లో ఉన్న ఫుడ్ స్టాల్స్ సాధారణం కంటే ఎక్కువ సమయం పాటు తెరవబడతాయి. రాత్రిపూట నడిచే రైళ్లు ఆలస్యంగా వచ్చినప్పుడు ఇది తరచుగా జరుగుతుంది. ఇది మాత్రమే కాదు, ప్రయాణీకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని, రైల్వే అదనపు సిబ్బందిని కూడా మోహరిస్తుంది.


**రద్దు చేసుకుంటే పూర్తి వాపసు**

కొన్ని సందర్భాల్లో మీరు టిక్కెట్ రద్దుపై పూర్తి వాపసు పొందుతారు. ఉదాహరణకు మీరు ప్రయాణించబోయే రైలు 3 గంటల కంటే ఎక్కువ ఆలస్యంగా నడుస్తోంది. అటువంటి పరిస్థితిలో మీరు ఆలస్యం కారణంగా మీ ప్లాన్‌ని మార్చుకుని, రైలు టిక్కెట్‌ను రద్దు చేయాలనుకుంటే, మొత్తం టిక్కెట్ మొత్తం మీకు తిరిగి చెల్లించబడుతుంది. కొన్ని కారణాల వల్ల రైల్వేలు రైలును దాని మార్గం నుంచి మళ్లించినట్లయితే, మీరు ఇప్పటికీ మీ టిక్కెట్‌ను రద్దు చేసుకుని పూర్తి వాపసు పొందవచ్చు.

**కౌంటర్ లోనే**

మీరు రైల్వే టికెట్ కౌంటర్ నుంచి మీ టిక్కెట్‌ను బుక్ చేసుకున్నట్లయితే మీరు రైల్వే కౌంటర్‌కు వెళ్లి మాత్రమే మీ టిక్కెట్‌ను రద్దు చేసుకోవాల్సి ఉంటుంది. టికెట్ రద్దు అయినట్లయితే, మొత్తం టికెట్ మొత్తాన్ని కౌంటర్ లోనే నగదు రూపంలో మీకు అందించబడుతుంది. మీరు మీ టిక్కెట్‌ను ఏ మార్గంలో బుక్ చేసుకున్నారో, ఆ విధంగా మీరు రద్దు చేసిన తర్వాత మీకు వాపసు లభిస్తుంది.

## సంభాల్ పర్యటనను అడ్డుకోవడం రాజ్యాంగ హక్కుల ఉల్లంఘనే



**సంభాల్–నవభూమి:** సంభాల్ హింసాకాండ బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న తన కాన్వాయ్‌ను ఘజియాపూర్ సరిహద్దుల్లోనే ఉత్తరప్రదేశ్ పోలీసులు అడ్డుకోవడాన్ని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ నిలదీశారు. బాధిత ప్రజలను కలుసుకోకుండా అడ్డుకోవడం రాజ్యాంగం తనకు కల్పించిన హక్కును తోసిపుచ్చడమేనని అన్నారు. తన కాన్వాయ్‌ను వదిలిపెట్టి ఒంటరిగా పోలీసులతో కలిసి వెళ్లేందుకు కూడా సిద్ధపడ్డానని, అయితే తన మాటను లెక్కచేయకుండా కొద్దిరోజుల తర్వాత రావాలని అధికారులు చెప్పినట్టు తెలిపారు. “మేము సంభాల్ వెళ్లేందుకు ప్రయత్నించాం. పోలీసులు నిరాకరిస్తూ మమ్మల్ని ముందుకు వెళ్లనీయలేదు. లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా బాధితులను కలుసుకునేందుకు వెళ్లే హక్కు నాకు ఉంది. కానీ వాళ్లు నన్ను ఆపేశారు. నేను ఒంటరిగా పోలీసులతో వెళ్లేందుకు సిద్ధపడ్డా. అందుకు కూడా అధికారులు ఒప్పుకోలేదు. కొద్ది రోజుల తర్వాత వస్తే అప్పుడు అనుమతిస్తామని చెప్పారు. ఇది ఎల్‌ఓపీ, రాజ్యాంగ హక్కులకు వ్యతిరేకం. మేము కేవలం సంభాల్ వెళ్లి అక్కడ ఏమి జరిగిందో చూడాలనుకుంటున్నాం. ప్రజలను కలుస్తాం. నాకున్న రాజ్యాంగ హక్కును కూడా తోసిపుచ్చుతున్నారు. ఇదీ మన నవీన భారతం, రాజ్యాంగానికి చరమగీతం పాడే ఇండియా, అబేంద్కర్ రాజ్యాంగానికి చెల్లుచీటీ చెప్పే ఇండియా. మా పోరాటం కొనసాగు తుంది” అని ఘజియాబాద్ సరిహద్దుల్లో రాహుల్ మాట్లాడుతూ అన్నారు.

**రాహుల్‌కు ఆ హక్కుంది: ప్రియాంక**

కాగా, హింసాకాండ బాధితులను పరామర్శించే హక్కు లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్‌కు ఉందని ఆయన సోదరి, వయనాడ్ పార్లమెంటు సభ్యురాలు ప్రియాంక గాంధీ అన్నారు. “సంభాల్‌లో రాహుల్‌ను అడ్డుకోవడం సరికాదు. బాధితులను కలుసుకునే రాజ్యాంగ హక్కు ఆయనకు ఉంది. యూపీ పోలీసులతో ఒంటరిగా వెళ్తానని కూడా ఆయన చెప్పారు. అందుకు కూడా వాళ్లు ఒప్పుకోలేదు. పోలీసుల దగ్గర సమాధానం లేదు. ఈమాత్రం విషయాన్ని కూడా చక్కదిద్దలేని పరిస్థితి ఉత్తరప్రదేశ్‌లో ఉండొచ్చు. శాంతి భద్రతల విషయంలో పట్టువిడువలు లేని ధోరణలో వారెందుకు మాట్లాడుతున్నారు?” అని ప్రియాంక ప్రశ్నించారు.

# బ్యాంక్ ఖాతాల్లో ‘పొంగల్’ నగదు..



**చెన్నై–నవభూమి:** పొంగల్ నగదు బహుమతి బ్యాంక్ ఖాతాల్లో జమచేయవచ్చని హైకోర్టు మదురై బెంచ్ సూచించింది. తంజావూరు జిల్లా కుంభకోణంకు చెందిన విమనాథన్ హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో దాఖలుచేసిన పిటిషన్‌లో... రాష్ట్రంలో రేషన్ కార్డుదారులకు అందించే పొంగల్ సరుకుల గిఫ్ట్ ప్యాక్‌లో చక్కెరకు బదులుగా కిలో బెల్లం ఇవ్వాలని, పొంగల్ బహుమతిగా ఇస్తున్న రూ.1,000 నగదు కార్డుదారుల బ్యాంక్ ఖాతాల్లో జమచేసేలా ఉత్తర్వులు జారీచేయాలని హైకోర్టు మదురై బెంచ్‌లో గత ఏడాది పిటిషన్ వేశారు.
ఈ కేసు విచారించిన హైకోర్టు, బ్యాంక్ ఖాతాలో నగదు జమ అంశాన్ని వచ్చే ఏడాది పరిశీలించాలని ఉత్తర్వులు జారీచేసింది. వచ్చే ఏడాది పొంగల్‌కు ఇంకా ఒకటిన్నర నెల వ్యవధి మాత్రమే ఉంది. ఇప్పటి వరకు పొంగల్ నగదు బహుమతి బ్యాంక్ ఖాతాల్లో జమచేసే విషయమై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అందువల్ల, 2025 పొంగల్ గిఫ్ట్ ప్యాక్‌లో చక్కెరకు బదులుగా బెల్లం ఇవ్వడం, నగదు బహుమతి బ్యాంక్ ఖాతాల్లో జమచేయాలి, గిఫ్ట్ ప్యాక్‌లో అందించే చెరకు, టెంకాయ తదితరాలు రాష్ట్ర రైతుల నుంచే కొనుగోలు చేసేలా ఉత్తర్వులు జారీచేయాలని తాజాగా పిటిషన్ దాఖలైంది.
ఈ పిటిషన్‌ను మంగళవారం న్యాయమూర్తులు ఎంఎస్ సురేష్, ఏటీ మరియక్లాట్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. పొంగల్ నగదు బహుమతి బ్యాంక్ ఖాతాల్లో జమచేయవచ్చు కదా? అంటూ ధర్మాసనం ప్రశ్నించింది. రూ.1,000 నగదు బ్యాంక్ ఖాతాల్లో జమచేసే సమయంలో, ఖాతాలో కనీస బ్యాలెన్స్ లేదంటూ, జమచేసే నగదు తీసుకుంటున్నారని అందుకు ప్రభుత్వం తరఫు న్యాయవాది తెలిపారు.
అంతలో పిటిషనర్ తరఫు న్యాయవాది మహిళ ప్రోత్సాహన నిధులు బ్యాంక్ ద్వారా అందిస్తున్న నేపథ్యంలో, పొంగల్ నగదు కూడా బ్యాంక్ ఖాతాల్లో చెల్లించాలంటూ తెలిపారు. ఇరుతరఫు వాదనల అనంతరం ధర్మాసనం, హైకోర్టు ఇదివరకే సూచించిన విధంగా పొంగల్ నగదు బహుమతి రేషన్ కార్డుదారుల బ్యాంక్ ఖాతాల్లో జమచేయడంపై వినియోగదారుల వాణిజ్య సమాఖ్య అదనపు కార్యదర్శి అఫిడవిట్ దాఖలుచేయాలని ఉత్తర్వులు జారీచేసి, తదుపరి విచారణ ఈ నెల 19వ తేదీకి వాయిదావేశారు.



## ఘాజీపూర్ సరిహద్దుకు చేరుకున్న రాహుల్, ప్రియాంక గాంధీ



**న్యూఢిల్లీ–నవభూమి:** కాంగ్రెస్ ఎంపీలు రాహుల్ గాంధీ , ప్రియాంక గాంధీ ఈరోజు ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌కు బయలు దేరారు. ఈ క్రమంలో ఘాజీపూర్ ఫ్లైఓవర్ వద్ద వారి కాన్వాయ్‌ను ఆపివేశారు. రాహుల్, ప్రియాంకలను అడ్డుకునేందుకు అధికార యంత్రాంగం పెద్ద ఎత్తున సన్నాహాలు చేసింది. సంభాల్ జిల్లా అధికారి రాహుల్ గాంధీని సరిహద్దులో ఆపాలని అభ్యర్థిస్తూ పొరుగు జిల్లాల జిల్లా మేజిస్ట్రేట్‌లకు లేఖ రాశారు. ఇదే సమయంలో ఢిల్లీకి ఆనుకుని ఉన్న ఘాజీపూర్ సరిహద్దులో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. సంభాల్ హింసకాండలో మృతి చెందిన కుటుంబాలను రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ పరామర్శించనున్నారు.

**భారీగా పోలీసు బలగాలు**

పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్ కారణంగా ఘాజీపూర్ సరిహద్దులో ట్రాఫిక్ జామ్ అయింది. అదే సమయంలో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. సంభాల్, బులంద్‌షహర్, అమ్రోహా, ఘజియాబాద్, గౌతమ్ బుద్ధ నగర్ చుట్టుపక్కల నాలుగు జిల్లాలను అధికారులు అప్రమత్తం చేసింది. రాహుల్ గాంధీ, ఆయన వెంట వచ్చే నేతలను ఆయా జిల్లాల సరిహద్దుల్లో ఆపాలని అక్కడి అధికారులను కోరారు. సంభాల్ ఎస్పీ కేకే బిష్ణోయ్ కూడా రాహుల్ గాంధీ సంభాల్ పర్యటనను వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు.
కాగా కాంగ్రెస్ నేతలు, ఎంపీలు ఉదయమే పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. ఆ తర్వాత రాహుల్, ప్రియాంక కూడా ఇక్కడి నుంచి సంభాల్‌కు బయలుదేరారు. వారు 12.30 నుంచి 1.30 మధ్య ఘాజీపూర్ మీదుగా సంభాల్ చేరుకుంటారు. ఐదుగురు లేదా అంతకంటే తక్కువ మందితో వెళ్లడానికి అనుమతించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. సంభాల్‌కు డిసెంబర్ 10 వరకు బయటి వ్యక్తుల ప్రవేశాన్ని నిషేధించారు. ఈ పర్యటనలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇన్‌ఛార్జ్ అవినాష్ పాండే సహా పలువురు ఉన్నారు.

## ప్రజలకు కోపం వస్తే ఇలాగే ఉంటది మరి.. మంత్రిపై బురద చల్లిన ‘వరద’ బాధితులు..



**హైదరాబాద్: –నవభూమి:** విల్లుపురం జిల్లా ఇరువేల్‌పట్టు ప్రాంతంలో తగిన సాయం అందలేదన్న కోపంతో బాధితులు రాష్ట్ర మంత్రిపైనే బురదచల్లడం ఉద్రిక్తతకు దారి తీసింది. వివరాలిలా వున్నాయి... ఫెంగల్ తుఫాను ప్రభావంతో విల్లుపురం జిల్లా అతలాకుతలమైన విషయం తెలిసిందే. దిండివనంసమీపం మయిల్ ప్రాంతంలో అత్యధికంగా 51 సెం.మీ వర్షపాతం నమోదుకావడం, సమీపంలోని చెరువు గట్లు తెగడంతో దిండివనం కూడా జలమయమైంది.
వరద బాధిత ప్రాంతాల్లో సైనికులు సహాయక చర్యలు చేపట్టి, బాధితులను విల్లుపురం పునరావాస శిబిరాలకు తరలించారు. ఈ నేపథ్యంలో, మంగళవారం వరద బాధిత ప్రాంతాలు పరిశీలించి బాధితులకు సహాయాలందించేందుకు మంత్రి పొన్ముడి( జిల్లా కలెక్టర్, అటవీ శాఖ అధికారులు విల్లుపురం చేరుకున్నారు. ఇరువేల్‌పట్టు ప్రాంతంలో ప్రజలు ఆందోళన చేపడుతున్నారని తెలుసుకున్న మంత్రి వారితో మాట్లాడేందుకు వెళ్లారు.
అయితే మంత్రి పర్యటనను ఆందోళనకారులు అడ్డుకున్నారు. ప్రభుత్వం నుంచి తమకెలాంటి సాయం అందలేదని, శిబిరంలో ఆహారం కూడా అందించడం లేదని నినాదాలు చేపట్టారు. అయితే ఇదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు మంత్రిపై బురద చల్లారు. అక్కడున్న పోలీసులు మంత్రి చుట్టూ నిలిచారు. నిరసనకారుల ఆగ్రహాన్ని గ్రహించిన మంత్రి పొన్ముడి.. అక్కడి నుంచి మౌనంగా వెళ్లిపోయారు.

## ఐఎండీ అలర్ట్.. వచ్చే 24 గంటల్లో ఈ రాష్ట్రాల్లో భారీ వర్షాలు



**న్యూఢిల్లీ–నవభూమి:** దేశవ్యాప్తంగా వాతావరణం క్రమంగా మారుతోంది. దీంతో ఉత్తర భారతంలోని పలు రాష్ట్రాల్లో దట్టమైన పొగమంచు కారణంగా చలి పెరుగుతోంది. మరోవైపు ఫెంగల్ తుఫాను కారణంగా కురుస్తున్న వర్షాలతో దక్షిణ భారతదేశంలోని పలు రాష్ట్రాల్లో మళ్లీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెదర్ రిపోర్ట్ తెలిపింది. ఫెంగల్ తుపాను ఇప్పటికే మహారాష్ట్రను తాకింది. దీంతో వాతావరణ శాఖ మహారాష్ట్రలోని 6 జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించింది. కొండ ప్రాంతాల్లో కురుస్తున్న మంచు కారణంగా చలి కూడా పెరుగుతోంది. డిసెంబర్ నెలలో ఉన్నప్పటికీ, ఎముకలు కొరికే చలి మాత్రం తగ్గడం లేదు.

## రామ్ ప్లాన్ మామూలుగా లేదు.. రాపో 22 టీంలోకి నేషనల్ అవార్డ్ విన్నింగ్ టెక్నీషియన్



మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి ఫేం పీ మహేశ్ బాబు డైరెక్ట్ చేస్తున్న కొత్త ప్రాజెక్ట్ రాపో 22 టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని నటిస్తుండగా.. తెరకెక్కుతున్న మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్య శ్రీ బోర్సే ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. ఇటీవలే పూజా కార్యక్రమాలతో గ్రాండ్‌గా లాంచ్ అయింది. కాగా రామ్ ఈ సినిమా కోసం కొత్త కొత్త టెక్నీషియన్స్‌ను తెలుగు ఇండస్ట్రీకి పరిచయం చేస్తున్నాడని తెలిసిందే. ఇప్పటికే న్యూ సౌండ్ ఆఫ్ తెలుగు సినిమాకు స్వాగతం అంటూ కోలీవుడ్ మ్యూజిక్ డైరెక్టర్ల ద్వయం వివేక్-మెర్విన్ టాలీవుడ్‌కు పరిచయం చేశాడు. మరోవైపు మేరీక్రిస్మస్, మలైకొట్టై వాలిబన్‌తోపాటు హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో ఎన్నో సక్సెస్ ఫుల్ చిత్రాలకు పనిచేసిన సినిమాటోగ్రఫర్ మధు నీలకందన్ ఈ మూవీకి పనిచేయబోతున్నట్టు తెలియజేశాడు. తాజాగా నేషనల్ అవార్డు విన్నింగ్ టెక్నీషియన్ (ఎడిటర్) అక్కినేని శ్రీకర్ ప్రసాద్‌ను టీంలోకి తీసుకున్నట్టు ప్రకటించారు. ఈయన ఏడు సార్లు నేషనల్ అవార్డు అందుకోవడం విశేషం. ఈ చిత్రాన్ని టాలీవుడ్ లీడింగ్ ప్రొడక్షన్ హౌజ్ మైత్రీ మూవీ మేకర్స్ తెరకెక్కిస్తోంది.

నవచిత్ర






## చైతూ- శోభిత పెళ్లి.. సామ్‌పైనే అందరి ఫోకస్!

ప్రస్తుతం చాలా బాధలో ఉన్న విషయం తెలిసిందే. ఆమె తండ్రి జోసెఫ్ ప్రభు ఇటీవల మరణించారు. తండ్రి మరణంతో సామ్.. తీవ్ర విచారంలో మునిగిపోయారు. జోసెఫ్ మరణించిన తర్వాత హృదయం ముక్కలైన ఎమోజీ షేర్ చేశారు. నాన్నా.. మళ్లీ మనం కలిసేంత వరకు.. అంటూ తన ఆవేదనను పంచుకున్నారు. అయితే ఇన్ స్టాగ్రామ్ లో చాలా యాక్టివ్ ఉండే సమంత.. కొద్ది రోజులుగా మాత్రం సైలెంట్ గా ఉన్నారు. పెద్దగా ఏం పోస్ట్ చేయడం లేదు. నాలుగు రోజుల నుంచి ఇన్ స్టా మెయిన్ ఫీడ్ ను షేర్ చేయలేదు. కానీ ఇన్ స్టా స్టోరీస్ ను మాత్రం క్రమం తప్పకుండా అప్డేట్ చేస్తూనే ఉన్నారు. ఫిట్ నెస్, హెల్త్ కు సంబంధించిన వివిధ విషయాలు ఇన్ స్టా స్టోరీస్ లో షేర్ చేస్తున్నారు సమంత. అదే సమయంలో నేడు (డిసెంబర్ 4వ తేదీన) తన మాజీ భర్త, హీరో నాగచైతన్య రెండో వివాహం చేసుకుంటున్న విషయం తెలిసిందే.

సూపర్ స్టార్ సినిమాలో నటించకుండా ఉండాల్సింది : ఖుష్బు హీరోయిన్ శోభిత ధూళిపాళ్లతో మరికొద్ది గంటల్లో ఏడడుగులు నడవనున్నారు. హైదరాబాద్ లోని అన్నపూర్ణ స్టూడియోస్ లో కొద్ది మంది సన్నిహితుల మధ్య చైతూ, శోభిత వివాహం జరగనుంది. స్టూడియోలోని ఏఎన్నార్ విగ్రహం ఎదుట ఏర్పాటు చేసిన వేదికపై శోభిత మెడలో చైతూ మూడు ముళ్లు వేయనున్నారు. కొంతకాలంగా ప్రేమలో ఉన్న వారిద్దరూ.. వేద మంత్రాల మధ్య ఒక్కటి కానున్నారు. అయితే ఇప్పుడు చైతూ, శోభిత వివాహంపై సమంత ఏమైనా పోస్ట్ చేస్తారోమోనని చాలా మంది ఆసక్తిగా ఉన్నారు. విషెస్ చెబుతారోమోనని కొందరు నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. మరికొందరు సామ్ స్పందించరని అంటున్నారు. ఇప్పటివరకు ఎప్పుడూ ఆమె చైతూ రెండో పెళ్లిపై రెస్పాండ్ అవ్వలేదని గుర్తు చేస్తున్నారు. కాబట్టి ఇప్పుడు కూడా సమంత ఎలాంటి పోస్ట్ పెట్టరని అంటున్నారు. అయితే సమంత విడాకుల తర్వాత తన పర్సనల్ తోపాటు కెరీర్ గ్రోత్ పై స్పెషల్ ఫోకస్ పెట్టారు.

## బొద్దుగా ఉన్నావు కానీ.. తమన్నాపై కామెంట్

జైలర్‌లో కావాలా... ఎంతటి ట్రెండ్‌సెట్టరో తెలిసిందే. ఈ పాట డిజిటల్ గా సెన్సేషన్ అయింది. సోషల్ మీడియా, యూట్యూబ్‌లో అద్భుతమైన వీక్షణలు దక్కించుకున్న ఈ ప్రత్యేక గీతం కేవలం మిల్కీ వైట్ బ్యూటీ తమన్నా అందం నృత్యం కారణంగానే ఇంతటి ప్రజాదరణ పొందింది. అంతేకాదు.. తమన్నా భారీ అందాల విందుకు యువతరం దాసోహం! అంటూ మీడియా సైతం కీర్తించింది. బ్లాక్ బస్టర్ స్త్రీ 2లో ఆజ్ కీ రాత్..తోను మళ్లీ అంతటి వేవ్ సృష్టించింది తమన్నా. వరుస సంవత్సరాల్లో తమన్నా కీర్తిని పెంచిన గీతాలివి. ప్రత్యేక పాటలే అయినా తన ఇమేజ్ మరింత పెరగడానికి ఇవి సహకరించాయి. అయితే 34 వయసు తమన్నా.. తన అధిక బరువును పాటల్లో ప్రదర్శించడంపైనా నెటిజనుల్లో వాదనలు సాగాయి. ముఖ్యంగా జైలర్ కావాలా.. పాటలో తమన్నా భాటియా బొద్దుగా ముద్దుగా కనిపించిందని అభిమానులు భావించారు. ఇదే విషయాన్ని ప్రస్థావించిన ఓ ఏజ్డ్ మహిళ పార్టీలో తనపై చే చేసిన వ్యాఖ్య మేల్కొలిపిందని తెలిపారు. ఈ విషయాలన్నీ తాజా ఇంటర్వ్యూలో రివీల్ చేసింది మిల్కీ. తాను బొద్దుగా ఉన్నానని అంగీకరించడమే కాదు.. తదుపరి ఆజ్ కీ రాత్‌లో ఇంకా అందంగా కనిపించేందుకు తనను తాను మెరుగు పరుచుకున్నానని తెలిపింది. ఏది ఏమైనా కానీ ఎవరైనా ఏదైనా విమర్శిస్తే దానిని అనుసరించి, తమను తాము మెరుగుపరుచుకునే నటీమణులకు ఎప్పుడూ మంచి అవకాశాలొస్తాయని రంగుల ప్రపంచంలో నిరూపణ అయింది. కేవలం తమన్నా మాత్రమే కాదు సోనాక్షి సిన్హా, నర్గీస్ ఫక్రీ, హ్యూమా ఖురేషి లాంటి భామలు బొద్దుగా ఉన్నా కానీ, సౌకర్యవంతమైన దుస్తుల్లో ఫ్యాషనిస్టాలుగా నిరూపించుకున్నారు. తమన్నా బొద్దందం కూడా ఇప్పుడు యువతరంలో స్ఫూర్తి నింపుతోంది. తదుపరి సికందర్ కా ముఖద్దర్‌లో తమన్నా కనిపించనుంది.




## పవన్ క్రేజ్.. 'సీజ్ ద షిప్' టైటిల్‌ను రిజిస్ట్రేషన్ చేసుకున్న అగ్ర నిర్మాణ సంస్థ





డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మొన్న కాకినాడ పోర్టులో హల్‌చల్ చేసిన విషయం తెలిసిందే. పనామ దేశానికి చెందిన ఒక షిప్‌లో అక్రమంగా విదేశాలకు తరలి వెళు తున్న రేషన్ బియ్యంను పట్టుకుని సీజ్ చేసినట్లు వార్తలు వచ్చాయి. అయితే షిప్‌లో బియ్యాన్ని పట్టుకున్న అనంతరం పవన్‌కల్యాణ్ సీజ్ ద షిప్ అంటూ పలికిన విషయం తెలిసిందే. సినిమా లెవల్ ఎలివేషన్‌తో ఈ మాట అనడంతో సోషల్ మీడియా అంతటా ఆరోజు సీజ్ ద షిప్ అనే డైలాగ్ బాగా వైరల్ అయ్యింది. పవన్ ఫ్యాన్స్ కూడా ఈ మాటను బాగా ట్రెండ్ చేశారు.
ఇదిలావుంటే తాజాగా సీజ్ ద షిప్ అనే టైటిల్‌ని తాజాగా రిజిస్ట్రేషన్ చేసుకుంది టాలీవుడ్‌కి చెందిన నిర్మాణ సంస్థ. తెలుగు ఇండస్ట్రీకి చెందిన ఆర్ ఫిలిం ఫ్యాక్టరీ.. సీజ్ ద షిప్ అనే టైటిల్‌ను రూ.1000లకు నమోదు చేసుకుంది. ఏడాది పాటు టైటిల్ హక్కులు వర్తించనున్నాయి.

## పుష్ప 2 : నార్త్‌లో షేరింగ్ లొల్లి



సౌత్‌లో సింగిల్ స్క్రీన్‌లు తక్కువ అయ్యి మల్టీప్లెక్స్‌లు ఎక్కువ అయ్యాయి. కానీ నార్త్‌లో మాత్రం ఇప్పటికీ సింగిల్ స్క్రీన్ థియేటర్లదే హవా అనే విషయం తెల్సిందే. అందుకే పుష్ప పార్ట్ 1 సినిమా అక్కడ భారీ వసూళ్లు సాధించింది. మల్టీప్లెక్స్‌ల్లో టికెట్ల రేట్లకు భయపడి చాలా మంది సినిమాలు చూడటమే మానేసిన ఈ రోజుల్లోనూ నార్త్ ఇండియాలో పెద్ద ఎత్తున సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఉండటం మంచి పరిణామం అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. పుష్ప 2 సినిమాను అత్యధిక సింగిల్ స్క్రీన్ థియేటర్‌లలో విడుదల చేయబోతున్నారు. సాధారణంగా సింగిల్ స్క్రీన్ సినిమా థియేటర్‌లో ఒక సినిమాను స్క్రీనింగ్ చేస్తూ డిస్ట్రిబ్యూటర్‌కి, ఎగ్జిబ్యూటర్‌కి 50-50 షేర్ దక్కుతుంది. కానీ ఈసారి పుష్ప 2 కి అలా కాదని డిస్ట్రిబ్యూటర్స్, ఎగ్జిబ్యూటర్స్ మధ్య గొడవ మొదలైంది. 60-40 చొప్పున లాభాల్లో వాటాను తీసుకోవాలని డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబ్యూటర్స్ మధ్య చర్చ జరుగుతోంది. ఈ చర్చ వల్ల ఇప్పటి వరకు చాలా ఏరియాల్లో ఇంకా అడ్వాన్స్ బుకింగ్ మొదలు కాలేదు. డిసెంబర్ 4వ తారీకు వరకు ఈ పంచాయితీ తెగక పోవడంతో అడ్వాన్స్ బుకింగ్ మొదలు పెట్టలేదని తెలుస్తోంది. నేడు సాయంత్రం వరకు వివాదం ఒక కొలిక్కి వచ్చి అడ్వాన్స్ బుకింగ్ మొదలు అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. పుష్ప 2 సినిమా సింగిల్ స్క్రీన్ నుంచి రాబట్టే వసూళ్లు మెజార్టీగా ఉండే అవకాశాలు ఉన్నాయి. కనుక సింగిల్ స్క్రీన్ థియేటర్‌లో సినిమాను డిస్ట్రిబ్యూట్ చేసే వారు, ఎగ్జిబ్యూట్ చేసే వారు భారీ లాభాల కోసం ప్రయత్నాలు చేస్తూ ఉన్నారు అంటూ నార్త్ ఇండియా సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. భారీ ఎత్తున వసూళ్లు సాధించబోతున్న పుష్ప 2 సినిమాతో సాధ్యం అయినంత ఎక్కువ లాభాలను దక్కించుకోవాలి అనే ఉద్దేశ్యంతో ఈ షేరింగ్ లొల్లి మొదలు పెట్టి ఉంటారు అనేది టాక్. %ూశ్రీంశీ =ఝు% - పుష్పరాజ్ కు తోడుగా వాళ్ళెవరూ రాలేదేంటి? అల్లు అర్జున్, సుకుమార్ కాంబోలో వచ్చిన పుష్ప సినిమా నార్త్ బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్లకు పైగా వసూళ్లు చేసింది. పుష్ప 2 సినిమాకు ఉన్న క్రేజ్, సినిమా స్థాయి నేపథ్యంలో అక్కడ రూ.500 కోట్లకు మించి వసూళ్లు సాధించే అవకాశాలు ఉన్నాయి అంటూ బాక్సాఫీస్ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రికార్డ్ బ్రేకింగ్ వసూళ్లు సొంతం చేసుకున్న బాహుబలి 2 , దంగల్ రికార్డ్‌లను బ్రేక్ చేసే విధంగా పుష్ప 2 దూకుడు ఉంది. మరి ఆ ఆల్ టైమ్ రికార్డ్‌లను పుష్ప 2 టచ్ చేస్తుందా లేదా అనేది చూడాలి.

## పుష్ప యాక్టర్ ఫహాద్ ఫాసిల్ బాలీవుడ్ ఎంట్రీ.. లవ్ స్టోరీ అట..!



టాలీవుడ్‌లో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదిం చుకో వడంతో పాన్ ఇండియా స్టాం డమ్ సంపాదించిన అతికొద్ది మంది మాలీవుడ్ యాక్టర్లలో టాప్‌లో ఉంటాడు ఫహాద్ ఫాసిల్ ఇటీవలే రజినీకాంత్ వెట్టైయాన్ సినిమాతో ప్రేక్షకులను పలుకరించాడు. ఫహాద్ ఫాసిల్ నటిస్తోన్న పాన్ ఇండియా ప్రాజెక్ట్ పుష్ప ది రూల్ డిసెంబర్ 5న గ్రాండ్‌గా విడుదల కానుంది.
కాగా ఈ స్టార్ యాక్టర్ బాలీవుడ్ ఎంట్రీ ఇవ్వబోతున్నాడన్న వార్త ఇప్పుడు ఇండస్ట్రీ సర్కిల్‌లో హాట్ టాపిక్‌గా మారుతుంది. ఇంతియాజ్ అలీ దర్శకత్వంలో సినిమా చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసినట్టు బాలీవుడ్ వర్గాల సమాచారం. లవ్‌స్టోరీగా రాబోతున్న ఈ చిత్రంలో యానిమల్ ఫేం తృప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తుందని ఇన్‌సైడ్ టాక్. దీనిపై మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావడమే ఆలస్యమని సమాచారం. తృప్తి డిమ్రి ఇప్పటికే ఇంతియాజ్ అలీ లైలా మజ్ను సినిమాలో నటించింది. మరి ఈ క్రేజీ కాంబినేషన్ సిల్వర్ స్క్రీన్‌పై ఎలాంటి మ్యాజిక్ క్రియేట్ చేయబోతుందని తెలుసుకోవాలంటే మరికొంతకాలం వెయిట్ చేయాల్సిందే.

## పుష్ప డైలాగ్ దించేసిన ఆర్ఎక్స్ 100 బ్యూటీ పాయల్ రాజ్‌పుత్



తెలుగు రాష్ట్రాలతోపాటు పాన్ ఇండియావైడ్‌గా ఇప్పుడంతా పుష్పరాజ్ మేనియా కొనసాగుతుంది. సుకుమార్ దర్శకత్వంలో టాలీవుడ్ స్టార్ యాక్టర్ అల్లు అర్జున్ టైటిల్ రోల్ పోషించిన సీక్వెల్ ప్రాజెక్ట్ పుష్ప 2 ది రూల్ డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే థియేటర్ల వద్ద మోత మోగిపోతుంది. పుష్ప అంటే ఫైర్ అనుకుంటివా.. వైల్డ్ ఫైర్ అంటూ సాగే డైలాగ్స్‌ను అనుసరిస్తూ మూవీ లవర్స్ చేస్తున్న వీడియోలు నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. తాజాగా ఆర్ఎక్స్ 100 భామ పాయల్ రాజ్ పుత్ ఈ డైలాగ్ డబ్ స్మాష్ వీడియో చేసింది. గ్లామర్‌తో మెస్మరైజ్ చేస్తూ పుష్పరాజ్ స్టైల్‌లో ఎక్స్‌ప్రెషన్స్ ఇస్తూ సేమ్ డైలాగ్‌ను చెప్పింది. ఇప్పుడీ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇదిలా ఉంటే మరికొన్ని గంటల్లో పుష్ప స్పెషల్ షోలు పడబోతున్నాయని తెలిసిందే. సీక్వెల్‌లో ఫహాద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై అంచనాలు భారీగానే ఉన్నాయి.

## దిగజారిన జైస్వాల్, విరాట్ కోహ్లీ ర్యాంకులు.. నెంబర్ వన్ బౌలర్‌గా జస్ప్రీత్ బుమ్రా..!



**న్యూఢిల్లీ-నవభూమి:** ఐసీసీ టెస్ట్ ర్యాంకులను బుధవారం ప్రకటించింది. ఆస్ట్రేలియాపై సెంచరీలు చేసిన యశస్వీ జైస్వాల్‌తో పాటు విరాట్ కోహ్లీ ర్యాంకులు దిగజారాయి. జైస్వాల్ ర్యాంక్ నాల్గో స్థానానికి చేరగా.. విరాట్ కోహ్లీ ర్యాంక్ 14వ స్థానానికి పడిపోయింది. ఇక మిస్టరీ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా టెస్ట్ నెంబర్ వన్ బౌలర్‌గా కొనసాగుతున్నాడు. ప్రస్తుతం టీమిండియా ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్నది. ఐదు టెస్టుల సిరీస్‌లో టీమిండియా 1-0 తేడాతో ఆధిక్యంలో ఉన్నది. పెర్త్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 295 పరుగుల తేడాతో విజయం సాధించింది. పెర్త్ టెస్ట్‌లో యశస్వీ జైస్వాల్ సెంచరీతో కదం తొక్కాడు. 22 ఏళ్ల బ్యాట్స్‌మెన్ రెండో ఇన్నింగ్స్‌లో 15 ఫోర్లు, మూడు సిక్సర్ల సాయంతో 161 పరుగులు చేశాడు. టెస్ట్ బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో జైస్వాల్ 825 రేటింగ్ పాయింట్లతో నాలుగో స్థానానికి చేరుకున్నాడు. ప్రస్తుతం సెకండ్ ప్లేస్‌కి హ్యారీ బ్రూక్ చేరుకున్నాడు. ఇక విరాట్ కోహ్లీ పెర్త్ టెస్ట్ సెకండ్ ఇన్నింగ్స్‌లో 100 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. 689 రేటింగ్ పాయింట్లతో 14వ స్థానానికి చేరుకున్నాడు. పెర్త్ టెస్టులో రిషబ్ పంత్ బ్యాట్ రాణించలేకపోయాడు. తొలి ఇన్నింగ్స్‌లో 37 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో కేవలం ఒక పరుగు మాత్రమే చేశాడు. అయితే, ర్యాంకింగ్‌లో ఎలాంటి ప్రభావం కనిపించలేదు. ప్రస్తుతం 736 రేటింగ్ పాయింట్లతో ఆరో స్థానంలో ఉన్నాడు. ప్రస్తుతం టాప్-10లో కేవలం కేవలం పంత్, జైస్వాల్ మాత్రమే ఉన్నారు. ప్రస్తుతం టెస్ నెంబర్ వన్ బ్యాట్స్‌మెన్‌గా ఇంగ్లండ్ ఆటగాడు జో రూట్ 895 పాయింట్లతో ఉన్నాడు.

## వైభవ్ సూర్యవంశీ 76 నాటౌట్.. 10 వికెట్ల తేడాతో నెగ్గిన ఇండియా



**షార్జా-నవభూమి:** ఆసియాకప్‌లో ఇవాళ జరిగిన మ్యాచ్‌లో ఇండియా-19 జట్టు 10 వికెట్ల తేడాతో యూఏఈ జట్టుపై విజయం సాధించింది. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన యూఏఈ జట్టు.. 44 ఓవర్లలో 137 రన్స్‌కు ఆలౌటైంది. రాయన్ అత్యధికంగా 35 రన్స్ చేశాడు. యుదజిత్ గుహ 3 వికెట్లు తీసుకోగా, చేతన్ శర్మ.. హార్దిక్ రాజ్‌లు చెరి రెండు వికెట్లు తీసుకున్నారు. 138 రన్స్ టార్గెట్‌తో బరిలోకి దిగిన ఇండియా జట్టు.. సునాయాసంగా విజయాన్ని అందుకున్నది. 1601 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 143 రన్స్ చేసి 10 వికెట్ల తేడాతో భారత్ విక్టరీ కొట్టింది. వైభవ్ సూర్యవంశీ 76, ఆయుష్ మాత్రే 67 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచారు. వైభవ్ ఇన్నింగ్స్‌లో ఆరు సిక్సర్లు, మూడు ఫోర్లు ఉన్నాయి. కోటి రూపాయలు పెట్టి వైభవ్‌ను ఐపీఎల్‌లో రాజస్థాన్ జట్టు కొన్న విషయం తెలిసిందే.

నవక్రీడ

## కొత్త బాధ్యతలు చేపట్టిన సారా టెండూల్కర్.. ప్రకటించిన సచిన్



**న్యూఢిల్లీ-నవభూమి:** క్రికెట్ లెజెండ్ సచిన్ టెండూల్కర్ కుమార్తె సారా టెండూల్కర్ కొత్త బాధ్యతలు చేపట్టారు. సచిన్ టెండూల్కర్ ఫౌండేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ విషయాన్ని సచిన్ ఎక్స్ వేదికగా ప్రకటించారు. సచిన్ టెండూల్కర్ ఫౌండేషన్ మారుమూల గ్రామాల్లోని పిల్లలకు వైద్య సేవలు అందిస్తూ, పోషకాహార లోపాన్ని తగ్గించేలా సహాయ కార్యక్రమాలు చేపడుతోంది. లండన్‌లోని యూనివర్సిటీలో క్లినికల్ అండ్ పబ్లిక్ హెల్త్ న్యూట్రిషన్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసిన సారా.. ఇప్పుడు ఈ ఆ ఫౌండేషన్ బాధ్యతలు చేపట్టడం పట్ల సచిన్ సంతోషం వ్యక్తం చేశారు. సారాకు వైద్య రంగంపై ఉన్న విద్యా పరిజ్ఞానం సమాజానికి మరింత తోడ్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు మారుమూల గ్రామాల్లోని చిన్నారులతో దిగిన ఫొటోలను సచిన్ ఎక్స్ వేదికగా పంచుకున్నారు. సచిన్ ట్వీట్ చూసిన పలువురు సినీ, క్రీడా ప్రముఖులు సారాకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**